# చైతన్యం

సంకల్ప బలం

డిసెంబర్ 2019

రూ. 20





దేశమంతా

దిశ

ప్రభంజనం










వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి



# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -9 డిసెంబర్ 2019 సంచిక - 3


## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| మానససరోవర యాత్ర | 6 |
| పూరి జగన్నాధస్వామి వైభవం | 12 |
| ప్రేమంటే ఇంతే | 28 |
| గడిలో దాగిన వైజ్ఞానిక నుడి | 33 |
| తెలుగు పద్య రత్నాలు | 34 |
| మా ఊరి నందుల కథ | 38 |
| ప్రహేళిక | 50 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| విశిష్టం - మార్గశిరం | 17 |
| మధ్య తరగతి తండ్రి | 21 |
| నాలుగవ రాష్ట్రపతి వి.వి.గిరి | 22 |
| అంకెలు,సంఖ్యలు: ఆరు | 26 |
| అవగాహన | 36 |
| పి.బి.శ్రీనివాస్ | 39 |
| అస్తమానూ లడ్డూలేనా | 43 |
| తిరుమల శ్రీనివాసాచార్య | 48 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## భయం గుప్పిట్లో మహిళలు.
## దిశ ఉదంతంతో భగ్గుమన్న భారతం.

దిన దిన గండంగా మారుతున్న మహిళల జీవితాలకు భరోసా ఇచ్చే-దెవరు? వయస్సుతో నిమిత్తం లేకుండా స్త్రీ అంటేనే చాలు అసభ్యంగా ప్రవర్తిస్తూ, ప్రాణాలు తియ్యడానికి కూడా వెనుకాడక, మృగాల్లా ప్రవర్తిస్తున్న మగ జాతి. ఇలా ప్రవర్తించడానికి కారణం ఎవరు? కుటుంబ సభ్యులా? తోటి స్నేహితులా? సమాజమా? సినిమాలా? సెల్ ఫోన్లా? ప్రభుత్వమా? ఆలోచిస్తే, అన్నీ ప్రశ్నలే.

పగలూ రాత్రి తేడా లేకుండా రోజు రోజుకు పెరిగిపోతూ, జరుగుతున్న అత్యాచారాలకు పైన చెప్పిన వన్నీ కూడా కారణం అని చెప్పుకోక తప్పదు. మానవ విలువలకు, సంస్కృతీ సాంప్రదాయాలకు, కట్టుదిట్టమైన కుటుంబ వ్యవస్థకు, వేదాలకు పుట్టినిల్లు మన భారతదేశం అని ఎంతో గొప్పగా చెప్పుకునే నోళ్లు మూతపడే పరిస్థితికి దిగజా-రిందంటే ప్రస్తుత పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చును.

ఇటీవలే హైదరాబాదులో ఇంకా ప్రజలంతా తిరుగుతూ జనసంచారం చేసే సమయంలోనే ఒక వైద్యు రాలిని అత్యంత దారుణంగా హింసించి హత్య చేయడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. **ఢిల్లీ నుండి గల్లీ దాకా మహిళలంతా ఒకే కూటమిగా ఏర్పడి అక్కడికక్కడే ఆ దిశను హింసించిన నరరూప రాక్షసులను ఉరి తియ్యాలని పోరాటం సాగించారు**. ప్రజలంతా ముక్త కంఠంతో ప్రభుత్వాన్ని కోరుతున్నారంటే, ప్రజలు ఎంత విసిగి పోతున్నారో అర్ధం చేసుకోవచ్చును. ప్రపంచం లోనే ఒక హాట్ టాపిక్ గా మారింది. ఇలా చేయవలసిన అగత్యం పట్టిందంటే తక్షణం ప్రజలూ, ప్రభుత్వం సమాజ భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఇందుకు ముఖ్యంగా కుటుంబ వ్యవస్థ కట్టుదిట్టంగా ఉండాలి. భార్యా భర్తల మధ్య గొడవలు తెచ్చుకో కుండా, సద్దుబాటు గుణం ఉండాలి. ఇంటిని దేవాలయంలా ప్రశాంత వాతావరణంతో ఉంచి, మన సంస్కృతీ సంప్రదాయాలతో పిల్లలను పెంచాలి. కుటుంబ వ్యవస్థ గురించి, పెద్దలను గౌరవించడం గురించి, గురువులను గౌరవించడం, సమాజం పట్ల వారి ప్రవర్తన లాంటి విషయాలను పిల్లలకు తెలియజేస్తూ, విలువలతో పిల్లలను పెంచడం తల్లితండ్రుల కనీస బాధ్యత. మనం పిల్లలను పెంచి సమాజంలో వదులుతున్నామంటే, కడుపునిండా అన్నం పెట్టి, శారీరక శక్తి నిచ్చి, బలంగా తయారు చేసి పంపిస్తే సరిపోదు! మానసికంగా పరిపూర్ణత చెందాలి. మనిషి మానసికంగా పరిపక్వత చెందాలంటే, ఆధ్యాత్మిక చింతన ఉండాలి. భగవంతుడు, భక్తి, పాపం పుణ్యం అనేవి మనసుకి నాటాలి. వాళ్ళు పుణ్యం సంపాదించక పోయినా పర్వాలేదు. కానీ పాపాలు చేయకుండా చూడవ-లసిన బాధ్యత తల్లితండ్రులదే. శ్రీ చాగంటి, శ్రీ గరికపాటి లాంటి వారి ప్రవచనాలు వినేటట్లు అలవాటు చేయాలి. పిల్లలు తప్పు చేసారు, అంటే ఆ బాధ్యత చాలావరకు తల్లితండ్రులదే అని గుర్తించాలి. వాళ్లకి అడిగినవీ, అడగనివీ అన్నీ వాళ్లకి ఇచ్చెయ్యడం, పిల్లలు ఎలా ప్రవర్తించినా, తల్లి తండ్రులు పట్టించుకోక పోవడం, దాంతో వాళ్ళు చెడు-మార్గాలను అనుసరించడం, తరువాత పెద్దలంతా తలలు పట్టుకోవడం జరుగుతోంది.

అలాగే సమాజంలో సినిమాలు, సెల్ ఫోన్ లు కూడా పిల్లలు చెడు మార్గాలు పట్టడానికి ఉపయోగపడు-తున్నాయి. చెడు ఏ విధంగా జరుగుతోందో ప్రస్తుత సమాజంలో అని సినిమాలలో చూపించడం వల్ల యువకుల దృష్టి ఆటే మళ్ళుతోంది. అలాగే సెల్ ఫోన్ లో ఎంతో ఉపయోగకర అంశాలు ఉన్నా, వాటిలో చెడు మాత్రమే చూ-స్తున్నారు. కాబట్టి వారి మైండ్ సెట్ మారాలి. మారాలంటే స్కూల్స్, కాలేజెస్ లో కూడా మోరల్ క్లాసులు ఉండాలి. అక్కడ కూడా విలువలను నేర్పించాలి. ఇక ప్రభుత్వానికి వస్తే, ప్రజలు ఎక్కడ పోలీసు స్టేషన్ కి వెళ్లి కంప్లైంట్ ఇచ్చినా వారు వెంటనే స్పందించాలి. చివరకు 9 రోజుల లోపే దిశకు అన్యాయం జరిగిన చోటులోనే పోలీసులు ఆ నలుగురిని ఎన్ కౌంటర్ చేసారు. పోలీసులపై రాళ్ళు కురిపించిన ప్రజలే పూలవాన కురిపించి పోలీసులకు, తెలంగాణా ప్రభుత్వానికి జేజే లు పలికారు. న్యాయ వ్యవస్థ త్వరిత గతిని స్పందించక విసిగిపోయిన ప్రజల తీర్పు ఇది. చట్టాలలో మార్పు, అమలులో కుడా సత్వర చర్యలతో పాటు, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన అత్యవసర నంబర్లను అందరూ అవసరానికి వినియోగించుకోవాలి.

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

1. బ్రహ్మ పుత్ర పుష్కరాలు , శ్రీ శైలం ఫోటోలు అద్భుతంగా ఉన్నాయి. ఎడిటోరియల్ సమయానుకూలంగా వ్రాస్తున్నారు. మానస సరోవర యాత్ర కళ్ళకు కట్టినట్లు వ్రాస్తున్నారు. వీడియో కూడా చూపిస్తున్నారు.

శ్రీమతి శ్రీ లత , శ్రీమతి ప్రతిమ, శ్రీ రామ్ ---- కడప. శ్రీ మన్నారాయణ, శ్రీమతి వాణి, కుమారి ఫణి ----బెంగుళూరు.

2. పూరి జగన్నాధ స్వామి వైభవం గురించి చాలా చక్కగా వివరిస్తున్నారు. కథ మేము ఎప్పుడూ వినలేదు. కార్తీక మాసం విశిష్టత గురించి రామానందం గారు వివరించడమే కాక , ఏ విధంగా ఆచరించాలో కూడా బాగా చెప్పారు.

శ్రీ రామారావు , శ్రీమతి రమణి , శ్రీమతి మధు ----- కర్నూలు. శ్రీ ప్రభాకర్ , శ్రీమతి లలిత, శ్రీ సుబ్బారావు ---- విజయనగరం .

3. భువన చంద్ర గారు ఏ కథ వ్రాసినా అద్భుతంగా ఉంటుంది. నేను గేటెడ్ --- నువ్వు ఎల్ . ఐ . జి కమ్యూనిటీ కథ నవ్వుకుంటూ బాగా ఎంజాయ్ చేస్తూ చదివాము . రాష్ట్రపతుల గురించి విలువైన విషయాలను మాకు పాలెపు బుచ్చిరాజు గారు అందిస్తున్నారు. పిల్లలకు కూడా బాగా ఉపయోగపడతాయి.

శ్రీమతి స్నేహ , శ్రీమతి పద్మ , శ్రీ శ్రీనివాస్ ---- నల్గొండ. శ్రీమతి సువర్ణ, శ్రీమతి అనసూయ, శ్రీ కమలాకర్ ------ రామగుండం.

4. వేమూరి వెంకటేశ్వర రావు గారు 'ఐదు' అంకె గురించి బాగా వివరించారు ఐదు నక్షత్రాల హోటళ్ళని , పంచ భక్ష్యములు , పంచాక్షరీ అంటూ చాలా బాగా వ్రాసారు. ఇంద్రగంటి సుబ్బారావు గారు వ్రాస్తున్న 'ప్రేమంటే ఇంతే' సస్పెన్స్ తో రాధా కృష్ణ ల కబుర్లతో బావుంటోంది. అభ్యుదయ భావాల గురించి బాగా చెప్పారు.

శ్రీ ఆనంద్ ,శ్రీమతి రమణి, శ్రీ చక్రి ----- కాకినాడ. శ్రీమతి అపర్ణ , శ్రీ సుమలత, శ్రీ సురేష్ ------ బొంబాయి.

5. డా . చాగంటి కృష్ణ కుమారి గారు అందిస్తున్న వైజ్ఞానిక నుడి చెయ్యాలని ప్రయత్నిస్తున్నా, ఇంకా పూర్తిగా చెయ్యలేక పోతున్నాము. దంతుర్తి శర్మ గారు వ్రాస్తున్న తెలుగు పద్య రత్నాలులో 'విష్ణు కథలు కళ్యాణాత్మకాలు అంటూ చాలా బాగా వ్రాశారు.

శ్రీమతి పద్మ, శ్రీమతి , నీలిమ , శ్రీ సత్యన్నారాయణ ----- వరంగల్. శ్రీమతి విమల , శ్రీమతి నీలిమ , శ్రీ వంశీ ------- పూనా.

6. రాజసాలకు పోకుండా పిల్లలను ఏవిధంగా పెంచాలో 'అసలైన సంపద' కథ ద్వారా బాగా తెలియజేశారు . కథ చాలా బావుంది. నందుల ప్రభాకర శాస్త్రి గారు వ్రాస్తున్న ' నందుల ఆత్మీయ కథ బావుంటోంది. పల్లెటూరికి తలపించే ఈ కథ లో ఎన్నో పల్లె కబుర్లు కూడా తెలుస్తున్నాయి. పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వించే అల్లూరి రామలింగయ్య గురించి అని పూర్తిగా చదవకుండానే నవ్వొస్తోంది. అది వారి స్పెషాలిటీ.

శ్రీమతి మాలతి, శ్రీమతి పల్లవి , శ్రీ కుమార్ ---- రాజమండ్రి. శ్రీమతి అరుణ , శ్రీమతి కానక దుర్గ, శ్రీ మధు ----- హైదరాబాదు.

7. హాస్యపు జల్లు-అల్లు అంటూ పోడూరి గారు చక్కగా వ్రాసారు. మాకు తెలియని ఎన్నో విషయాలు తెలిసాయి. రచయితకు ధన్యవాదాలు. అలాగే ఎలెక్ట్రాన్ గారి మలుపులు కథ చాలా బావుంది. రచయితకు నమస్సులు.

శ్రీమతి లత, రాధ -- రాయవరం. రమణారావు, వెంకటేశ్వర్లు - తిరుపతి

8. నీరు విలువ వ్యాసం అద్భుతంగా వుంది. ప్రజలందరం నీటి విలువ తెలుసుకోవాల్సిన తరుణం ఇది. ఇది ప్రతి ఒక్కరూ చదివి ఆచరించాలి. రచయిత సామాజిక స్పృహకు హేట్స్ ఆఫ్.

ప్రసాద్, లక్ష్మణ్, రాజేష్, తరుణ్ - అత్తాపూర్

# కల నిజమాయె - ముక్తినాథ్ మానస సరోవర యాత్ర

ఆ యాత్రా అనుభూతులను, ఆ ఆనందాన్ని పొందుతూ అంతా నిద్రలోకి జారుకున్నారు. అలా మెల్లగా 'సాగా' ఊరు జేరుకున్నాము .

హోటల్ రిసెప్షన్ లో మా మా రూమ్ కీస్ తీసుకుని ఎవరి రూమ్ కి వాళ్ళు వెళ్లాం. మొహాలు కడుక్కుని, ఫ్రెష్ అయ్యి, మధు బన్ వారి భోజనశాలకి వెళ్లి భోజనాలు కానిచ్చేశాం. రూమ్ కి వచ్చి యాత్ర మధుర అనుభూతులను నెమరు వేసుకుంటూ నిద్రలోకి జారుకున్నాం. మళ్ళీ పొద్దున్నే బయలుదేరి, కేరూంగ్ లో ఆగకుండా, ఎంబసీ కి వెళ్లి బోర్డర్ దాటేయాలని మా ప్లాన్.

పొద్దున్నే లేచి త్వరత్వరగా తయారైపోయి, టిఫిన్లు కానిచ్చేసి, బస్ లో కూర్చున్నాం. బస్ బయలుదేరింది. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంది. ఓ గంట ప్రయాణం చేశామనుకొంటాను. బస్ ఆగిపోయింది. మా బస్ ముందు అయిదారు బస్సులు ఆగిపోయి కనపడ్డాయి. మళ్ళీ ఏవయిందా అనుకుంటూ బస్ దిగాము. అక్కడ మనం నదిని క్రాస్ చేయాలి. నది ఎక్కువ వెడల్పు లేదనుకోండి. అక్కడ



నది మీద వేసిన తాత్కాలిక బ్రిడ్జి నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయింది. అప్పటికే అక్కడ రోడ్ రిపేర్ గాంగ్ లు పని చేస్తూ కనపడ్డాయి. ప్రవాహం పైపుల్లోంచి పోయేటట్టుగా బుల్డోజర్లతో పైపులు వేశారు. అల్లా మూడు నాలుగు పైపులు, ఒకదాని పక్క ఒకటి వేశారు. దానిమీద మట్టి, రాళ్ళు పోసి మొత్తానికి నది మీద ఓ రోడ్డు తయారుచేశారు. వాళ్ళ దగ్గరున్న రెండు లోడెడ్ టిప్పర్లు ఆ రోడ్డు మీదనుంచి పోనిచ్చి, రోడ్డు హెవీ వెహికిల్స్ పోవటానికి భయం ఏమీ లేదని నిర్ధారించుకుని, ఆగి వున్న బస్సులు పోవటానికి అనుమతిచ్చారు. పొద్దున్న సుమారు 9 గంటలకు అక్కడ ఆగిన మేము తిరిగి ప్రయాణం కొనసాగించటానికి అనుమతి



లభించేటప్పటికి సాయంత్రం 4 గంటలు అయ్యింది. అంటే ఆ నది దగ్గర దాదాపు పది గంటలు ఉండిపోయాం. అనుకోని అవాంతరం అవటంతో మా గైడ్లు మాకు లంచ్ సమకూర్చలేకపోయారు. ఏదో స్నాక్స్ ఇచ్చారు. అదృష్టం కొద్దీ సాయంత్రం కల్లా రోడ్డు రిపేర్ పూర్తయింది, లేకపోతే రాత్రంతా అక్కడ గడపాల్సి వచ్చేది కదా అనిపించింది.

ఈ అనుకోని ఘటన వల్ల- మేము ఈరోజు బోర్డర్ క్రాస్ చేసే అవకాశం లేదు. అంటే రాత్రికి కేరుంగ్ ఊళ్లోనే గడపాలి.

రాత్రికి కేరుంగ్ చేరుకున్నాం. మళ్ళీ అదే హోటల్. ఎవరి రూమ్ కి వాళ్ళు చేరుకున్నాం. ఇక్కడి- నుంచి బోర్డర్ ఎంతోదూరంలో లేదు. ఓ అరగంట ప్రయాణం. రేపు పొద్దున్న ఏ పదింటికో బయలుదేరితే సరిపోతుంది. అంతకన్నా ముందర బయలుదే- రినా ప్రయోజనం ఏమీ ఉండదు. చైనా బోర్డర్ ఆఫీసులు ఎలాగో 11 గం. దాకా తెరవరు.

పొద్దున్నే లేచి తయార- య్యి, కాసేపు కేరుంగ్ వీధులలో తిరిగాం. మిగిలిపోయిన చైనీస్ కరెన్సీని తిరిగి మన భారతీయ రూపాయల్లోకి, భారతదేశ యా- త్రికులు కాని వారు డాలర్లలోకి మార్చుకున్నాం.

పొద్దున్న 10 గంటలక- ల్లా మళ్ళీ మా బస్సు బయలు దేరింది. అందరం తిరిగి




చైనీస్ ఎంబసీ చేరుకున్నాం. మాతోపాటు యాత్రంతా వచ్చి, జాగ్రత్తగా డ్రైవ్ చేసి మమ్మల్ని మా యాత్ర క్షేమంగా పూర్తిచేసుకోవ- డంలో సహకరించిన డ్రైవర్ కు అందరం కృతజ్ఞతలు తెలుపు- కున్నాం. అందరూ కొంత డబ్బు కూడా అతనికి టిప్ రూపంలో ఇచ్చాము. ఆ డ్రైవర్ చాలా సం- తోషించాడు.

మా లగేజ్ తీసుకుని ఎంబసీ దగ్గర ఇమ్మిగ్రేషన్ క్యూ లో నిల్చున్నాం. ఒక అరగంట- లో చెకింగ్ అంతా పూర్తయ్యిం- ది. తిరిగి నేపాల్ లోకి అడుగు- పెట్టాం. నేపాల్ తో మనకు ఉన్న సత్సంబంధాల వల్ల కాబోలు, నేపాల్ లోకి అడుగు పెట్టగానే సొంత దేశం లోకి అడుగుపెట్టి- నట్టు అనిపించింది. అలాగని టిబెట్ (చైనా) బాగా లేదని మా ఉద్దేశ్యం కాదు. ఏమాట కామాట చెప్పుకోవాలి. అక్కడ కూడా ప్రజలు చాలా ప్రేమగా, మర్యాదపూర్వకంగా వ్యవహరిం- చారు.

ఎంబసీ లోంచి బయటకి వచ్చాక కొంచెం దూరం నడిస్తే గాని నేపాల్ బస్సులు ఆగే చోటు రాదు. మా లగేజీలు మొత్తం గైడ్లు ఏర్పాటు చేసిన మనుషులే మోసుకువచ్చారు.

శ్యాబ్రుబేసి నుంచి ఖాట్మండు కి హెలికాప్టర్ లో వెళ్ళే అవకాశం ఉంది. ఒక్కో హెలికాప్టర్లో 5 గురిని తీసుకువెడతారు. దాంతో అయిదుగురు అయిదుగురు చొప్పున గ్రూపులు తయారయి- పోయాయి. కొంచెం బాధ వేసిన విషయం ఏమిటంటే భాషా ప్రా- తిపదిక మీద, ఎవరి భాష వారు వాళ్ళు గ్రూపుగా అయిపోయారు. పర భాష వాళ్ళను చేర్చుకోవటా- నికి ఎవరూ ఇష్టపడలేదు. మన భారదేశపు ఈ ప్రాంతీయ (దుర)

భిమానం ఎప్పుడు పోతుందో కదా? మన భాష వాళ్ళం నలుగురమే మిగిలాం. అందులో కూడా ఓ కుటుంబం అంత డబ్బు ఖర్చుపెట్టి (మనిషికి 25 వేలు భారతీయ రూపాయలు) హెలి-కాప్టర్ లో వెళ్ళటానికి తయారవలేదు. దాంతో మేం హెలికాప్టర్ లో వెళదామనుకున్నా కుదరలే-దు. ఎలాగైనా హెలికాప్టర్ లోనే వెళ్ళాలి అనుకుంటే, మిగతా 3 టికెట్ల డబ్బు కూడా కట్టి వెళ్ళాలి. అది శుద్ధ దండగ అనిపించింది. మేం ట్రావెల్స్ వాళ్ళు అరేంజ్ చేసే బస్సు లోనే వెళదాం అని నిశ్చ-యించుకున్నాం.

ఆ బస్సులు ఆగేచోట మాకు వేడి వేడి టీ ఇచ్చారు. కొంచెం దూరంలో ఒక స్ట్రెచర్ మీద ఓ పార్థివ దేహం ఉంది. కైలాష యాత్రలో తనువు చాలించిన ఓ పుణ్యాత్ముడు ఆయన. ఇది మామూలే అని అక్కడవాళ్ళు చెప్పారు. ఆ పరమశివుని సన్ని-ధిలో తమ తనువు చాలించాల-ని ఎంతోమంది కోరుకుంటారు. తమ ఆరోగ్యం సహకరించకపో-యినా ఈ యాత్ర చేయాలని ఉబ-లాటపడతారు. అక్కడే ప్రాణం పోవటం కన్నా కోరుకోవలసింది ఏముంటుంది అని అనుకొంటా-రు. నిజంగా వారంతా పుణ్యాత్ము-లు, అదృష్టవంతులూను అని-పించింది.

మేమంతా అక్కడినుంచి ఒక జీప్ లో శ్యాబ్రుబేసి కి చేరు-




కొన్నాం. అక్కడ మనం ఇదివరకు భోంచేసిన హోటల్ లోనే మాకు లంచ్ అరేంజ్ చేసారు.

భోజనాలు కానిచ్చి మళ్ళీ-బయలుదేరాం. ఒక అయిదు నిముషాలు ప్రయాణం చేసామో లేదో ఒక చోట జీపులు అన్నీ ఆగిపోయి కనిపించాయి. ఏమిటా అని ఆరా తీస్తే తెలిసింది ఎదురుగా పెద్ద కొండ రాయి పడిపోయి రోడ్డు అంతా బ్లాక్ అయిపోయిందిట. ఆ రాయి చిన్న చిన్న పేలుడు పదార్థాలు పెట్టి బద్దలు కొట్టాలిట. ఎన్ని గంటలు పడుతుందో చెప్పలేము అని అన్నారు. కానీ ఒక ఉపాయం ఉందని చెప్పారు అక్కడవాళ్ళు. అక్కడ ఉన్న కొండ ఎక్కి అటు



వైపు ఉన్న రోడ్డుకి వెళితే అక్కడ బస్సులు ఉంటాయి. వాటిలో ఖాట్మండు వెళ్ళచ్చు. నాకు చాలా భయం వేసింది. 200 అడుగుల పైన ఎత్తున్న ఆ కొండ నేను ఎక్కడ ఎక్కగలను? ఇది జరిగే పనేనా అనిపించింది. కానీ వేరే మార్గం లేదు. నేను నిశ్చయించుకోలేక ఆలోచిస్తూ కూర్చున్నాను. 'అమ్మా, మీరు ఆలస్యం చేస్తే కుదరదు. ఆ రాయి బ్లాస్టింగ్ ప్రారంభిస్తే మనం ఈ కొండ ఎక్కి కూడా వెళ్లలేము. ఇక్కడే ఉండిపోవాల్సివస్తుంది. మీరేం భయపడక్కరలేదు. మీకు కావాలంటే మనుషుల్ని ఏర్పాటు చేస్తాను. వారు మిమ్మల్ని ఎత్తుకుని కొండ దాటిస్తారు' అని మాతో ఉన్న గైడ్ అన్నాడు. ఛ, వాళ్ళు నన్ను ఎత్తుకుని నా బరువు మోస్తూ కొండ ఎక్కడమేమిటి, ఇది మహా పాపం అని నేను అనుకుని నేను నడుస్తాను పదండి అన్నాను. ఆ గైడ్ నాతో 'అమ్మా, మీకేం భయం లేదు, నేను, ఈ కుర్రాడు మీ వెంటే ఉంటాం, మిమ్మల్ని జాగ్రత్తగా తీసుకెళ్ళే బాధ్యత మాది' అని భరోసా ఇచ్చాడు. మాతో వచ్చిన అండమాన్ కు చెందిన సారథి గారు నాకు చాలా ఎంకరేజ్మెంట్ ఇస్తూ కొండ ఎక్కటానికి ప్రోత్సహించారు. నిజంగా ఆ పరమశివుని కృపే అనుకుంటాను, నేను కొండ ఎలా ఎక్కేసానో నాకే తెలీదు. నాగురించి భయపడ్డ మావారు కూడా చాలా ఆశ్చర్యపోయారు. అలా అందరి సహకారంతో ఆ కొండ ఎక్కి అటువైపు రోడ్డు మీదకి చేరుకున్నాం. చెప్పినట్టుగానే అక్కడ మాకోసం బస్సు వేచి వుంది. నాకు కొండ ఎక్కటంలో సహకరించిన అక్కడి స్థానికులకు కృతజ్ఞతలు తెలిపి, వారి చేతిలో వద్దంటున్నా కొంత డబ్బు పెట్టి బస్సు ఎక్కాం.





వర్షాలు బాగా పడ్డాయేమో, రోడ్డు చాలా పాడయిపోయింది. చీకటి, గతుకుల రోడ్డు, అదీ వెడల్పు తక్కువ రోడ్డు, చిరు జల్లుల మధ్య మా ప్రయాణం ఎలా సాగిందో నేను వర్ణించలేను. ఒక పక్క లోతైన లోయలు, మరొక పక్క కొండల మీదనుంచి రోడ్డు మీదకి వరదలా ప్రవహిస్తున్న నీరు, మేము ఖాట్మండు జాగ్రత్తగా చేరతామా అనిపించింది. మా డ్రైవర్ చాలా జాగ్రత్తగా మమ్మల్ని తీసుకెళ్ళాడు. అతని స్కిల్స్ కి మా జోహార్లు. ఖాట్మండు ఊరి బయటకు చేరేసరికి రాత్రి పది అయింది. అక్కడ చాలా పెద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఓ రెండు గంటలు అక్కడ వేచియుంటే కాని అక్కడనుంచి బయటపడటానికి అవకాశం రాలేదు. రాత్రి 12 గంటలు అవుతుండగా మా హోటలుకి చేర్చాడు డ్రైవర్ మమ్మల్ని. మా గైడ్లకు మనసారా ధన్యవాదాలు తెలిపాం మా యాత్రంతా మా వెన్నంటి ఉండి మాకు ఎంతో సహకారం అందించినందుకు.

హోటల్ రూమ్ కి చేరాం. యాత్ర ప్రారంభంలో హోటల్ లాకర్ లో పెట్టిన మా లగేజీలు తిరిగి తీసుకున్నాం. బాగా అలిసిపోయి ఉన్నామేమో, హోటల్ లో వేడినీళ్ళ షవర్ బాత్ చేస్తుంటే, ప్రాణం లేచొచ్చింది. తర్వాత డైనింగ్ హాల్ కి వెళ్లి, భోంచేసి వచ్చాము. ఆ రాత్రి పిచ్చ నిద్ర పట్టేసింది.

మా టూర్ ప్యాకేజ్ ప్రకారం, ఖాట్మండు లోకల్ సైట్ సీయింగ్

కూడా మాకు వాళ్ళు ఏర్పాటు చేయాలి. హెలికాప్టర్ లో మధ్యాహ్నామే వచ్చిన వాళ్లకి, అదే రోజు సాయంత్రమే ఆ ట్రిప్ ఏర్పాటు చేసారు ట్రావెల్స్ వాళ్ళు. మేం మాత్రం ఇది మిస్ అయ్యాం. అందుకని మాకు మర్నాడు ఈ లోకల్ ట్రిప్ ను ఏర్పాటు చేసారు. సాయంత్రం రెడీగా ఉండండి తీసుకెళతాం అని చెప్పారు ట్రావెల్స్ వాళ్ళు. పొద్దున్నే లేచిన తరువాత ఏం చెయ్యాలా అని ఆలోచించాం. పశుపతినాథ్ గుడి కి వెళ్ళి ఆ మహాశివుని దర్శించుకుందామని నిశ్చయించాం. హోటల్ రిసెప్షన్ కి వెళ్లి గుడికి ఎలా వెళ్ళాలో, డైరెక్షన్స్ తెలుసుకుందామని కనుక్కున్నాం.

'ఈరోజు శిఖరాగ్ర సమావేశం ఉంది. పొరుగు దేశాల ప్రధాన మంత్రులు అంతా వస్తున్నారు. ముఖ్యంగా భారత ప్రధాన మంత్రి శ్రీ మోడీ కూడా వస్తున్నారు. ఆయనకు అఖండ స్వాగతం ఏర్పాటు చేయబడింది. ఆయన పశుపతినాథ్ మందిరం కూడా వెళ్లి, దేవుని దర్శనం చేసుకుంటారు. కాబట్టి మీకు ఈరోజు అక్కడకు వెళ్ళటం కుదరదు. అక్కడంతా హెవీ సెక్యూరిటీ ఉంది' అంటూ ఆ రిసెప్షన్ క్లెర్క్ చెప్పాడు. ఏదయితే అది అవుతుంది, అక్కడకు వెళ్దామని నిశ్చయించుకుని బయలుదేరాం. హోటల్ బయటకు వచ్చి, ఓ ట్రాఫిక్ పోలీస్ సహాయంతో ఆటో



కుదుర్చుకుని గుడికి బయలుదేరాం. గుడి దాకా తీసుకువెళ్ళలేను, సెక్యూరిటీ వాళ్ళు ఒప్పుకోరు, కొంత దూరంలోనే విడిచిపెడతాను అని ఆటో డ్రైవర్ అన్నాడు. సరే అలాగేలే పోనీయమన్నాం. దారి పొడుగునా పెద్ద పెద్ద మోడీ కి ఘన స్వాగతం అన్న కట్ ఔట్లు కనపడ్డాయి. అమెరికా అధ్యక్షుడు మన దేశానికి వస్తే మనం ఎంత ఘనంగా స్వాగతం పలుకుతామో, అంతకన్నా ఎక్కువగా నేపాలీయులు భారత ప్రధానమంత్రికి స్వాగతం పలికారు.

ఆటో గుడికి బాగానే దగ్గరగా తీసుకెళ్ళాడు. మన ప్రధానమంత్రి పొద్దున్న కాదు సాయంత్రమే దర్శనానికి వస్తున్నారట, అందుకని మేం లోపలి వెళ్ళటానికి ఏమీ అభ్యంతరం చెప్పలేదు సెక్యూరిటీవాళ్ళు.


స్పెషల్ అభిషేకం చేయించుకుందామని టికెట్ కౌంటర్ కు వెళ్లాం. ఒక రోజు ముందు బుక్ చేసుకోవాలి. ఇప్పుడు ఖాళీలు లేవు, రేపు రండి అని అన్నాడు బుకింగ్ క్లార్క్. మేము ఈదేశం వాళ్ళం కాదు, యాత్రీకులం, రేపు పొద్దున్నే వెళ్ళిపోతున్నాం, ఎలాగైనా మాకు టికెట్ ఇవ్వండి అని ప్రార్ధించాం. సరే కొంచెం సేపు వెయిట్ చేయండి, ఎవరైనా కేన్సిల్ చేసుకుంటే మీకు ఇస్తాం అని ఆతను అన్నాడు. ఆ మహాశివుని అనుగ్రహమేమో, నిజంగా అలానే జరిగింది. అభిషేకం బుక్ చేసుకున్న ఒకరు ఫోన్ చేసి కేన్సిల్ చేసుకోవటం, ఆ టికెట్లు మాకు దొరకటం జరిగిపోయింది. ఐదువేల రూపాయలు చెల్లించి టికెట్ తీసుకున్నాం.

హాయిగా మహాశివుని అభిషేకం చేయించుకున్నాం. మా అదృష్టమేమో, సంవత్సరానికి ఒకసారి మాత్రమే తెరిచే ఉత్తర ద్వారం ఆవ్వాళ తెరిచారు. ఆ రోజు మా మనవడు హృషీకేష్ పుట్టినరోజు (అమెరికా కాలమానం ప్రకారం) కావటంతో, మనవడి పేరిట అభిషేకం చేయించాం. ఈ లింగం మూడు అడుగుల ఎత్తు ఉండి, నాలుగు ముఖాలతో ఉంది. నాలుగు ముఖాలు పశ్చిమం, ఉత్తరం, తూర్పు, దక్షిణ దిక్కులు చూస్తూ ఉంటాయి. ఈ ముఖాలు సద్యోజాత, వామదేవ, తత్పురుష మరియు అఘోర. ఇంకో విశేషమేమంటే, అక్కడ పూజారి కన్నడ/తెలుగువారు కావటం. ఆయన మాకు చక్కగా అన్నీ

వివరించి చెప్పారు. దేవాలయం వాళ్ళు మాకు రెండు పెద్ద రుద్రాక్షమాలలు ప్రసాదంగా ఇచ్చారు. గుడి బయటకు వచ్చాక రెండు రుద్రాక్ష మొక్కలు కొనుక్కున్నాం, మన దేశం పట్టుకు వెళ్దామని. హోటల్ కి తిరుగు ప్రయాణంలో అక్కడ సెటిల్ అయిన భారతీయుడు ఒకాయన కారులో లిఫ్ట్ ఇచ్చాడు. హోటల్ కు వచ్చి భోజనం చేసి రూమ్ లో కొంచెం సేపు రిలాక్స్ అయ్యాం.

సాయంత్రం నాలుగు గంటలకల్లా, రిసెప్షన్ నుంచి ఫోన్ వచ్చింది- లోకల్ సైట్ సీయింగ్ కి వెళ్ళటానికి ట్రావెల్స్ వాళ్ళు పంపిన జీప్ వచ్చిందని. రూమ్ తాళం వేసి కిందకి వచ్చి జీప్ ఎక్కాం.

మొదటగా అక్కడ ఉన్న శక్తి పీఠం గుహ్యేశ్వరి గుడికి వెళ్లాం. సతీదేవి శరీరంలోని గుహ్య భాగం ఇక్కడ పడిందని ప్రతీతి. ఇక్కడ తీర్థజలం కూడా అదో రకమైన వాసన కలిగి ఉంటుంది. (గుహ్యభాగం నుండి వచ్చిన నీరు కావటం వల్ల). అక్కడ దర్శనం ముగించుకుని తర్వాత ఎక్కడకి అని డ్రైవర్ ని అడిగాం. బుధనీలకంఠ గుడి అని ఉంది. కాని అక్కడికి వెళ్ళినవాళ్లకి మంచి జరగదు అన్న ఒక సెంటిమెంట్ ఉంది. అందుకని కొంతమంది యాత్రికులైతే అక్కడకు వెళ్ళరు. మీకిష్టమైతే అక్కడకి తీసుకు వెళ్తాను అన్నాడు. సెంటిమెంట్ అనేసరికి



మాకూ కొంచెం భయం వేసిందనమాట వాస్తవం. ఎందుకులే అనుకుని, దాని తర్వాత ఏమిటని అడిగాం. కొండమీదున్న స్వయంభూనాథ్ గుడికి తీసుకువెళతాను అని చెప్పాడు డ్రైవర్. ఆ గుడి చాలా అందంగా ఉంది. మూడు వందలకి పైగా మెట్లు ఎక్కి కొండమీద ఉన్న గుడి వెళ్ళాలి. ఇది హిందువులకు, బౌద్ధులకు కూడా పవిత్ర స్థలం. చక్కని శిల్పకళ. చాలా ఆనందం వేసింది. ఇక్కడ పగోడా రీతిలో నిర్మించిన స్థూపం ఉంది. ఆ కొండ మీదనుంచి చూస్తే ఖాట్మండు నగరం అంతా కనిపిస్తుంది.

ఆ గుడి దగ్గర ఓ గంట గడిపి తిరిగి బయలుదేరి మా హోటల్ కి వచ్చాం. దిగేముందు డ్రైవర్ కి చెప్పాం - మమ్మల్ని పొద్దున్న 6 గంటలకల్లాఎయిర్ పోర్ట్ లో డ్రాప్ చెయ్యాలని. మర్నాడు పొద్దున్నే లేచి తయారయిపోయి, రూమ్ వెకేట్ చేసి, ఎయిర్ పోర్ట్ కి బయలుదేరాము. ఎయిర్ పోర్ట్ లో మా దగ్గరున్న రుద్రాక్ష మొక్కలను తీసుకువెళ్ళడానికి వాళ్ళు ముందర ఒప్పుకోలేదు. వాళ్ళని రిక్వెస్ట్ చేస్తే, 'అయితే బయటకు కనపడకుండా సూట్ కేస్ లో పెట్టుకోండి' అన్నారు. పొద్దున్న 8.30 గంటలకు రాయల్ నేపాల్ ఎయిర్ లైన్స్ విమానంలో న్యూ డిల్లీ కి బయలుదేరాము. డిల్లీ లో ఓ రెండు గంటల 'లే ఓవర్' తర్వాత ఎయిర్ ఇండియా విమానంలో హైదరాబాద్ బయలుదేరాం. మధ్యాహ్నం 3.30 కల్లా మన హైదరాబాద్ రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో దిగాం. మధురానుభూతులతో ఇంటికి చేరాం.

ఇప్పుడెవరైనా నన్ను 'మీరు జీవితంలో ఏం సాధించారు?' అని అడిగితే, నేను ఉద్యోగాలు చేసాను, పిల్లల్ని చక్కగా పెంచి మంచి పొజిషన్ లో ఉండేటట్టు తీర్చిదిద్దాను, పది ఏళ్లుగా ఒక మంచి మాసపత్రిక నడుపుతున్నాను అని కాకుండా 'నేను కైలాష్ మానససరోవర యాత్ర' చేసాను అని చెబుతాను. మీరూ ఏమాత్రం అవకాశం వచ్చినా ఈ యాత్ర చేసే అదృష్టాన్ని వదులుకోకండేం!

ఈ యాత్రను పత్రికలో చదివి, వీడియో చూసి, తామే యాత్ర చేస్తున్నంత అనుభూతిని పొందామని ఎంతోమంది వాట్సప్ ద్వారా, మెయిల్ ద్వారా, ఫోన్ల ద్వారా తెలియజేశారు. అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు.

**సమాప్తం**

# పూరి జగన్నాధ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది. కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.
స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్మ్యాన్ని యధామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందడి.

- సంపాదకురాలు

ఓ దేవ దేవా! సృష్టి స్థితి లయలకు నీవే కారణం. సమస్త విశ్వం నీపై ఆధారపడి ఉంది. ఈ విశ్వం,సృష్టి, స్తితి, లయలకు నీవే కారణం. చంద్ర సూర్యాది రూపాలలో నీవే లోకాలను ప్రకాశింప చేస్తున్నావు. ఆది, అంతము లేని వాడవు. పరమ కారుణ్య రూపం కలవాడవు. పరము, అపరము నీవే. పరమునకు అతీతుడవైన వాడవు నీవే. ఈ విశ్వాన్ని నీవే సృష్టించావు. సంసార దుఃఖమనకు, మంచుకు, నీవు సూర్యుడవు. దీనులకు నీవే బంధువు. ఈ ఐశ్వర్యాలన్ని నీమాయచే సృష్టించబడ్డాయి.గుణములకుసమాహారమయినవాడా నీకు నమస్కారము. తామర పుప్పడివంటి వస్త్రమును ధరించిన వాడవు. శత్రువులనుసంహరించు చక్రమును ధరించిన వాడా,కోరలచేభూమినిఉద్ధరించిన వాడా, చంద్రుడు, సూర్యుడు కన్నులుగా కలవాడా నీకు నమస్కారము.

నరసింహాయ దంష్ట్రోగ్రమూర్తి ద్రావిత శత్రవే

యదపాంగ విలాసైక సృష్టిస్థిత్యుప సంహృతిః

తచ్చావాత్మకోహ్యేష భవః సంభవతే ముహుః

తమముం నీలమేఘాభం నీలాశ్మమణి విగ్రహమ్

నీలాచల గుహావాసం ప్రణమామి కృపానిధిమ్

శంఖచక్రగదాపద్మ ధారిణం శుభాదాయినమ్

ప్రణతాశేషపాపౌఘ దారిణం మురవైరిణమ్

నమస్తే కమలాపాంగ సంగ సంస్కార చక్షుషే

శ్రీవత్సకౌత్సుభోద్భాసి మనోహ్వాద్వ్యాన వక్షసే

యత్పాదపంకజద్వంద్వ సంశ్రయైశ్వర్య దాయినీ

శ్రీః సంశ్రితా జనైః శశ్వత్పృధగైశ్వర్య దాయినీ

యా పరాపర సంభిన్నా పకృతిస్తేసి వృక్షయా

నిర్వికారం పరం బ్రహ్మ వికారిన సృజేంజసా

సర్వలక్షణ సంపూర్ణాం లక్షితాం శుభలక్షణైః

లక్ష్మీశోరసి నిత్యస్థాం లక్ష్మీం తాం ప్రణమామ్యహమ్

ఓనరసింహా! భయంకరమైన కోరలచే, నీ రూపముచే శత్రువులను సంహరించిన వాడా, సృష్టి, స్థితి లయలను నీ చూపులచే నియంత్రించు వాడా, ఈ విశ్వ ము నీవలననే తిరిగి సృష్టించబడుతోంది. నీలమేఘమువంటి, నీలమణివంటి, స్వరూపం కలవాడవు. నీలాద్రి గుహలలో నివసించు వాడవు, దయాస్వభావము కల నీకు నమస్కరిస్తున్నాను

శంఖము, చక్రము, గద, పద్మము, ధరించిన వాడా, శుభములను ఇచ్చువాడా, నిన్ను సేవించిన వారి పాపములను పోగొట్టువాడా, ముర అను రాక్షసుని సంహరించిన వాడా, లక్ష్మీ దేవి చూపులతో చూపులు కలిపిన వాడా, శ్రీవత్సము, కౌత్సుభము వక్షస్థలమున ధరించిన వాడా, నీ పాదపద్మములు ఆశ్రయించిన వారికి లక్ష్మీదేవి ఐశ్వర్యము కలిగిస్తోంది. ఈ సృష్టి చేయాలనే కోరిక నీ వలననే కలుగుతోంది. పర బ్రహ్మ ఈ విశ్వాన్ని సృష్టిస్తున్నాడు. స్వామి వక్షస్థలముపై ఉండు లక్ష్మీ దేవికి నమస్కరిస్తున్నాను అని యమధర్మ రాజు జగన్నాధుని స్థుతించాడు. ( 14-30.

యమధర్మరాజు స్తుతికి ఆనందించి స్వామితన చూపులతో సమాధానం చెప్పమని లక్ష్మీ దేవిని ఆదేశించాడు. “ యమధర్మరాజా! మేము ఈ క్షేత్రమును విడిచిపెట్టుటకు వీలులేదు. కల్పాంత సమయంలో కూడా మేము ఇక్కడే ఉంటాము. ఈ క్షేత్రంలో నివసించు ప్రాణులకు పూర్వజన్మ కృత పాపాలు అన్నినశించి పోతాయి. స్వామిని దర్శించికున్న వారి కర్మబంధాలన్ని తెగిపోతాయి. అందువలన ఇక్కడ జీవించేవారిని నీవు శిక్షించలేవు. నీ

అదికారం చెల్లదు." అని లక్ష్మీ దేవి యమునికి చెప్పింది.

" తల్లీ! నీవు చెప్పిన విషయాలు పూర్వం నేను వినలేదు. అజ్ఞానం వలన తెలుసుకోలేక పోయాను. బ్రహ్మాదులు స్వామి మహిమలు తెలుసుకొన లేరు. ఈ క్షేత్రం ముక్తిప్రదమని నీవు చెప్పావు. ఈశ్వరుని ఆజ్ఞ నిరంకుశమైనది. స్వామి ఇతరచోట్ల బంధాలు కల్పించి ఈ ప్రదేశంలో మోక్షాన్ని ప్రసాదిస్తున్నారు. నన్ను, దేవతలను, స్వర్గాన్ని సృష్టించింది స్వామియే కదా!. ఈ క్షేత్రంగూర్చి విస్తారంగా చెప్పు. ఈ క్షేత్రం ప్రమాణం ఎంత? ఏ ఏ తీర్థాలు ఉన్నాయి? అధిష్టాన దేవత ఎవరోచెప్పమని" వినయంగా యముడు లక్ష్మీదేవిని ప్రార్థించాడు. ( 31 – 49)

స్కాంద పురాణంలోని పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యంలోని యమ- లక్ష్మీ సంవాదము అను రెండవ అధ్యాయం సమాప్తం.

## 3. వ అధ్యాయం

## జైమిని- ఋషి సంవాదము

" సూర్య కుమారా! ఈ క్షేత్రమాహాత్మ్యం చెబుతాను. శ్రద్ధగా విను. ప్రళయ సమయంలో నేను నారాయణుని వక్షస్థలంపై ఉండి, చూసిన విషయాన్ని మీకు చెబుతాను. ప్రళయ సమయంలో స్థావర జంగమాలన్నీ నీటిలో మునిగి ఉన్నాయి. నేను,మాత్రమే ఈ క్షేత్ంలో మిగిలి ఉన్నాం. అదే సమయంలో మార్కండేయ మహర్షి చిరంజీవియై సముద్రంలో ఈదుకుంటూ అక్కడికి వచ్చాడు. ఈ క్షేత్రంలో ఉన్న మర్రిచెట్టుదగ్గరికి చేరుకున్నాడు. అప్పటికి ఆయన వయస్సు ఏడు కల్పాలు.

" మునీంద్రా! నా దగ్గరకు రా" అని మార్కండేయునికి వినబడింది. ఆ మాటలు విని మార్కండేయుడు ఆశ్చర్యపోయి ఆ వృక్షం వైపు చూసాడు. మహా ప్రళయంలో ఈ వృక్షం చుక్కానిలా కనబడుతోంది. ఈశ్వరుని ప్రతి రూపంలా ఉంది" అని మార్కండేయుడు మనస్సులో అనుకొని వృక్షం దగ్గరకు చేరుకున్నాడు. అక్కడ ఉన్న లక్ష్మీనారాయణులను చూసి ఈ విధంగా స్తుతించాడు.



మార్కండేయ కృత లక్ష్మీనారాయణ స్తుతి:--------

త్వత్పాదపద్మానుసరామానుషంగం

రుద్రేంద్ర పద్మాసన సంపదాఢ్యమ్

త్వద్భక్తిహీనం పరితః ప్రతప్తం దీనం

పరిత్రాహి కృపాంబుధే మామ్

బ్రహ్మాదిభిర్యత్పరిచర్యమాణపదాంబుజ

ద్వంద్వను చింత్య శక్తః

శ్వఃశ్రేయసప్రాప్తినిదానతత్త్వందీనం

పరిత్రాహి కృపాంబుధే మామ్

యదంగ భూతం జగదండమేతదనేక

కోట ప్రఘుణం విభాతిః

లీలావిలాసస్థితిసృష్టిలీనంతన్మాం

సుదీన పరి రక్ష విష్ణో

ఏకంసువర్ణకటకాదబేద్దైర్నానా

యధావానభసదిత్ & ర్కః

ఆధారవైషమ్య జలేషు

తాదృగ్విభావ్యసే నిర్గుణఏక ఏవ

అశేష సంపూర్ణ ప్రహీణో పాదాన సంకల్ప వివర్జితోపి

దీనానుకంపానుగుణం బిభర్షి

యుగేయుగే దేహమపాశక్తే

త్వత్పాదపద్మం జదీశ

పూర్వమసేవ్యతానాత్మ ధియా మయా యత్

తత్కర్మణా దారుణ పాకభాజం

దీనం పరిత్రాహి కృపాంబుధే మామ్

అశేషలోక స్థితి సృష్టి లీన విలాసియత్తే త్రిగుణం విభాతి

నపునర్మహాత్మ న్మహదాదిహేతు

ర్వైతోర్న మస్తే ప్రకృతే  పరస్య

సర్వత్ర గత్వా బృహదప్రమేయం

ప్రవర్ధమానం త్వయి బృంహితంచ

తద్బ్రహ్మరూపం పరిణామ హేతుం

స్వాధ్యాత్మ విశ్వాత్మక మాశ్రయామి

ఏకార్ణవే మహాఘోరే నావస్థాతుం ప్రదేభూః

అస్తి లక్ష్మీపతే మేఘవారివాత ప్రకంపనాత్

త్రాహి విష్ణో జగన్నాధ మగ్నం సంసార సాగరే

మాముద్ధరాస్మాద్గోవింద కృపాపాంగ విలోకనాత్

ఇంద్రాది దేవతలు నీ పాదాలు ఆశ్రయించి సంపదలు అనుభవిస్తున్నారు. నీయందు భక్తిలేక, అన్ని చోట్ల తిరుగుతున్నాను. బ్రహ్మాదులు నీ పాదాల

కు సేవ చేస్తున్నారు. ఊహాతీతమైన శక్తి కలవాడవు.

శ్రేయస్సు కలిగించు తత్వము కలవాడవు. దీనుడనైన

నన్ను రక్షించు.

ఈ బ్రహ్మండము నీ శరీరములో  ఒక భాగమై అనేక కోటిరెట్లు ప్రకాశిస్తోంది. విలాసార్థమై సృష్టిస్థితిలయలు చేస్తున్నావు. కృపానిధీ! నన్ను రక్షించు.

బంగారం అనేక ఆభరణాలు అయినట్లు నీవు ఆధార విశేషాన్ని అనుసరించి అనేక రూపాలుగా కనబడుతున్నావు. దీనులను రక్షించడానికి ప్రతి యుగంలోను నీవి అపారమైన శక్తితో అవతరిస్తున్నావు.  ఓ జదీశా! నా అజ్ఞానం వలన నీ సేవ చేసుకో లేదు. అందువలదారుణమైనబాధ అనుభవిస్తున్నాను. దీనుడనైన నన్ను రక్షించు.

సృష్టి స్థితి లయలకు కారణమైన త్రిగుణాలు నీ యందే ఉన్నాయి. ప్రకృతి, పరము నీయందే ఉన్నాయి. నీలో ఉన్న బ్రహ్మస్వరూపమే అన్నిటికి కారణము. విశ్వాత్మకుడవైన నిన్ను శరణ కోరుతున్నాను. ఈ నీటియందు నిలబడడానికి ఎక్కడా స్థానం లేదు. జగన్నాధా! విష్ణు మూర్తి! సంసార సాగరమునందు మునిగి ఉన్న నన్ను నీ కడగంటి చూపుతో రక్షించు.

(ఇంకా వుంది)

# విశిష్టం - మార్గశిరం



**కొత్త రామానందం**

**'మాసానాం మార్గశీర్షోహం'** అని శ్రీకృష్ణ పరమాత్మ స్వయంగా భగవద్గీత 10 వ అధ్యాయం, 35 వ శ్లోకంలో తెలియజేశాడు. కార్తీక మాసంలో శివార్చనలు, ఉపాసనలు ఎంత ప్రాముఖ్యమో, మాఘమాసం లో ఆదివారములు సూర్యోపసనకు ఎలా విశిష్టమైన వారాలో గీతాచార్యుడు అయిన పరమాత్మ తన గీతామృతాన్ని పంచి యిచ్చిన పవిత్ర మాసము మార్గశిర మాసము. భక్తులు ఈ మాసంలో విష్ణు సంకీర్తనలతో తన్మయులౌతారు. ఈ మాసమంతా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తూ ఆనందదాయకంగా వుంటుంది. డి. 26-11-2019 న ఈ మాసం ప్రారంభమయ్యి, డి. 26-12-2019 న ముగుస్తుంది.

అయ్యప్ప స్వామి దీక్ష తీసుకుని భక్తి శ్రద్ధలతో, నియమ నిష్టలతో బ్రాహ్మీ ముహూర్తంలోనే మేల్కొని చన్నీటి స్నానములు ఆచరిస్తూ, స్వామివారి అనుగ్రహానికి ఆరాటపడుతూ, ఒంటిపూట భోజనం చేస్తూ, నల్లని దుస్తులు ధరించి, పాదరక్షలు వేసుకోకుండా దీక్ష కొనసాగిస్తారు. వారందరూ ధన్యులు.

ఈ నెలలోనే డి. 16-12-2019 న ధనుర్మాసం ప్రారంభమవుతుంది. గోదాదేవి రచించిన 30 పాశురాలతో కూడిన 'తిరుప్పావై' పవిత్ర గ్రంథములోని ఒక్కో పాశురాన్ని చదివి విశ్లేషిస్తారు. తిరుమలలో వేంచేసిన శ్రీనివాసుని సుప్రభాతసేవ లో 'తిరుప్పావై' పాశురాలతో స్తుతిస్తుంటారు. ధనుర్మాసంలో శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం చదవరు. ఈ ధనుర్మాసవ్రత సమయంలో జ్ఞాన సిద్ధి, ఆధ్యాత్మికతను కలిగించే గురువు ఆదిదైవంగా ఉండే ధనూ రాశిలో సూర్యుడు, సాధనను పరిపక్వం చేయగల బుధుడు, మిధున రాశిలో చంద్రుడు ఉంటారు. ఈ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని స్మార్త ఏకాదశి గానూ, బహుళ ఏకాదశిని సర్వైక ఏకాదశిగానూ పరిగణించి నియమ నిష్టలతో ఆచరిస్తారు. ఈనెల 16 న, ధను సంక్రమణం ప్రారంభమయిన రోజునుంచి మకర సంక్రమణం వరకు ముగ్గు ముచ్చట్లతో నేలతల్లిని పూజించడం మన సాంప్రదాయం. మన ఆడపడుచుల కళావైభవం నేల నలుచెరుగులా ప్రదర్శితమౌతుంది.

ఈ పవిత్రమాసంలో డి.2-12-2019 న సుబ్రహ్మణ్య షష్టి జరుపుకుంటారు. ఈ పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో, అర్చన నైవేద్యాలు సమర్పించి పూజిస్తే చక్కని సంతానం కలుగుతుందంటారు. అనేక సత్ఫలితాలు కలుగుతాయన్నది శాస్త్ర వచనం. 7 డిసెంబర్ రోజును గీతాజయంతిగా పరిగణించి, కర్తవ్య విమూఢుడైన అర్జునునికి గీత బోధించి, కర్తవ్యం వైపునకు నడిపించుటకు కృష్ణ పరమాత్మ గీతాప్రబోధం చేసిన రోజున కృష్ణ భక్తులు గీతాపారాయణం చేయడం ఆనవాయితీ. డి. 9-12-2019 న ఆంజనేయుని ఉద్దేశించి చేసే వ్రతమే హనుమద్వ్రతం. మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు పాండవులచే వ్యాస మహర్షి ఈ హనుమద్వ్రతం ఆచరింపజేసాడు. ఈ వ్రతం ఆచరించేవారికి అపూర్వ ఫలితాలు లభిస్తాయి.

డి. 11-12=2019 రోజున విశ్వగురువు శ్రీ దత్తాత్రేయుడి జయంతి స్వామివారిని షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించి నైవేద్యా-

లు భక్తితో సమర్పిస్తే సకల అభీ-ష్టాలు నెరవేరతాయి. విద్యార్థులు పూజించడం వల్ల విద్యాభివృద్ధి కలుగుతుంది.

## సుబ్బారాయ షష్టి

సుబ్రహ్మణ్యా స్వామి శివ-పార్వతుల పుత్రుడు. వారి గారాల పట్టి అయిన స్వామి-వారిని భక్తులు కుమారస్వామి, స్కందుడు, కార్తికేయుడు, సు-బ్బారాయుడు, వేలాయుధన్, మురుగన్ వంటి పేర్లతో పిలుస్తా-రు. సుబ్రహ్మణ్యా స్వామి జననం కార్తీకమాసంలో జరిగింది. ఆ మాసంలో స్కంద పంచమి, స్కంద షష్టి అనే రెండు పర్వాలు వస్తాయి. అలాగే ఆయన దేవ సేనాధ్యక్షుడిగా ఆయన తారకా-సురుడిని సర్వ రూపం ధరించి అసుర సంహారం జరిపాడని ఆ రోజు మార్గశిర శుద్ధ షష్టి తెలుగు-నాట సుబ్బారాయ షష్టిగా పెద్దలు, పిల్లలు ముఖ్యంగా రైతులు ఆనందోత్సాహాలతో జరుపుకోవ-డం ఆనవాయితీ.

సుబ్రహ్మణ్య అవతరణకు లోక రక్షణ ఇతివృత్తమైనది. పురాణాల ప్రకారం సతీదేవి వియోగానం-తరం పరమశివుడు తపస్సులోకి వెళ్ళిపోయాడు. తదుపతి హిమ-వంతుని కుమార్తె పార్వతి శివునికి శుశ్రూష చేసింది. శివునిపై పూల శరాలు గుప్పించి మన్మథుడు శిక్ష పొందాడు. పిమ్మట శివపార్వ-తుల కల్యాణం జరిగింది. శివ-పార్వతుల ఏకాంత సమయాన



ఆయన రేతస్సు క్రింద పడగా, దానిని భూమి భరించలేక దానిని అగ్నిలో వదలివేసింది. అగ్ని దానిని భరించలేక గంగలో వదలగా, గంగ దానిని తన తీరంలో ఉన్న శరవనమునకు త్రోసింది. అక్కడే కుమారస్వా-మి జన్మించారు. ఆ శిశువును ఆరుగురు కృత్తికలు ప్రేమతో బద-రికాశ్రమములో పెంచారు. అంటే ఆ బాలునికి ఆరుగురు తల్లులు. కావుననే ఆయనను 'షణ్ముఖు-డు' అని పిలుస్తారు. కొంతకాలం ఆయన శివ పార్వతుల వద్దకు చేర్చబడ్డాడు. పిమ్మట ఆయనకు దేవ సేనాధిపత్యాన్ని అంద-జేశారు. యుద్ధంలో కుమార-స్వామి తారకాసుడిని వధించి ప్రజలను రాక్షస బాధనుండి విముక్తులను జేసాడు. కు-మారస్వామి గాథ బ్రహ్మ వైవర్త పురాణంలో సమగ్రంగా వివరిం-చబడింది. సుబ్రహ్మణ్యుడికి దే-వసేనతో వివాహం దేవేంద్రుడు జరిపించాడు.

స్కందపురాణం ప్రకారం పురుషోత్తముడైన విష్ణువు లేదా పరమేశ్వరుడు అవ్యక్త శక్తి, మహాలక్ష్మి లేదా పార్వతీదేవి వీ-రిరువురి సమన్వయ సమైక్యతా తత్వ మూర్తియే సుబ్రహ్మణ్యస్వా-మి. ఈ స్వామిని ఆరాధిస్తే శివ-శక్తులను, లక్ష్మీనారాయణులను కలిపి ఆరాధించినట్లే. ఆయన ఒక చేతిలో మహాలక్ష్మీ ఆయుధా-న్ని, వేరే చేతిలో వజ్రాయుధాన్ని, మరో చేతిని కటిపై ఉంచి, ఇంకో హస్తంతో అభయ ప్రదానం చేస్తూ దర్శనమిస్తుంటాడు. కుండలీ శక్తి జాగృతమైన షట్చక్రాలనుండి పైకి ప్రాకి అగ్ని తత్వమైన సుషుమ్నా మార్గంలో ఉత్పన్నమయిన శక్తి యే ఈయన. సంవత్సరా-గ్నిగా, కాలస్వరూపుడు, ఆరు

ఋతువులు ఆయనకు ఆరు ముఖాలు. పన్నెండు మాసాలు ఆయనకు గల పన్నెండు చేతులు. ఆయన అభయ స్వరూపుడు.

తమిళనాడు ఆరుపది పేరిట పళని, స్వామిమలై, తిరుచ్చేందూర్, త్రిపురకుండ్రం, పళీముదిర్ చోలై, తిరుత్తణి క్షేత్రాలు స్వామివారి ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలుగా ప్రఖ్యాతి నొందాయి. పిల్లలు పుట్టనివారికి, నాగదోషం ఉన్నవారికి, కుజదోషం ఉన్నవారికి ఈ క్షేత్రాల దర్శనం మంచి ఫలితాలను ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బిక్కవోలు తీర్థం వేలాది భక్తులతో అలరారుతోంది. రాత్రిపూట జరిపే ఊరేగింపు, బాణాసంచా నయనానందకరంగా ఉంటుంది.

జ్ఞానం వల్ల కలిగే ఆనందం మరి దేనివల్లా కలగదు. అటువంటి జ్ఞాన బుద్ధి కలిగించే దేవుడు సుబ్రహ్మణ్యేశ్వరుడు.. మన శరీరంలోని మూలాధార చక్రంలో నిదురించి యున్న సర్పాన్ని మేలుకొలిపినపుడు మనకు పరమ జ్ఞానం లభిస్తుంది. సుబ్రహ్మణ్యేశ్వర స్వరూపంగా సర్పాన్ని పూజించడం, సుబ్బారాయుడి షష్టినాడు పుట్టలో పాలు పోయడం అందుకే.



సాగరతీరాన కొలువున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

చెన్నై నుండి కన్యాకుమారి వెళ్ళే మార్గంలో, చెన్నైకి 449 కి.మీ. దూరంలో తిరునల్వేలికి తూర్పుగా 62 కి.మీ. పయనిస్తే అత్యంత సుందరంగా విశాల స్థలములో నిర్మితమయిన స్వామివారి ఆలయాన్ని దర్శించవచ్చును. అదే విధంగా కన్యాకుమారిని దర్శించుకొన్న పిదప తిరుచెందూర్ 100కి.మీ. పయనిస్తే తిరుచెందూరు పుణ్యక్షేత్రం వస్తుంది. వసతి లభిస్తుంది. తిరుచెందూరు నుండి భక్తులు రామేశ్వరం లేకా మదురై యాత్రా స్థలాలకి వెళ్ళవచ్చును.

తిరుచెందూర్ గుడికి ఎదుటగా సముద్రం ఉంది. యాత్రికులు సముద్ర స్నానం చేసి సంతోషపడుతుంటారు. సముద్రపు ఒడ్డున విశాలమయిన మండపాలు, వరండాలు ఏర్పాటు చేశారు. గుడి వైపున షెడ్లకు ఒక చివర పెద్ద బావి ఉంది. విశేషమేమంటే ఆ నూతి నీళ్ళు తియ్యగా ఉంటాయి. సముద్ర స్నానం చేసిన యాత్రికులు ఈ మెట్ల బావిలోకి దిగి స్నానం చేస్తుంటారు. ఈ బావిని అచ్చట ఆలయ అధికారులు 'నావికణక్' అని పిలుస్తారు. ఈ బావి నీటినే స్వామివారి అభిషేకానికి వినియోగిస్తారు. ఎవరు ఎంత తోడుకున్నా నీరు తరగదు. ఊరుతూనే ఉండటం ఒక విశేషం.

స్వామికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విభూతితో అర్చనలు, అభిషేకాలు గావించి, విభూతినే భక్తులకు తీర్థ ప్రసాదాలుగా ఇస్తారు. ఇచ్చట అర్చకులు పీచులేని కొబ్బరికాయ కొట్టి నైవేద్యంగా స్వామి చెంత ఉంచటం ఆనవాయితీ. రాతి రోజూ వేలాది భక్తులు ఆలయాన్ని సందర్శించి, అచ్చటి ప్రకృతిని చూస్తూ, సముద్ర అలల ఘోషలను వింటూ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతుంటారు.

మాతృదేవో భవ, పితృదేవో భవ అన్నవి వేద శాసనములు. శివ శక్తులు మాతాపితలుగా వేర్వేరుగా కాక అర్ధనారీశ్వర రూపంలో కలిసి ఉన్నారు. సత్ పరమేశ్వ-

రుడు కాగా, చిత్ అంబిక. ఈ సత్ చిత్ లు రెండును ఏకము కాగా ఆనందం ఉద్భవించింది. శివమనే మంగళం, అంబిక అనే కారుణ్యం కలసిన రూపమే శ్రీ సుబ్రహ్మణ్యుడు. శ్రీ సుబ్రహ్మణ్యుడు జ్ఞాన స్వరూపి. తేజస్వి. అగ్ని తేజం కలవాడు. కానీ, గంగా తనయుడగుటచే అమృతం వలె చల్లదనము నిచ్చే స్వభావము కలవాడు. తిథులలో ఆరవది షష్ఠి. ఆయన జన్మ తిథి కూడా షష్ఠియే. షష్ఠి ప్రియుడు. షడాననుడు. అనగా ఆరు ముఖములు కలవాడు. ఆయన మంత్రం షడక్షరి - 'శరవణభవ'. ఇది మిక్కిలి మహిమాన్వితమైనది. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములగు ఆరు దుర్గుణములను నశింపజేసి విద్యావంతులుగా రూపొందించునట్టిది. ఇహ పర సుఖదాయికమైనది. ఇట్టి విశిష్ట జ్ఞాన స్వరూపుడగు శ్రీ సుబ్రహ్మణ్యుని ఆరాధన సర్వ అనర్థాలను తొలగించి, సర్వాభీష్ట సిద్ధిని కలిగించి జ్ఞాన సంపన్నులను చేస్తుందనటంలో అతిశయోక్తి లేదు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారు శివ శక్తులకు జన్మించిన గారాబు బిడ్డడు. మహనీయుల జన్మలు లోక కంటకులను నిర్మూలించి, సజ్జనులను కాపాడటానికేనన్న విషయం లోక విదితమైనదే. తారకాసుర, శూరపద్మాసురాది రాక్షసులను దునుమాడుటకై



కార్తికేయుడు ఉద్భవించాడు. ఆ స్వామియే సుబ్రహ్మణ్యేశ్వరుడని ప్రసిద్ధి చెందాడు. ఈయన జన్మరాశి వృశ్చికం నుండి జన్మ లగ్నమయిన మేషం వరకు ఆరు రాసులున్నాయి. ఈ ఆరు చక్రాలు మన శరీరంలోని షట్ చక్రాలు. వృశ్చిక రాశిని తోకగా పరిగణిస్తే, మేషరాశి పాముశిరస్సు అవుతుంది. ఈ పద్ధతిలో స్వామివారు కుండలినీ ప్రభువు అయ్యాడు. ఇవన్నీ జ్ఞాన వైరాగ్యములకు సంబంధించిన విషయాలు. సర్పం వీటికి సంబంధించినది. అందువల్లే సదాశివుడు ధరించి పన్నగ భూషణుడని ప్రసిద్ధి చెందాడు. ఈ పన్నగాలు సుషుమ్న నాడీ రూపంలో ఉన్న షణ్ముఖుని విభూతి రూపాలు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుని సర్ప రూపంలో పూజిస్తారు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆరు అంకెతో సంబంధముంది. ఆయన షణ్ముఖుడు. సహజంగా జ్ఞాన స్వరూపుడు. ఆయన యోగమూర్తి. పూర్వజన్మలో సనత్కుమారుడుగా జన్మించిన బ్రహ్మ మానస పుత్రుడు, నిరంతర తపస్సమాధిలో ఉంటూ ఈ సృష్టిలో దేనినీ భేద భావంతో చూడక, వేదమూర్తిగా భాసించాడు. అదే ప్రవృత్తి ఈ జన్మలోనూ సిద్ధించింది. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు నిరంతరం జ్ఞాన నిష్ఠలో వున్న భక్తులను రక్షిస్తూనే ఉంటాడు.

సుబ్రహ్మణ్య షష్ఠి నాడు ఉపవాసముండి, కుమారస్వామిని పూజించి, బ్రహ్మచారికి వస్త్రదానమిచ్చి భోజనం పెట్టి ఆనందింపజేయాలి. కొంతమంది శ్రీ స్వామివారిని సర్పాకారంగా ఆరాధించి పుట్టలో పాలు పోస్తారు. కుజ దోషమున్నవారు ఈ రోజు ఉపవాసముండి తమ దోషాలను పోగొట్టమని శ్రీ స్వామివారిని వేడుకొంటారు. ఈ విధమైన స్కంద పూజ మన దేశంలో అతి ప్రాచీనకాలం

# మధ్య తరగతి తండ్రి (నాన్నకి అన్నీ తెలుసు)




## భారతీ శర్మ

పేపరు చదువుతున్నాదనుకొంటున్న నాన్న ... ఇల్లంతా చూస్తుంటాడు. అరలీటరు పెరుగులో నీళ్ళు కలిపి ... చిలుకుతూ చేతులు నెప్పి పెడుతున్నా నిమ్మకాయంత వెన్నముద్ద తీసేద్దామని ఆరాటపడే ఆమని చూసి నవ్వుకుంటాడు.

ఆరేసినప్పుడు చిరుగున్న చీరని ... అ చిరుగును కుచ్చిళ్ళలో దాచి వందనమైన చీరకట్టుతో కాఫీ అందించడానికి వచ్చిన పెద్దపిల్లని చూసి, నా తల్లి ఎంత వందనంగా కాపురం చేస్తుందో అన్న ధీమాతో కాఫీ కప్పు అందుకుంటాడు.

దగ్గుమందు అయిపోయిందని తెలియనీయకుండా ఆ సీసాలో నీళ్ళు కలిపి గిలకరించుకుని తాగుతున్న బామ్మ పక్కన కూర్చుని వెన్ను నిమురుతూ ... పసిపిల్లలా అమ్మని అక్కున చేర్చుకుంటూ జీతం రాగానే చెయ్యవలసిన పనిని గుర్తు చేసుకుంటాడు.

నిక్కరు బొత్తము దగ్గర పిన్నీసు పెట్టుకుని బొమ్మల రామాయణం చదువుతున్న సోంబాబుకి వచ్చే వినాయకచవితికి రెండు జతల బట్టలు ఎలా కుట్టించాలో లెక్కలు



వేసుకుంటాడు.

నాన్న చేసేది చిన్న ఉద్యోగమే అయినా హుందాగా, దొరబాబులా ఇస్త్రీ చొక్కా లాగూతో ఆఫీసుకి వెడతాడు. నాన్న వాచీ, చెప్పుల జత పదిలంగా చూస్తారు అంతా. జీతం రాగానే నాన్న తెచ్చే సన్న కారప్పూస, బెల్లం కొమ్ములు పండుగ వాతావరణాన్ని తలపిస్తాయి.

నాన్న జీతం చాలా తక్కువే అయినా నాన్నకి అన్నీ తెలుసు.... నాన్న అందరికీ తలలో నాలుకలా ఉంటాడు.... నాన్న భరోసా .... నాన్న ఆస్తులు ఇవ్వలేకపోయినా విలువలు నేర్పి, జ్ఞాపకాలను ఇస్తాడు. నాన్నకి పిల్లలకి మధ్య దగ్గరతనం, చనువు, తక్కువే అయినా ... అన్నింటా తానే అయి నాన్న మనలో ఇమిడిపోతాడు....

మధ్య తరగతి నాన్నకి అన్నీ తెలుసు !!!



# నాలుగవ రాష్ట్రపతి వి.వి. గిరి

పాలెపు బుచ్చిరాజు

శ్రీ వి.వి. గిరి జన్మించిన తేదీ ఆగష్టు 10,1894. ఒడిస్సాలోని బరంపురంలో. తండ్రి పేరు జోగయ్య పంతులు. తల్లి సుభద్రమ్మ. నియోగి బ్రాహ్మణ వంశం. పూర్వ నివాసం గోదావరి జిల్లాలోని కాకినాడ. బరంపురంలో జోగయ్య పంతులుయ్ పేరు మోసిన వకీలు. కాంగ్రెసు సభ్యుడు. వారి ఇల్లు ఎప్పుడూ వచ్చే పోయే అతిధులతో నిండి ఉండేది. అతిధి దేవోభవ అని భావించే తండ్రి, అందుకు తగ్గట్టుగా అతిధుల సేవలో మునిగి తేలుతూ ఏనాడూ విసుగు చెందని ఇల్లాలు చిన్నతనంలోనే గిరి మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. తల్లి ధర్మ పరాయణురాలు. ఆడదానికి చదువు అనవసరం అని భావించే పందొమ్మిదవ శతాబ్దంలోనే బాగా చదువుకున్న భాగ్యశాలి ఆ మహిళ. ఆమె నిగర్వి. ఆమె ఎంత మానవతావాది, సహృదయశీలి అంటే, ఏ మనిషిలోనూ ఆమె చెడుని చూసేదికాడు. ప్రపంచంలో అంతా మంచినే చూసేది. గిరి చిన్నతనంలో ఆమెతో, “నువ్వే ఒక న్యాయాదికారివి అయి ఉంటే, ఏ నేరస్తుడికీ శిక్ష పడేది కాదు.” అని హాస్యంగా అంటూ ఉండేవాడు.

జోగయ్యపంతులుగారిసంతానం మొత్తం ఏడుగురు మగపిల్లలు, అయిదుగురు ఆడపిల్లలు. కాని వారిలో ఏడుగురు చిన్నతనంలోనే పోయారు. అయిదుగురు మాత్రం మిగిలారు. గిరి వారికి రెండవ కొడుకు. పెద్దవాడు పదమూడు సంవత్సరాల వయసులో చనిపోయినప్పుడు, ఆయన తండ్రి ఉదయం దహనం చేసి వచ్చాక, పదకొండు గంటలకే బయల్దేరి కోర్టుకి వెళ్ళిపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఆ తండ్రి కార్య



దీక్షా, వృత్తి పట్ల నిబద్ధతా చూసి గిరి చాలా ప్రభావితుదయ్యాడు. జీవితం అంటే ఆయనకి ,హాయిగా ఆడుతూ పాడుతూ నిర్లక్ష్యంగా కాలం వృధా చేయడం కాదు. త్యాగ నిరతి, శ్రమించి పనిచేయడం, సమస్యలు, కష్టాలు ఎదురైనప్పుడు వాటిని సామరస్యంగా పరిష్కరించుకుని ముందుకు సాగడం. ఇదే జీవితానికి పరమార్థం. ఇటువంటి భావాలు ఆయనకి చిన్నతనంలోనే తలిదండ్రులద్వారా సంక్రమించాయి. ఇటువంటి నేపథ్యంలో గిరి మనసులో సమాజ సేవకి అంకితం కావాలనే బలమైన కోరిక పన్నెండేళ్ళ చిన్న వయసులోనే అంకురించింది. తన మేనమామ విశ్వనాథరావు “యంగ్ మెన్ లైబ్రరి అసోసియేషన్” 1906లో స్థాపించినప్పుడు గిరి కూడా దానిలో సభ్యుడై ప్రముఖ పాత్ర పోషించాడు.

ఫలితంగా సుమారు రెండు వేల పుస్తకాలతో ఒక అద్దె గదిలో గ్రంథాలయం ప్రారంభం అయింది.
ఈ గ్రంథాలయంలో పుస్తకాలు చదవడానికి వచ్చే యువకులు జ్ఞాన సముపార్జన చేయడమే కాకుండా, సమకాలీన రాజకీయాలు, దేశ విదేశాల్లో జరుగుతున్న సంఘటనల మీద తరచుగా చర్చలు జరిపేవారు. ఆ సమయంలోనే భారత దేశంలోని ఆంగ్లేయుల పరిపాలన, ప్రజలపై జరుగుతున్న అత్యాచారాలు, బానిసత్వ ధోరణులు వంటి విషయాలు చర్చకు వచ్చేవి.ఒక విధంగా ఇది ఆ యువకులలో జాగారుకతని రేకెత్తించి దేశ భక్తి వైపు వారి దృష్టిని మళ్లించడానికి దోహదం చేసింది. వారంతా స్వాతంత్ర్య సమరంలో పాల్గొనే ఉత్సాహం చూపించ సాగారు. ఆ గ్రంథాలయం కాల క్రమేణా అభివృద్ధి చెంది, ఎన్నో వేల పుస్తకాలతో ఇప్పటికీ ప్రభుత్వాధీనంలో నడుస్తోంది.
కొంతకాలానికి విశ్వనాధరావు నేతృత్వంలో "చారిటబుల్ ఫండ్ అసోసియేషన్" పేరిట ఒక సంస్థ రూపుదిద్దుకుంది. గిరి దానికి సెక్రటరీగా ఉండేవాడు. ఆయన మరికొందరు మిత్రుల్ని వెంట బెట్టుకుని ఇంటింటా తిరిగి ధన రూపేణా, వస్తురూపేణా చందాలు సేకరించేవాడు. బరంపురంలో అప్పట్లో సుమారు నలభైవేల జనాభా ఉండేది. ఈ బృందాలలో సభ్యులు ఒక్కొక్కరు ఒక్కొక్క వెదురు బుట్ట పట్టుకుని ఇంటింటికీ వెళ్లి ఏదో రూపంలో చందా ఇవ్వమని అర్థించేవారు. ఏమీ లేకపోతే కనీసం ఒక పిడికెడు బియ్యం అయినా ఈ జోలిలో పోయండి అని ప్రాధేయ పడేవారు. ఇలా విసుగు విరామం లేకుండా తిరిగే యువ కార్యకర్తల్ని చూసి గృహిణుల హృదయాలు కరిగి పోయేవి. వారు ఇవ్వగలిగినంత ఇచ్చేవారు. అలా వారు సంపాదించిన ధన, వస్తు రూపాల్లో వచ్చిన చందాలతో వారానికి ఒక రోజున సుమారు ఇరవై వేల మంది బీదలకి ఉచిత అన్నదానం చేయగలిగే వారంటే, వారి పరిశ్రమ ఎంతచక్కటి ఫలితాన్ని ఇచ్చిందో ఊహించుకోవచ్చు. ఆ రోజుల్లోనే గిరి 13-14 ఏళ్ల చిన్నవాడయినా సమాజ సేవకోసం అన్నం వండడం కూడా నేర్చుకున్నాడు. అలా పేదలకి అన్నదానం చేయడంలో ఎంతో సంతృప్తి, ఆనందం లభించేది ఆయనకి.
దేశానికి స్వాతంత్ర్యం కోసం పలువురు నాయకులు నడుం కట్టి కృషి చేస్తున్న రోజులవి. కాంగ్రెసు నాయకుడు గోపాల కృష్ణ గోఖలే "నేషనల్ ఫండ్ అసోసియేషన్" పేరుతో ఒక సంస్థను స్థాపించి చందాలు వాసులు చేసి, ఆ డబ్బును స్వాదినతా ఆందోళన నడపడానికి ఉపయోగించేవాడు. అలాగే మహారాష్ట్రలో బాల గంగాధర తిలక్ కూడా "పైసా ఫండ్" స్థాపించాడు. వచ్చిన డబ్బుతో, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమానికి, స్వదేశీ వస్తువుల ఉత్పాదనని ప్రోత్సహించడానికి ఉపగిస్తూ ఉండేవారు. గిరి కూడా సహచరులతో కలిసి ఈ సంస్థలకోసం ధన సేకరణ చేయ సాగాడు. ఈ చందాలు పెద్దలు తలపెట్టిన సమాజ సేవా కార్యక్రమాలకి విశేషంగా పనికి వచ్చేవి.
గిరి కళ్లికోట హైస్కూల్లో చదువుకునేటప్పుడు రామలింగం గారనే ఉపాధ్యాయుడు ఒకాయన ఉండేవారు. ఆయనకీ విద్యార్థులంటే బహుప్రీతి. బడిలో శ్రద్ధగా పాఠాలు చెప్పడమే కాకుండా వారి, వారి ఇళ్ళకు కూడా వెళ్లి వారంతా బాగా చదువుతున్నారో లేదో పరీక్షిస్తూ ఉండేవారు. అందువల్ల వారంటే విద్యార్థుల్లో భక్తి శ్రద్ధలు ఎక్కువగా ఉండేవి. ఆయన గొప్ప దేశ భక్తుడు కూడా. ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు ఎందరో ఆఫీసర్లు, వకీళ్ళు, అయి పేరు తెచ్చుకున్నారు. మరికొందరు రాజకియాల్లోచేరి ప్రజా నాయకులు కూడా అయ్యారు. గిరి కూడా వారి ప్రియ శిష్యులలో ఒకడు. వారిని ఆదర్శంగా భావించేవాడు. స్వదేశీ ఉద్యమం ఊపందుకున్నాక రామలింగం మాస్టారు కూడా ఉద్యోగం వదిలి పెట్టి, గాంధీజీ పిలుపుతో అహింసాయుత కార్యక్రమాల్లో పాల్గొన సాగారు. ఆ కారణంగా వారు జైలు శిక్ష కూడా అనుభవించ వలసి వచ్చింది.

ఏవిధమైన ఆదాయమూ లేక, యజమాని జైలులో ఉండడంవల్ల వారి కుటుంబం నానా యాతనా పడుతూ ఉండేది. అప్పుడు గిరి ముందుకు వచ్చి, నలుగురు స్నేహితుల్ని పోగు చేసుకుని చందాలు వాసులు చేసి వారి కుటుంబం పస్తులు ఉండకుండా కాపాడాడు. కాని ఈ విషయం మాస్టారికి తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. తెలిస్తే ఆయన దానికి అంగీకరించరని గిరికి తెలుసు. చిన్నప్పటి నుంచీ గిరిది అటువంటి స్వభావమే!

హైస్కూలు పూర్తయ్యాక, పై చదువు కోసం గిరిని మద్రాసుకి పంపారు. అక్కడ ఆయన ఒక ఉపాధ్యాయుడి ఇంట్లో ఉంటూ చదువుకునే వాడు. మద్రాసులోనే మరొక మేనమామ హనుమంతరావుగారు ఉండేవాడు. గిరికి ఆయనతో పరిచయం ఏర్పడింది. ఆయన గొప్ప త్యాగశీలి. దేశ భక్తుడు. గోపాలకృష్ణ గోఖలే పిలుపు విని, 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా' సొసైటీ మద్రాసు శాఖలో సభ్యుడిగా ఉండేవాడు. ఆయన తరువాతి కాలంలో గాంధిజీతో బాటు సబర్మతీ ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. తన సర్వస్వం దేశానికి సమర్పించినవాడు. మద్రాసులో ఉన్న రోజుల్లో హనుమంతరావుగారి ప్రభావం గిరి మీద ఎక్కువగా పడింది. ఈ విధంగా తలిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధుకోటి ఆయన్ని దేశభక్తి పరాయణుడిగా తయారు చేయడానికి ఎంతో దోహదం చేశారు. దేశ భక్తీ, దానికోసం ఎటువంటి త్యాగమైనా చేయడానికి సిద్ధపడడం అలవడ్డాయి. అందువల్ల ఆయన భావి జీవితం భారత దేశంలోనే గడపాలని ఉవ్విళ్ళూరేవాడు.

తండ్రి జోగయ్య పంతులు ఆయన ఆదర్శాలకి అడ్డుతగల లేదు కాని, గిరి ముందుగా బాగా చదువుకుని, అభివృద్ధిలోకి వచ్చి, పెద్ద వకీలు అయి, అప్పుడు రంగంలోకి దూకాలని ఆయన కోరిక. ఆ రోజుల్లో వకీలు వృత్తిలో రాణించాలంటే, విదేశాల్లో, ముఖ్యంగా ఇంగ్లాండులో న్యాయ శాస్త్రం చదవాలి. అందుకోసం ఆయన్ని ఐర్లండుకి పంపాడు తండ్రి. అది 1913వ సంవత్సరం. అవి ఐర్లాండులో విప్లవం చెలరేగి ఉన్న రోజులు. వారు స్వాతంత్ర్యంకోసం ఇంగ్లాండుతో పోరాడుతున్నారు.

గిరి డబ్లిన్ నేషనల్ యూనివర్సిటీలో న్యాయ శాస్త్రంలోనూ, డిగ్రీలోను ఒకేసారి ప్రవేశం తీసుకున్నాడు. డిగ్రీలో ఆయన పాఠ్యాంశాలుగా అంగ్ల సాహిత్యం, అర్థ శాస్త్రం, పొలిటిక్సు ఎంచుకున్నాడు. అప్పట్లో విదేశాల్లో చదివే విద్యార్థులందరికి అంగ్లేయులంటే ద్వేషం ఉండేది. గిరి మనసులో కూడా వారంటే అయిష్టత ఏర్పడింది. ఆ కారణంగా ఐర్లండులోని విప్లవకారులకి ఆయన చేరువయ్యాడు. అప్పుడే ఆయనకి ఉన్నవ లక్ష్మినారాయణతో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి 'ఎనార్చికల్ సొసైటీ' ని స్థాపించారు. ఐర్లండులోని క్రాంతికారులతో బాటు వీరు కూడా సాయుధ పోరాటం, రక్తపాతం లేకుండా శాంతిని సాధించలేమని నమ్మే వారిలో ఒకరయ్యారు. అంతేకాదు, స్వదేశానికి తిరిగి వచ్చాక పోరాటాన్ని కొనసాగించేందుకు బాంబులు తయారు చేయడం నేర్చుకోవడంవంటి సాహస కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఇంకా డబ్లిన్ లో ఉన్న భారతీయ విద్యార్థులందరితో కలిసి 'ఇండియన్ స్టుడెంట్స్ యూనియన్' ని స్థాపించారు. ఈ సంస్థ ద్వారా, వీరు ఆంగ్లేయుల దుర్నీతిని, ఇతర జాతుల వారిని హింసించడాన్నిఖండిస్తూ ఐర్లండులో ప్రచారం చేసేవారు. ఈ సంస్థలో గిరి ప్రముఖపాత్ర వహించి, పూర్తి మూడు సంవత్సరాలపాటు దానికి అధ్యక్షుడిగా ఉన్నాడు. యువకుల వేడి రక్తం అటువంటిది. ఆయన ఐర్లాండు నుంచి స్వదేశానికి తిరిగి వచ్చేసరికే గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చి, అహింసాయుత పోరాటం ప్రారంభించాడు. లేకపోతే గిరి జీవితం ఎటువంటి మలుపు తిరిగి ఉండేదో!

గాంధీజీ, 1915లో దక్షిణాఫ్రికానుంచి, స్వదేశానికి తిరిగి వస్తూ, కొంతకాలం లండన్ లో ఆగాడు.

అప్పుడాయన బస చేసిన స్థలం గిరి నివసించే ప్రదేశానికి దగ్గరలోనే ఉంది. గిరి మర్యాద పూర్వకంగా ఆయన్ని కలుసుకోవడానికి వెళ్ళాడు. సత్యాగ్రహం గురించి అప్పటికే డబ్లిన్ లో జరుగుతున్నా ప్రచారం గురించి, గాంధీజీకి తెలుసు. కొంత మాటా మంతీ సాగాక, చదువు పూర్తి చేసుకుని భారత దేశానికి తిరిగి వచ్చాక, స్వాతంత్ర్యపోరాటంలో భాగస్వామివి కమ్మని గిరికాయన సలహా ఇచ్చాడు. డబ్లిన్ యునివర్సిటీలో చదువుతూ ఉండగానే, గిరికి విప్లవ కారులతో సంబంధ బాంధవ్యాలు ఉన్నట్టు, ఆంగ్ల ప్రభుత్వానికి తెలిసింది. పోలీసులు కేసు పెట్టి అరెస్టు చేశారు. కానీ తగినంతగా సాక్ష్యాధారాలు లేకపోవడంతో విడిచిపెట్ట వలసి వచ్చింది. మరేమీ చేయలేక, ఆయన చదువు కొనసాగించడానికి అనుమతి ఇవ్వకుండా నిరాకరించారు. ఆఖరికి, 1916లో ఆయన చదువుకి స్వస్తి చెప్పి స్వదేశానికి తిరిగి వచ్చి, స్వాతంత్ర్య పోరాటంలోకి దిగాలని నిర్ణయించుకున్నాడు. వకీలు అయి, పేరు ప్రఖ్యాతులు పొంది, ధన సంపాదన చేయాలనే స్వార్థ చింతన మానుకున్నాడు.

తిరిగి వచ్చాక గిరి ఒకనాడు తండ్రితో కలిసి మద్రాసు వెళ్ళాడు. అప్పుడు మద్రాసు చీఫ్ జస్టిస్ గా ఎలింగ్ అనే ఒక ఆంగ్లేయుడు ఉన్నాడు. ఆయన జోగయ్య పంతులు గారికి దగ్గర స్నేహితుడు కూడా. కొడుకుని వెంట బెట్టుకుని తండ్రి అయన దర్శనానికి వెళ్ళాడు. మాటల సందర్భంలో గిరి లండన్ లో మూడు సంవత్సరాలు న్యాయ శాస్త్రం చదివాడని తెలుసుకుని, ఆయన గిరిని గోదావరి జిల్లా రామచంద్రపురంలో జిల్లా మున్సిఫ్ గా నియమిస్తానని, క్రమేణా అభివృద్ధిలోకి వచ్చి, చీఫ్ జస్టిస్ గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని చెప్పాడు. జోగయ్య పంతులు చాలా సంతోషించి, కొడుకు వైపు అంగీకరించమన్నట్టుగా చూశాడు.. కాని గిరి ఆ అవకాశాన్ని సగౌరవంగా తిరస్కరించాడు. ఇంటికి తిరిగి వచ్చాక తండ్రి కారణం అడిగితే, తను ఇంగ్లాండులో ఎనార్చికల్ సొసైటీలో సభ్యుడిగా ఉన్నపుడు స్వదేశానికి తిరిగి వచ్చాక, భారతదేశంలో ఆంగ్లేయుల పరిపాలన ఉన్నంత కాలం, వారి కింద ఊడిగం చేయనని శపథం చేసినట్టు చెప్పాడు. తండ్రి నిరుత్సాహపడలేదు సరికదా, గిరి ధైర్య సాహసాలని మెచ్చుకున్నాడు. అప్పటి ప్రజల దేశభక్తి అటువంటిది. ఆ తరవాత ఆయన పలువురు దేశనాయకులతో కలిసి స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకున్నాడు. క్విట్ ఇండియా కార్యక్రమంలో భాగస్వామి అయ్యాడు. జైలు శిక్ష అనుభవించాడు. జైలులో ఉండగా ఒకసారి ఆయనకి భయంకరమైన కల వచ్చింది. కలలో ఆయనకి మరణశిక్ష విధించబడింది. కుటుంబం అంతా శోకసముద్రంలో మునిగిపోయింది. తల్లి తనని చూడడానికి వచ్చింది. "చావంటే భయం ఎందుకు? చేదుమాత్ర మింగినట్టే అనుకో. మింగే వరకూనే భయం. ఆ తరవాత అంతా సవ్యంగానే జరుగుతుంది." ఇలా చెప్పి ఆమె వెళ్లి పోయింది. తనని వధ్య శిలకి తీసికెళ్ళి వేటు వేయబోతూ ఉండగా, పై అధికారి వచ్చి, "ఆపండి. ఈయన శిక్ష ఆజీవకారాగార శిక్షగా మార్చబడింది." అని అరిచాడు. ఎంత భయానకమైన కల! దీని తరవాత గిరికి జైలు అంటే భయం పోయింది.

సమాజ సేవలో ఎన్నిరకాల కృషి చేసినా గిరికి అత్యంత ప్రియమైనది రాత్రింబవళ్ళు శ్రమించి పనిచేసే కార్మికుల యోగక్షేమాలు. ఆ రోజుల్లో బెంగాల్ నాగపూర్ రైల్వే లో కార్మికుల పరిస్థితి చాలా శోచనీయంగా ఉండేది. వారి సంఘానికి చాలా కాలం అధ్యక్షుడిగా ఉండి వారి బాగోగులు చూశాడు. రాజాజీ, ప్రకాశం పంతులు, వంటి మహనీయుల మంత్రి మండలిలో పని చేశాడు. శ్రీలంకలో భారత దేశపు ప్రతినిధిగా ఉన్నాడు. ఉపరాష్ట్ర పతిగా రాష్ట్రపతిగా దేశసేవకి అంకితం అయ్యాడు. కార్య దీక్షాపరుల్ని దేశం ఆదరిస్తుందనడానికి గిరి జీవితం తార్కాణం.

# వేమూరి వేంకటేశ్వరరావు



## అంకెలు, సంఖ్యలు: ఆరు

**శిక్షా కల్పో వ్యాకరణం**
**నిరుక్తం ఛందసాం చయః |**
**జ్యోతిషామయనం చైవ**
**వేదాంగాని షడేవతు ||**

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం - ఈ ఆరింటిని వేదాంగములు అంటారు.

శిక్ష వేద మంత్రాలని ఎలా పలకాలో చెబుతుంది. ఛందస్సు (prosody) వేద మంత్రాల రచనా విధానాన్ని వివరిస్తుంది. వ్యాకరణం వేద మంత్రాలలో పాటించిన వ్యాకరణ సూత్రాలని చెబుతుంది. నిరుక్తం వైదిక శబ్దాల వ్యుత్పత్తిని (etymological meaning) వివరిస్తుంది. జ్యోతిషం ఖగోళశాస్త్ర (astronomy) సంబంధిత విషయాలని వివరిస్తుంది. కల్పం యజ్ఞయాగాదుల నిర్వహణలో వేద మంత్రాలని ఎలా ఉపయోగపరచుకోవాలో చెబుతుంది.

అధ్యాపనము అంటే వేదాలు, ఇతర శాస్త్రాలు బోధించడం. అధ్య యనం అంటే తాము చదువుకోవడం, యజనం అంటే యజ్ఞములు చేయటం, యాజనము అంటే యజ్ఞములను చేయించడం, దానం అంటే ఇతరులకు దానం చేయడం, ప్రతిగ్రహం అంటే ఇతరుల నుంచి దానములు స్వీకరించడం - ఈ ఆరంటినీ షట్కర్మలు అంటారు.

కామ, క్రోధ, లోభ. మోహ, మద, మాత్సర్యాలు అరిషడ్వర్గాలు –



అంటే ఈ ఆరూ శత్రు గణం.

సనాతన ధర్మానికి మూలాధారమైన షడ్దర్శనాలని మూడు జంటలుగా చెప్పడం ఆచారం: న్యాయ-వైశేషికాలు, సాంఖ్య-యోగాలు, పూర్వ మీమాంశ-ఉత్తర మీమాంశలు.

షడ్రసాలు కూడ మూడు జంటలే: ఉప్పు-పులుపు, తీపి-కారం, చేదు-ఒగరు. “రసాలు (రుచులు) అయిదా? ఆరా? అన్న ప్రశ్నకి ఇంతవరకు నికరమైన సమాధానం దొరకలేదు” అంటున్నారు శాస్త్రవేత్తలు. తీపి, పులుపు, చేదు, ఉప్పన, ఉమామి అనేవి ప్రాథమిక రుచులు అని ఆధునిక శాస్త్రం చెబుతోంది. ఉమామి అన్నది మనకి పరిచయం లేని రుచి. చైనా, జపాను వారి వంటకాలలో ఈ రుచి తగులుతుంది.


అతివృష్టి, అనావృష్టి, మిడుతలు, పందికొక్కులు, చిలుకలు, చేరువరాజులు – ఈ ఆరు ఈతి భాదలు అని అంటారు కాని, చేరువరాజులకి బదులు రాజకీయ నాయకులు అని ఉంటే బాగుంటుందేమో.

ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిస్సంతోషి, నిత్యశంకితుడు, పరభాగ్యోపజీవి – వీటితోపాటు మరొకటి ఉండాలి. క్రోధనుడా? నిర్ధనుడా?


ఆరు ముఖాలు ఉన్న కుమారస్వామి షడాననుడు.

షష్ఠి అంటే ఆరు, షష్టి అంటే అరవై అని గమనించవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

షట్పదం అంటే ఆరు కాళ్లు కలది అని అర్థం. నిఘంటువులో దీని అర్థం తుమ్మెద అని ఉంటుంది.



కాని, ఆరు కాళ్లు కల ఏ కీటకాన్నయినా ఈ పేరుతో పిలవచ్చు.
క్రైస్తవులు ఈ సృష్టి ఆరు రోజులలో జరిగిందనిన్నీ, ఏడవ దినాన్న సృష్టికర్త విశ్రాంతి తీసుకున్నాడని నమ్ముతారు.
గణితంలో ఆరుకి ఒక విశిష్ట స్థానం ఉంది; ఎందుకంటే, 6 యొక్క కారణాంకాలు 1, 2, 3. అనగా 1 నీ, 2 నీ, 3 నీ వేసి గుణిస్తే 6 వస్తుంది. తమాషా ఏమిటంటే 1 నీ, 2 నీ, 3 నీ కలిపినా 6 వస్తుంది. ఈ లక్షణం ఉన్న సంఖ్యలని పరిపూర్ణ సంఖ్యలు (perfect numbers) అంటారు. పరిపూర్ణ సంఖ్యలలో 6 అతి చిన్నది; తరువాత పరిపూర్ణ సంఖ్య 28 అని నిర్ధారించుకోవడం పాఠకులకి వదలిపెడుతున్నాను. అటుపైన వచ్చే పరిపూర్ణ సంఖ్యలని నిర్ధారించడం అంత తేలికైన పని కాదు.




గణితంలో ఒక శాఖ అయిన త్రిగుణమాత్రుకంలో ఆరు ప్రధాన ప్రమేయాలు ఉన్నాయి. వాటి పేర్లు: సైను, కోసైను, టేంజెంటు, కోసీకెంటు, సీకెంటు, కోటేంజెంటు.
గ్రీకు భాషలో అరుని సూచించడానికి “హెక్స్” అనే పూర్వ-




ప్రత్యయాన్ని వాడతారు, లాటిన్ లో “సెక్స్” అనే పూర్వప్రత్యయాన్ని వాడతారు. కనుక ఇంగ్లీషులో “హెక్సగన్” షడ్భుజం అవుతుంది. అంటే ఆరు భుజా-

$$\sin\alpha = \frac{a}{c} \qquad \csc\alpha = \frac{c}{a}$$
$$\cos\alpha = \frac{b}{c} \qquad \sec\alpha = \frac{c}{b}$$
$$\tan\alpha = \frac{a}{b} \qquad \cot\alpha = \frac{b}{a}$$



లు కల రేఖాకృతి. దీనినే షట్కోణి అని కూడ అంటారు.
సముద్రంలో పడవ ఎక్కడుందో తెలుసుకోడానికి వాడే పరికరం వృత్తంలో ఆరో భాగం ఆకారంలో ఉంటుంది కనుక దానికి “సెక్స్‌టెంట్” అని పేరు పెట్టేరు. దీనికి “షడ్భాగి” అని తెలుగులో పేరు పెట్టుకోవచ్చు.
ఆరుగురు ఆసామీలు ఉన్న వాద్య బృందాన్ని ఇంగ్లీషులో “సెక్స్టెట్” అంటారు. ఆరుగురు పిల్లలు ఒకేసారి ఒకే గర్భం నుండి పుడితే వారిని కవలలు అనకూడదు; “సెక్స్ట్యుప్లెట్స్” అనాలి. ఈ మాటకి తెలుగు మాట తెలియక ఇంగ్లీషులో వాడుకలో ఉన్న మాటని వాడేను. విశ్వవిద్యాలయాల్లో వాడే “సెమెస్టర్” అన్న మాట “సెమెస్ట్రిస్” అనగా “ఆరు నెలలు” అన్న లేటిన్ మూలం నుండి వచ్చింది.

అంకెలతోటీ, సంఖ్యలతోటీ కథ ఇంతటితో అయిపోలేదు. ఇంతవరకు పాఠకులు చదివిన ఆరు వ్యాసాలతో పాటు మరిన్ని వ్యాసాలు చేర్చి "ఒకటి, రెండు, మూడు,...అనంతం" అన్న పేరుతో ఒక ఇ-పుస్తకం కినిగె సంస్థ వారు ప్రచురించేరు. ఆ పుస్తకం ఈ దిగువ లంకె వద్ద దొరుకుతుంది.
http://kinige.com/kbook.php?id=9660

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



# ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

“నాకు స్టేజి ఫియర్ బావా” అంది వాణి

“చూడు వాణి మొదటి సారి కొంచెం బెరుకుగావుంటుంది, క్రమేపీ ఆ భయం తగ్గి కొన్నాళ్ళకి పోతుంది. “సముద్రం ఒడ్డున నించుని అలలు తగ్గాక స్నానం చేద్దామనుకుంటే అది జీవితం లో జరగదు. ఆ భయాన్నిమనం మనం తొలగించాలంటే మనం ధైర్యం చెయ్యాలి, అదే సమయంలో జాగ్రత్తగానూ వుండాలి. ఇక పాటల విషయానికి వస్తే మొదటి సారి కొంచెం తప్పులు రావచ్చు, భయంగానో, బిడియంగానో వుంటుంది. కాలక్రమేణా సాధనతో వాటిని మనం అధిగమించొచ్చు, చదువు విషయం కూడా అంతే. మనకి నూటికి నూరు మార్కులొచ్చినా మన పరిజ్ఞానాన్ని మనం సందర్భోచితంగా అన్వయించక పోతే లేదా వాడుకోకపోతే ఆ పరిజ్ఞానానికి సార్థకత వుండదు. ఇప్పుడు చెప్పు అసలు నీకు పరీక్షలు అంటే భయమెందుకు” అని అడిగాడు కృష్ణమోహన్.

“చదివినవి ఒకొక్కసారి గుర్తు రాక వచ్చినవి కూడా మరచిపో తున్నాను, దాని వల్ల భయం మొదలవుతున్నాది మొత్తం బ్లాంక్ అవుతున్నాది” అంది వాణి.

“వాణి ‘ఈ పరీక్షలు కూడా క్రికెట్ మేచ్ లాంటివే. ఎంత పేరున్న ఆటగాడైనా ఆ మేచ్లో బాగా ఆడాలి. ఆ రోజు బాగా ఆడాలంటే నెట్స్లో బాగా సాధన చెయ్యాలి. పరీక్షలు కూడా అంతే ఆ రోజు ఎవరు బాగా రాస్తే వారే విజయం సాధిస్తారు. ఇక్కడ కూడా బాగా ప్రిపేర్ అవ్వాలి, కంగారుపడకుండా ప్రశాంతంగా రాయాలి’. అలా ప్రశాంతంగా వుండటానికి, నీ పరీక్షల ఒత్తిడిని తొలగించడానికి కొన్ని చిట్కాలు చెబుతాను జాగ్రత్తగా పాటించు” అని పరీక్షల ముందు రివిజన్ ఎలా చేసుకోవాలి? పరీక్షలు అవుతున్నపుడు ఎలాంటిజాగ్రత్తలు తీసుకోవాలో చాలా కూలంకషంగా వాణికి వివరించాడు కృష్ణమోహన్. అతని మాటలు విన్నాక వాణికి చాలా వరకు ఉపశమనం కలిగింది.

“థాంక్యూ బావా నీ మాటలు విన్నాక నా విశ్వాసం పెరిగింది, నీ సలహాలు, సూచనలు తప్పక పాటిస్తాను. నాకు లెక్కల్లో కొన్ని సందేహాలు వున్నాయి. దయచేసి ఒక నాలుగు రోజులు కొంచెం గైడ్ చెయ్యవా?” అని అడిగింది వాణి.

“అలాగే, తప్పకుండా చెబుతాను. పరీక్షలు ఇంకా ఇరవై రోజులున్నాయి కదా, పది రోజులముందు రోజు విడిచి రోజు వచ్చి చెబుతాను. నీ పరీక్షల సెంటర్ ఎక్కడ? పరీక్ష టైమింగ్స్ ఏమిటి? వివరంగా చెప్పు” అని అడిగి తెలుసుకున్నాడు కృష్ణమోహన్.

“OK నీ పరీక్షలు గురించి నువ్వు ఇంక ఆలోచించకుండా, నేను చెప్పిన సూచనలని పాటించి దృష్టి అంతా చదువు మీద పెట్టి చదువు, నీ సందేహాలు అన్నీ నోట్ చేసుకొని నేను వచ్చిన రోజు అడిగి తెలుసుకో. నేను చెప్పిన సూచనలలో ఒక ముఖ్యమైన విషయం గుర్తు పెట్టుకో, నీకు చదవడం ఎంత ముఖ్యమో, విశ్రాంతి కూడా అంతే ముఖ్యం. అందుకని ఎలా చదువుకోవాలో నీకు ఒక టైంటేబుల్ తయారు చేసి ఇస్తాను అది పాటించు, అప్పుడు నీకు ఒత్తిడి అనిపించదు. నువ్వు ఫస్ట్ క్లాస్లో పాస్ అవుతావు, అది నా భాద్యత” అని టైంటేబుల్ తయారు చేసి ఇచ్చి వాణికి ధైర్యం నూరి పోసాడు కృష్ణమోహన్.

“థాంక్యూ బావా, నాకు ఇప్పుడు కొండంత ధైర్యం వచ్చిం

ది. నువ్వు చెప్పినట్లే చేస్తాను" అంది వాణి.
"ఇక నేను బయలుదేరుతాను" అన్నాడు కృష్ణమోహన్.
"ఆడపిల్లలిని వదిలి ఎలా వెళ తాము అని భయపడ్డాము, సాయంత్రం దాని పరిస్థితి చూసి ఇది అసలు పరీక్షలు రాస్తుందా అని బెంగ పడ్డాము. నువ్వు ఇక్కడ వుండటానికి ఒప్పుకుని, వాణీకి ధైర్యం చెప్పడం చూసాక దానితోబాటు మాకూ ధైర్యం వచ్చి ఊపిరి పీల్చుకున్నాము. ధన్యవాదాలు మోహన్" అన్నారు పార్వతమ్మగారు.
"అయ్యో భలే వారే ఈమాత్రం దానికి మీరు థాంక్స్ చెప్పడమేమిటి ! ఇలాగైతే ఇక మీదట నేను మీ ఇంట్లో కాఫీ త్రాగినపుడు, భోజనం చేసినపుడల్లా థాంక్స్ చెప్పాలి" అన్నాడు కృష్ణమోహన్.
"బావా ఒక కప్పు కాఫీ ఇవ్వనా" అని నవ్వుతూ అడిగింది అనూరాధ.
"ఎందుకు థాంక్స్ చెప్పించుకుందుకా" నవ్వుతూ అన్నాడు కృష్ణమోహన్. అతని మాటలకి అందరూ నవ్వుకున్నారు.
"లేదు నిజంగానే, భోజనం చేసి చాలా సేపు అయిందిగా" అంది అనూరాధ.
"మరీ మొహమాటపెట్టేస్తున్నావు"
"అదే వదిలేయమంటున్నాను" అని కాఫీ తీసుకు వచ్చింది అనూరాధ.
కాఫీ త్రాగుతుంటే "అబ్బాయ్, మోహన్ని హాస్టల్ దగ్గర దింపిరా" అని రవికి చెప్పారు విశ్వనాథం గారు.
కృష్ణమోహన్ బయలుదేరుతూ వుంటే "థాంక్యూ బావా, సాయంత్రం ఎంతో ఉద్రిక్తంగా వున్నపరిస్థితిని నువ్వు ఎంతో నేర్పుగా మామూలు స్థితికి తెచ్చావు. నిజంగా నువ్వు చాలా తెలివైనవాడివి" అంది అనూరాధ.
కృష్ణమోహన్ని హాస్టల్ దగ్గర దింపినాక "పిలిచిన వెంటనే వచ్చి వాణికి ధైర్యం చెప్పి, మేము వూరులో లేనప్పుడు అనూకి, వాణీకి సాయముండడానికి అడిగిన వెంటనే ఒప్పుకున్నావు, థాంక్యూ బావా" అన్నాడు రవి.
"హెయ్ రవి అంతా పెద్ద మాటలాడి ఇబ్బంది పెట్టకు"

*********

అనుకున్న ప్రకారం వాణి పరీక్షలు మొదలయ్యే లోపల నాలుగు రోజులు కాలేజి అయిన తరువాత వెళ్ళి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో సందేహాలు అన్నీ నివృత్తి చేసాడు కృష్ణమోహన్. మార్చి 9వ తేదీ సాయంత్రానికి అనూరాధ ఇంటికి వెళ్ళాడు.
పదవ తేదీ ఉదయం ఎనిమిది గంటలకల్లా బ్రేక్ఫాస్ట్ చేసి వాణిని తీసుకొని బయలుదేరేటపుడు "రాధా నాకు లంచ్ ప్రిపేర్ చెయ్యొద్దు, నేను మధ్యాహ్నం వాణీని ఇంటి దగ్గర దించి కాలేజి వెళ్ళి అక్కడే భోజనం చేస్తాను. కాలేజి అయినాక సాయంత్రం వస్తాను" అని చెప్పాడు కృష్ణమోహన్.
సాయంత్రం వచ్చాక వాణి పరీక్ష ఎలా రాసిందో కనుక్కుని, తరువాత పరీక్షకి ఈ రోజు, మర్నాడు పొద్దున్న చదువుకొమ్మని, మర్నాడు సాయంత్రం తనకు ఏమైనా సందేహాలు వుంటే అడగమని చెప్పాడు. అలా వాణికి కావలసిన ప్రోత్సాహాన్ని ఇచ్చి, దిశానిర్దేశం చేసి వాణి చేత పరీక్షలు బాగా రాయించాడు కృష్ణమోహన్.
రేపు పార్వతమ్మగారు, విశ్వనాథంగారు తిరిగి వస్తారనగా, ముందు రోజు రాత్రి కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో "బావా మా కాలేజీ వార్షికోత్సవం ఈ నెల 25న జరుగుతుంది. దానికి నువ్వు తప్పకుండా రావాలి, మంచి మంచి ప్రోగ్రాములు వున్నాయి. ఒక నాటిక కూడా వుంది, అందులో నేనూ నటిస్తున్నాను" అని కృష్ణమోహన్కి చెప్పింది అనూరాధ.
"నువ్వు ఏక్టింగ్ కుడా చేస్తావా? అదీ సంగతి అందుకే ఆ స్పోంటెనిటీ నీకు వచ్చింది"
"అలాగా! మరి తమరు కూడా నటిస్తారు కదా? అంటే ఆ స్పోంటెనిటీ నీకూ వున్నట్టేగా!"
"అమ్మాయిగారు అసలు తడుముకోరు వెంటనే రియాక్ట్ అయిపోతారు"
"నీ తెలివితేటల ముందుమేమెంత?"
"సరేలే, ఇంతకీ నాటికలో నీ పాత్ర ఏమిటి?"
"అది సస్పెన్స్, వెండితెరపై చూడాలి"
"అలాగే మేడం, మీ ఆటోగ్రాఫ్ మాకు తప్పకుండా ఇవ్వండి" అంటూ వేళాకోళం చేసాడు కృష్ణ

మోహన్.

"ఊహూ! అదిగో నన్ను ఆట పట్టిస్తున్నావు" అంటూ బుంగ మూతి పెట్టింది అనూరాధ.

"అబ్బా! మేము ఆట పట్టిస్తున్నాము, కానీ తమరు మమ్మల్ని ఆట పట్టించడం కాదు, ఏకంగా మాతో ఆట ఆడేసుకుంటారు"

"ఇలా నన్ను ఏడిపిస్తే నేను నీతో మాట్లాడను అంతే" .

"హమ్మయ్య! ఎంతటి శుభవార్త చెప్పావు, ఆ పని చెయ్యి జీవితాంతం నీకు ఋణపడి వుంటాను"

"ఆశ! నీకు ఆ అవకాశం ఎప్పటికీ ఇవ్వను, నువ్వు ఒక పని చెయ్యి, నేనే నీకు జీవితాంతం ఋణపడి వుంటాను"

"ఏమిటది"

"అహ ఏమీలేదు"

"ఏమీలేనపుడు అలా ఎందుకన్నావు?"

"అబ్బా ఏమీ లేదన్నాగా, ఇప్పుడా విషయం వదిలెయ్యి, సమయం వచ్చినపుడు చెబుతాను" అని తాను చెప్పదలచుకున్నది దాటవేసింది అనూరాధ.

విశ్వనాథంగారు, పార్వతమ్మగారు, రవి తిరిగి వచ్చిన తరువాత 16వ తేదీనాడు రవి ఇంజినీ రింగ్ కాలేజీ హాస్టల్కి వచ్చి "బావా ఒక శుభవార్త. నేను జన

వరిలో హైదరాబాద్ ఇంటర్వ్యూ కి వెళ్ళాను గుర్తుందా? ఆ ఉద్యోగాని కి ఇవాళే అపాయింట్మెంట్ లెటర్ వచ్చింది,

22వ తేది కల్లా జాయిన్ అవాలి" ఎంతో సంతోషంగా చెప్పాడు.

కృష్ణమోహన్, అవినాష్ ఇద్దరూ కంగ్రాట్స్ చెప్పి "పార్టీ ఎప్పుడు ఇస్తావు?" అని అడిగారు.

"తప్పకుండా ఇస్తాను. మీరిద్దరూ ఎల్లుండి ఉగాదినాడు మా ఇంటి కి వచ్చేయండి, అమ్మ మరీ మరీ మీ ఇద్దరినీ రమ్మని చెప్పింది, ఆ రోజు సినిమాకి వెళదాము" అని అన్నాడు రవి.

ఉగాది రోజున కృష్ణమోహన్, అవినాశ్ అనూరాధ ఇంటికి వెళ్ళారు.

ఆ రోజు భోజనాలు చేసాక మ్యాట్నీ షోకి సినిమాకి వెళదామని రవి అన్నపుడు అనూరాధ కూడా వస్తానంటే, నీ పరీక్షలు దగ్గరకొస్తున్నాయి వద్దని వారించాడు రవి. అలా అనేసరికి అనూరాధ అలిగి కూర్చుంది. చాలాసేపు రవి నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు కాని అనూరాధ ఒప్పుకోలేదు. అప్పుడు రవి కృష్ణమోహన్తో "బావా అనూ కూడా వస్తానంటుంది, పరీక్షలముందు తనని తీసుకువెళితే నాన్నగారు తిడతారు, నువ్వు ఒక్క సారి నచ్చజెప్పు" అన్నాడు.

అనూరాధ దగ్గరికి వెళ్ళి "చిన్న పిల్లలలాగ ఏమిటిది రాధా, నీ మంచి కోరేకదా అన్నయ్య చెబుతున్నాడు, నువ్విలా మంకుపట్టు పడితే ఎలా?" అన్నాడు కృష్ణమోహన్.

"నీ పక్కన కూర్చుని సినిమా చూడాలని వుంది, నేనూవస్తాను" అంది అనూరాధ.

"ఏయ్ ఏమిటిది? రోజు రోజుకీ రోజుకీ కొంటెవేషాలు ఎక్కువ అవుతున్నాయి. నువ్వు ఇలాంటి వేషాలు వేస్తే నేనుఅసలు నీతో మాట్లాడను, ప్రోగ్రామ్ కేన్సిల్ చేయ్యమంటాను" అని మందలించాడు కృష్ణమోహన్.

"వద్దులే మీరెళ్ళండి, కాని నువ్వు నాకు ఒక మాట ఇయ్యాలి"

"ఏమిటది"

"రవి అన్నయ్య హైదరాబాద్ వెళిపోతాడు గనుక నా పరీక్షలయిన తరువాత నన్ను నువ్వు సినిమాకి తీసుకెళతానంటే, నేను ఇప్పుడు రాను"

"సారీ, నేను ఒప్పుకోను" అని అక్కడ నుండి బయట హాలులోకి వచ్చి "సినిమా ప్రోగ్రాం కేన్సిల్ చెయ్యి రవి" అన్నాడు. రవి వెళ్ళి పార్వతమ్మగారికి అనూరాధ మీద ఫిర్యాదు చేసాడు. ఆవిడ అనూరాధని పిలిచి "పిచ్చి వేషాలు వెయ్యకుండా బుద్ధిగా చదువుకో అని "రవి మీరు సినిమాకి వెళ్ళండి" అని చెప్పి లోపలికి వెళ్ళింది.

రవి తన గదిలోకి బట్టలు మార్చుకుందికి వెళ్ళాడు. అవినాశ్ బయట సతీశ్తో కబుర్లు చెబుతున్నాడు.

"బావా పండగపూటా నన్ను నిరుత్సాహపరచడమే కాకుండా నా మీద అమ్మకి ఫిర్యాదు చేసి నన్ను తిట్టించావు కదూ, నీ పని చెబుతాను వుండు" అంది అనూరాధ.

"రాక్షసీ, నేను అత్తయ్యకి చెప్పలేదు రవి చెప్పాడు"

"సరే, నువ్వు నన్ను పరీక్షలయ్యాక సినిమాకి తీసుకు వెళ్ళకపోతే నిన్ను ప్రశాంతంగా వుండనీయయను" అని చిన్నపిల్లల మాదిరి కృష్ణమోహన్ వీపుమీద గట్టిగా కొట్టి పారిపోయింది. అనూరాధ చర్యకి ఆశ్చర్యపోయాడు కృష్ణమో

హన్. ఈ అమ్మాయి చనువు పెంచుకొని అనవసరమైన ఆశలు పెంచుకుంటున్నాది, సమయం చూసి అలాంటి ఆశలు పెంచుకోవద్దని చెప్పాలి అనుకున్నాడు... అసలు రాధకి అలాంటి అభిప్రాయం లేకపోతే తను ఆ విషయం మాట్లాడితే, తానే ఆ అభిప్రాయానికి బీజం వేసినట్లవడమే కాకుండా, అనవసరమైన చర్చకు తెర లేపి వెలితి పడినట్లవుతుంది... అందుకని తను తొందర పడకూడదు, రాధ బయటపడిన తరువాతే తను మాట్లాడాలి అనుకున్నాడు.

20వ తేదీన రవి హైదరాబాద్ ప్రయాణం. రవితో కాస్సేపు కబుర్లు చెప్పుకోవచ్చని కృష్ణమోహన్, అవినాశ్ మధ్యాహ్నం హాస్టల్లో భోజనం చేసాక అనూరాధ ఇంటికి వచ్చారు. అతనికి సర్దుకోవడంలో సహాయం చేసారు.

"రవీ అన్నీ పెట్టుకున్నావా?" అడిగాడు కృష్ణమోహన్.

"పెట్టుకున్నాను బావా, ఒక వేళ మర్చిపోయినా వెళ్ళేది హైదరాబాదే కదా అక్కడ కొనుక్కోవచ్చు"

"అది సరే బ్రదర్, బట్టలు, వస్తువులు మరచిపోతే కొనుక్కుంటాము, సర్టిఫికేట్స్, అపాయింట్మెంట్ లెటర్, డబ్బులు అలాంటి ముఖ్యమైనవి మరచిపోకూడదు" అన్నాడు అవినాశ్.

"ఆ! అవన్నీ పెట్టుకున్నాను"

"సరే మీ మేనమామగారి ఇంట్లోనే వుంటావు కదా, వాళ్ళ ఎడ్రస్, ఫోన్ నంబర్ ఇయ్యి" అని అడిగి తీసుకున్నాడు కృష్ణమోహన్.

"అయ్యో! ఈ హడావిడిలో చెప్పడం మరిచాను, మా పెద్దాడికి కరీంనగర్ నుండి హైదరాబాద్ బదిలీ అయ్యింది, బహుశా ఒక పదిహేను రోజులలో వాడు హైదరాబాద్ వచ్చేస్తాడు. మాతమ్ముడు వాళ్ళ కాలనీలోనే ఇల్లు చూస్తున్నారు. అందాక రవి మా తమ్ముడు ఇంట్లోనే వుండి పెద్దాడు హైదరాబాద్ వచ్చాక వాడి దగ్గరకి వెళతాడు" అని చెప్పారు పార్వతమ్మ గారు.

"ఓహ్! చాలా సంతోషం అత్తయ్యా...మామయ్య గారు మీరు హైదరాబాద్ బదిలీకి ప్రయత్నించండి, అందరూ ఒక చోట వుండచ్చు" అన్నాడు కృష్ణమోహన్.

"ఏం మేము ఇక్కడ వుండటం నీకు ఇష్టం లేదా? హైదరాబాద్ వెళ్ళిపొమ్మంటున్నావు" అని నవ్వుతూ అంది అనురాధ

"అబ్బే నేను అందరూ ఒకే చోట వుంటారన్న ఉద్దేశ్యంతో అన్నాను" అని అపరాధభావంతో అన్నాడు కృష్ణమోహన్.

"ఏయ్ అనూ ఏమిటా మాటలు" అని అనూరాధని మందలించి

"నాకు త్వరలోనే ప్రమోషన్ వస్తుంది, అప్పుడు హైదరాబాద్ బదిలీ అయ్యే అవకాశం ఎక్కువగా వుందయ్యా" అన్నారు విశ్వనాధంగారు.

సాయంత్రం రవిని ట్రైన్ ఎక్కించి అనూరాధని ఇంటి దగ్గర దిగబెట్టి మిత్రులిద్దరూ హాస్టలికి తిరిగి వచ్చారు.

25వ తేదీ నాడు అనురాధ కళాశాల వార్షికోత్సవానికి కృష్ణమోహన్, అవినాశ్ వెళ్ళారు. ఆ తరువాత పరీక్షలు దగ్గరవడంతో ఎవరి హడావిడిలో వాళ్ళుండి సుమారు ఒక నెల రోజులు కృష్ణమోహన్ అనూరాధ ఇంటికి వెళ్ళలేదు. మే మొదటి వారంలో అనూరాధ ఇంటికి వెళ్ళి స్కూటర్ ఇచ్చేసి "నేను రేపు విశాఖపట్నం వెళుతున్నాను, మళ్ళీ జూన్ 10వ తేదీన కాలేజి తెరుస్తారు అప్పుడు వస్తాను" అని చెప్పాడు.

"అబ్బా నెల్లాళ్ళు నిన్ను చూడకుండా నేను ఉండగలనా?" అంది అనూరాధ

"ఏయ్ మళ్ళీ మొదలెట్టావా?" అన్నాడు కృష్ణమోహన్.

"నేను నా మనసులోని మాటని, నా ఆవేదనని చెప్పినా నువ్వు తేలికగా తీసుకుంటున్నావు"

"మళ్ళీ డ్రామా ఏదైనా వుందా" చమత్కారంగా అన్నాడు.

"మానూ మాకును కాదు, రాయీ రప్పను కానే కాదు, మామూలు మనిషిని నేను" అని పాట పరంగా తన మనసు విప్పింది అనూరాధ.

"చాల్లే ఇంక ఆపు, వేసవి సెలవుల్లో మీ వూరు వెళతారా?" అంటూ విషయం మార్చాడు.

"ఒక వారం రోజులు వెళతాము, నువ్వూ రావచ్చుగా కోనసీమ అందాలు చూడచ్చు" అని వ్యంగ్యంగా అంది.

"ఉంకోసారి చూద్దాము"

"తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి"

"అర్ధమయిందిగా ఇంకెప్పుడూ ఏమీ అడక్కు"

"ముందరికాళ్ళకు బంధం వేస్తున్నావు, నీతో మాట్లాడవలసిన అవసరం వుంది"

"సరేలే సెలవులనుండి వచ్చాక ఈ చర్చ కొనసాగిద్దాము, హాలిడేస్ ఎంజాయ్ చెయ్యి, గుడ్ లక్"

అన్నాడు.

వేసవి సెలవులకి విశాఖ వెళ్ళిన కృష్ణమోహన్కి అనూరాధ చిలిపితనం, అల్లరి, కొంటెతనం మాటి మాటికి గుర్తు వస్తున్నాయి. అప్పుడపుడు పరధ్యానంగా వుండటం గమనించి "ఏరా అలా వున్నావు వంట్లో సరిగ్గా లేదా?" అని అడిగారు నరసింహారావుగారు.

"అబ్బే బాగానే వుంది నాన్నగారు" అని తడబడుతూ సమాధానం చెప్పాడు కృష్ణమోహన్. ఆ తడబాటు గమనించి "మరెందుకు అలా వున్నావు, పరీక్షలు బాగా రాయలేదా ఏమిటి" అన్నారు.

"బ్రహ్మాండంగా రాసాను"

"మరి దేనికోసం అలా డల్ గా ఉన్నావు, ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఏమీలేదు టైం పాస్ అవడం లేదు, బోర్ కొడుతున్నాది"

కొడుకు దేనిగురించో ఆలోచిస్తున్నాడు అని ఆయనకి అర్థమైంది, "పాస్ (రైల్వే) తీసి ఇస్తాను బొంబాయిలో నరహరి దగ్గరికి వెళ్ళి వాళ్ళతో సరదాగా గడిపి రా"

"వద్దు నాన్నగారూ రేపు ఉద్యోగం వచ్చిన తరువాత ఏ వూర్లో వుంటానో తెలియదు, అప్పుడు సెలవులకి ఇబ్బంది వుండొచ్చు అందుకని చదువు పూర్తి అయ్యే దాకా ఈ సెలవులన్నీ మీతోటే గడుపుతాను"

ఆ మాట విన్న నరసింహారావు గారికి కొడుకు పట్ల వాత్సల్యం పెల్లుబికి కొడుకు భుజం తట్టి "గుడ్" అన్నారు. ఆ మర్నాడు సాయంత్రం నరసింహారావుగారు ఆఫీస్ నుం డి ఇంటికి ఫోన్ చేస్తే కృష్ణమోహన్ ఫోన్ ఎత్తాడు "ఒరేయ్ మోహన్ సీతమ్మకి ఫోన్ ఇవ్వరా" అన్నారు.

(సుబ్బలక్ష్మిగారు స్వార్థం చూసుకోకుండా డొక్కా సీతమ్మగారిలాగ ఎక్కువగా దానధర్మాలు చేస్తుందని ఆయన భార్యని సీతమ్మా అని పిలుస్తారు)..."హలో వచ్చే శనివారం కాక ఆ పై శనివారం మనం అందరూ బొంబాయి వెళుతున్నాము, పాస్ తీసి రిజర్వేషన్ కూడా చేయించాను" అని సుబ్బలక్ష్మిగారికి చెప్పారు.

"మీరన్నీ ఇలాగే చెప్పా పెట్టకుండా చేసేస్తారు, నరహరి వాళ్ళు సెలవులకి దేశం (*) వస్తారేమో, ఒక ప్రక్క ఆవకాయలు పెట్టడానికి ఏర్పాట్లు చేసుకున్నాను, నరహరి పిల్లలికి జంతికలు, చెగోడీలూ చాలా ఇష్టం. అవన్నీ చెయ్యాలి సమయం సరిపోతుందో లేదో" అని ఆవిడ ధోరణిలో ఆవిడ వల్లించింది.

[(*) ఇక్కడ దేశం అంటే స్వంత రాష్ట్రం అని అర్థం. ఆ రోజుల్లో బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలో వున్న తెలుగు వారు సెలవులకి స్వంత వూరు వెళ్ళేటప్పుడు "దేశం" వెళ్ళొస్తాం అనేవారు] "ముందుగా చెబితే ఇవన్నీ వున్నాయి సమయం సరిపోదు, ఇప్పుడు అవదు అంటావు, అందుకే నీకు చెప్పలేదు. ఇంకా పదిరోజులు వుందిగా కంగారు ఎందుకు? అయినా నీ వెనకాలే పిల్లిలా తిరిగే నీ చెల్లెలు నరసమ్మ వుంటుందిగా సాయం చేయడానికి. నరహరితో మాట్లాడేకే పాస్ తీసుకున్నాను, సరేనా?"

"చాల్లెండి మీ వేళాకోళం నరసమ్మకి ఇల్లు సంసారం లేదా ఏమిటి ఎప్పుడూ నా వెనకాలే వుండటానికి" చెల్లెల్ని వేళాకోళం చేసినందుకు ఆవిడ చిరు కోపం ప్రదర్శించింది.

"అబ్బో చెల్లెలిని వేళాకోళం చేస్తే సీతమ్మ గారికి కోపం వచ్చిందే, సరే మోహన్కి ఫోన్ ఇయ్యి" అని అతనితో బొంబాయి యాత్ర గురించి చెప్పారు.

ఒక పది రోజులు బొంబాయి తిరిగి వచ్చారు...కృష్ణమోహన్ ఒక రోజు ప్రత్యేకంగా బొంబాయిలో తనకి ఇష్టమైన చౌపాటి బీచ్కి వెళ్ళి ఒక గంట అక్కడ గడిపి వచ్చాడు. అక్కడ వి.టి, చర్చ్ గేట్ స్టేషన్లలో జనసందోహాన్ని చూసి అతనికి ఒక వింత అనుభూతి కలిగింది....... అర్ధరాత్రి కూడా ప్రజలు ఆడవారు సైతం వారి వారి ఉద్యోగాలనుండి, వ్యాపారాలనుండి ఒంటరిగా నిర్భయంగా తిరిగి ఇళ్ళకు వెళ్ళడం, ఆ సమయంలో కూడా లోకల్ ట్రైన్స్ జనంతో కిట కిట లాడటం ఒకింత ఆశ్చర్యం కలిగించింది...


...జనం బస్ స్టాపుల్లో క్యూ పద్ధతి పాటించడం (*), జీబ్రా క్రాసింగుల వద్ద రోడ్డు దాటడం (*), ట్రాఫిక్ రూల్స్ క్రమశిక్షణతో పాటించడం, అలాగే ప్రతి బస్సుకి ఒక పోలీస్ వుండి బస్సుకి నిర్దేశించిన కెపాసిటీని అమలుపరచడం (*), ఆటోలు గాని, టేక్సీలు గాని, మీటర్ ప్రకారం డబ్బు తీసుకోవడం అతనికి ఆ నగరం పట్ల, అక్కడి జనం పట్ల ఒక గౌరవాన్ని, ప్రేమని కలుగజేసాయి.

{(*) ఇవన్నీ ఆ రోజులలో పాటించే వారు/వుండేవి}

( ఇంకా వుంది)

# గడిలో దాగిన వైజ్ఞానిక నుడి - 3

డా. చాగంటి కృష్ణకుమారి




**అడ్డం**

1. కాంతి వస్తువులపై పడి మన కంటిని చేరినపుడు మనకు ఆ వస్తువులను చూసే అనుభవం కలుగుతుంది.అలా మనకంటికి చేరిన కాంతి (9 )

5 ఓడ ( వెనకనుండి ముందుకి 3)

6. గొప్ప జ్ఞానము కలవాడు (2)

7. చదర (2)

9. వినికిడిజ్ఞానం ఒక – - - - - వెనకనుండి ముందుకి (5)

10 . రణ రంగం, క్రీడారంగం, విద్యారంగం ఈ పదాలలో రెండు అక్షరాల పదాన్ని ఎంచు (2)

11. అంతర అస్థిపంజరంలోని రెండు ఎముకలను కలిపేది కీలుబొమ్మకి వెళ్ళి అతుక్కొంది . (2)

12. వెల్లుమా(3)

14. వాడ వాడకీ ప్రతీ వాడకీ వెళ్ళి వెతుకు దొరుకుతుంది(2)

15. కాంతి పరావర్తనం, వక్రీభవనం, వ్యతికరణం, వివర్తనం, ధ్రువణం ధర్మాలను ప్రదర్శి స్తుంది. వీటిలో ఒకనొక ధర్మాన్ని కొలవడానికి వాడే పరికరం.( వెనకనుండి ముందుకి 9)

**నిలువు**

1. కంటికి చేరుతూ వస్తువులను చూస్తున్న అనుభవాన్ని మనం పొందడాని కారణమైన కాంతి అల (9)

2.వివిధ రంగుల తరంగ దైర్ఘ్యాలను ------ చూసి పొందవచ్చు(6 )

3. – ప్రధానమైన వాక్యాలు కర్తరి వాక్యాలు( కిందనుండి పైకి (2)

4. యుద్ధము (2)

6.స్పర్శ , చూపు మొదలైనవి (5 )

8 .ప్రయోగ శాలలో సులువుగ, తొందరగ వడపోతలను నిర్వహించడానికి వాడే పరికరం . (కిందనుండి పైకి 6)

13. గుంట పొంగనాలకి ఏకవచనం. మరో అర్థం లో ‘ చిట్టా’ ( కిందనుండి పైకి (2)

14. సమాచారం (2)

15. ఒక మూలకపు అభిలాకక్షణిక మైన తరంగ దైరఘ్య్ సాధ్నాల ద గగ్ర ఏరప్రచే వరణ్రేఖలతో లభించే కాంతి కిరణ వరణ్ పటము ( కిందనుండి పైకి (9)

# తెలుగు పద్య రత్నాలు - 8

## ఆర్. శర్మ దంతుర్తి



ధర్మరాజు తమ్ములతో అరణ్యవాసంలో ఉండగా వాళ్ళు వేటకి వెళ్ళినప్పుడు అటువైపు వచ్చిన దుర్యోధనుడి బావమరిది, దుస్సల మొగుడు అయిన జయద్రథుడు ద్రౌపదిని చూసి మనసు పారేసుకుని ఆవిడని బలవంతంగా రథం మీద ఎక్కించుకుని వెళ్తాడు. అక్కడే ఉన్న పాండవ పురోహితుడు ధౌమ్యుడు ఎన్ని చెప్పినా వినిపించుకోడు కూడా. వేట అయ్యాక వెనక్కొచ్చిన పాండవులతో చెప్తాడు ధౌమ్యుడు జరిగిన సంగతీ, జయద్రథుడు చేసిన నీచమైన పనీను. భీముడు తర్వాత యుద్ధంలో వాణ్ణి పట్టుకున్నాక ప్రాణం తీస్తానంటే, దుస్సల ని మనసులో పెట్టుకుని ధర్మరాజు చెప్పిన మాట విని తల బోడి చేయించి వదిలేస్తారు. ఇంత చేసినా బుద్ధి రాదు. ద్రౌపది ని పట్టుకుని పారిపోయినప్పుడూ, ఆవిడకి పెళ్ళై అయిదుగురు భర్తలున్నారని చెప్పినప్పుడూ, కామం తో కళ్ళుమూసుకుపోయినప్పుడూ లేని పౌరుషం అప్పుడొస్తుంది, తల బోడి చేసాక. ఇంత పరాభవం చేసిన ఈ పాండవులని ఎలాగో ఒకలాగ చంపాలి అనే పట్టుదలతో శివుడి గురించి తపస్సు చేస్తాడు జయద్రథుడు. అయితే తాను చేసిన పని ఎటువంటిదనేది ఎప్పుడైనా ఆత్మ విమర్శ చేసుకున్నాడా? సరే, చేసిన తపస్సు వల్ల శివుడు కనిపించాడు. భగవంతుడు కనిపిస్తే ఏమిటి అడగడం? పథ్నాలుగు లోకాలనీ సృష్టించి లయం చేస్తున్నవాడికి మనకేం కావాలో తెలియదా? మనం పిచ్చి కోరికలు అడిగితే ఆయన నవ్వుకోడూ? శివుడు కనిపించాక 'నేను -నాకు ఇంత పరాభవం చేసిన - పాండవులని జయించాలి' అని అడిగాడు. ఇంత పరాభవం నాకెందుకు జరిగింది, నేనేం తప్పు చేసాను అని ఒక్కసారైనా ప్రశ్నించుకున్నాడా పోనీ? ఆ విషయం భగవంతుడికి తెలియదా?

ఇలా కోరుకున్న జయద్రథుడికి శివుడు సమాధానంగా ఏమంటున్నాడో చెప్పే పద్యమే ఎర్రాప్రగ్గెడ ఆంధ్ర మహాభారతం అరణ్య పర్వంలో రాసిన పద్యం. మొత్తం పాండవులనందరినీ జయించడం దేవేంద్రుడికైనా సాధ్యం కాదు. అయితే,

**చ.** **విజయు డొకండు తక్క నతివీరుల బార్థుల నున్న నల్వురన్**
**నిజ మొకనాటి కయ్యమున నీవు జయింపుము; ఫల్గునుండు స**
**ర్వజగదజయ్య విక్రముడు; వాని నెదుర్కొని నాకు నైన బో**
**ర జితుని జేయు టెంతయు భరం బగు నిక్కము పల్కితిం జుమీ!**

(అ. ప. షష్ఠాశ్వాశం. 257)

విజయుడిని (అర్జునుణ్ణి) తప్ప మిగతా నలుగురి పాండవులనీ ఒక రోజు యుద్ధంలో జయిస్తావు. అర్జునుడికున్న పేర్లలో "విజయుడు" అనేది మొదట్లోనే వాడి చెప్తున్నాడు శివుడు, ఎందుకంటే అతనికి అపజయం అన్నదే లేదు. ఆ ఫల్గునుడెటివంటివాడు? సర్వజగదజయ్యా విక్రముడు – అతన్ని ఎదుర్కోవడం నాకు కూడా బాగా కష్టం అవుతుంది (నాకు నైన బోర జితుని జేయు టెంతయు భరం బగు). నిజం చెప్తున్నాను సుమా, అంటున్నాడు. శివుడిలా ఎందుకు అంటున్నాడని చూస్తే మనకి తెలిసేది - అర్జునుడు సాక్షాత్తూ మహేశ్వరుణ్ణే నిలుచోబెట్టి యుద్ధం చేసి పాశుపతం సంపాదించుకున్న వీరాధివీరుడు. అటువంటివాడిని జయించడం అసాధ్యం కదా?

అయితే దీంట్లో మరో విశేషం ఉంది. పాండవులకి ఇంత చేటు చేసినవాడికి అసలు వరం అనేదే ఇవ్వడం దేనికీ? శివుడు భోళాశంకరుడు. ఆయన ఆశుతోషుడు – అంటే చాలా సులభంగా కనికరించేవాడు - కనక చిన్న అభిషేకం చేసి, ప్రసాదం పెట్టి ఏదైనా అడిగితే ఇవ్వనూ అనలేడు. కానీ ఇక్కడ జయద్రథుడు అడిగినది అసాధ్యమైన కోరిక కనక కొంచెం తగ్గించి 'సరే ఒక రోజు మాత్రం మిగతా నలుగుర్నీ జయిస్తావులే' అని చెప్తున్నాడు. మరి అర్జునుణ్ణి ఎందుకు జయించలేవంటే నా అనుగ్రహం చేత అతనికి ఈ విశేషం కలిగింది (పాశుపతం ఇచ్చాడు కదా?). దీని గురించి మరింత చెప్తున్నాడు తర్వాతి పద్యంలో "నువ్వు కోరిక అడగడం బాగానే ఉన్నా, ఈ విషయం చూడు."

**క. నిఖిలాస్త్రశస్త్రవిద్యా సఖుడపరాజితయశోవిశాలుడు విష్ణుం**
**డఖిలేశ్వరుడతనికి బ్రియ సఖుడటె యవ్వీరు గెల్వ శక్యమె నీకున్? (259)**

నిఖిల అస్త్రశస్త్ర విద్యాసఖుడై, అపరాజితుడూ, యశో విశాలుడైన అర్జునుడికి విష్ణువు – అఖిలేశ్వరుడైన భగవంతుడు - ప్రియమైన మిత్రుడు. అటువంటి నరనారాయణులని, గెలవడం మానవమాత్రుడవైన నీకేం సాధ్యం అవుతుంది?

మరోసారి క్రిందటి నెల వ్యాసాల్లో చదివినది గుర్తు తెచ్చుకుంటే కోరిక అనేదే మన నాశనానికి మూలం. హిరణ్యకశిపుడు ఎలా కోరుకున్నాడో అలాగే చావాల్సి వచ్చింది కదా? అదే విధంగా ఇక్కడ జయద్రథుడు కూడా తన చావు ఎలా రావాలో తపస్సు చేసి మరీ సాధించుకున్నాడు. ఇదంతా దేనివల్ల? ద్రౌపదిని తన దాన్నిగా చేసుకుందామనే తుచ్ఛమైన మరో కోరిక. ఈ మనసునీ, కోరికలనీ అదుపులో పెట్టుకున్న నాడు మనకి భగవంతుడు కనిపిస్తే ఏమడుగుతాం? కన్నప్ప రెండో కన్ను తీసి ఇవ్వడానికి సిద్ధపడుతుంటే శివుడు అడ్డుకుని అడుగుతాడు, "నన్ను దృష్టికోసం, కంటి చూపు కోసం అడగడానికి తపస్సు చేసేవాళ్ళు చాలామంది ఉన్నారు కానీ నా గురించి కంటికి కన్ను ఇచ్చే భక్తుడవి నువ్వొక్కడవే, ఏం కావాలో కోరుకో," అని. అప్పుడు కన్నప్ప అడిగినది చూస్తే వళ్ళు గగుర్పొడుస్తుంది, "నేనా, ఏం కావాలో అడిగేవాడిని? మీకు తోచినది, ఏమివ్వాలని ఉంటే అదే దయ చేయండి."

మహావిష్ణువు కనిపించాక ధ్రువుడు కూడా అలాగే అడుగుతాడు, "అన్ని మాయా విశేషాలకీ కారణమైన మీ మనోహరమైన మోము అన్నివేళలా అలా చూస్తూ ఉండడం తప్ప మరో కోరికేం లేదు నాకు." అలా అడిగితే భగవంతుడు ఏమిచ్చాడు వీళ్ళకి? శాశ్వతమైన కైలాస నివాసం, పథ్నాలుగు లోకాలూ నాశనమైనా ఎప్పటికీ నశించని ధ్రువ పథం. అదే అసలు సిసలు భక్తితో కూడిన కోరికకీ, మామూలు కామంతో కోరిన కోరికలకీ వ్యత్యాసం.

# అవగాహన



## ఆదూరి హైమవతి

వేణు సహజంగా తెలివి గలవాడు, ఏకసంతాగ్రాహి.ఏదైనాచూస్తే ఇట్టే పట్టు కుంటాడు. అంతే కాక వాడి చేతి వ్రాత ముత్యాల్లా ఉంటుంది. ఎప్పుడూ మంచి మంచి బట్టలేసుకుంటాడు.ఇటు స్కూల్లోనూ, ఇరుగు పొరుగూ మాత్రమేకాక ,అటు బంధు వర్గంలోనూ అంతా వేణును, వాడి తెలివి తేటలకు తెగపొగిడే వారు . దాంతో వాడికి తెలీకుండానే కాస్తంత గర్వం చేరి పోయింది.

తక్కువ మార్కులు వచ్చిన వారిని చిన్నచూపు చూడటం మాత్రమే కాక ,చేతివ్రాత బాగా లేని వారిని హేళన చేయడం కూడా మొదలెట్టా డు. అమ్మ, నాన్న ఏదైనా చెప్తే చేసే వాడుకాదు. ఇంట్లో ఉన్న బామ్మా తాత గారూ ఏదైనా సాయం అడిగితే పెడ చెవిని పెట్టే వాడు .ఎప్పుడూ చెల్లాయ్ వల్లితో పోట్లాటలే.

వాడి ప్రవర్తనకు విసిగిపోయిన వా ళ్ళమ్మ ఆవేసవి శలవులకు పి పిల్లలిద్దరినీ వేములపాడు పంపింది. అది వేణు,వల్లిల అమ్మమ్మ తాత గారి ఊరు. పొలాలూ, కొబ్బరి, మామిడి తోటలూ,ఆవులూ గేదెలూ, బండ్లూ అంతా పల్లెవాతావరణం.

ఆరోజు వేణు మంచి నిద్రలో ఉండగానే బయట సందడిగా మాట్లా డుకోడం వినిపించి లేచాడు .బయట-పశువుల పాకలో ఉన్నారంతా. వేణును చూసి మామ కొడుకు శీను "ఒరే వేణూ! రారా! తెల్లావుకు తువ్వాయి పుట్టింది రా! భలే ఉంది రారా!" అంటూ పిలిచాడు .

"ఛీఛీ పశువుల పాకలోకా!పేడ గబ్బు." అన్నాడు ముక్కుమూసుకుని .

"మరి నీవు త్రాగేది ఆ ఛీఛీ పశువుల పాకలోపేడ వేసే ఆవుపాలే అని మరువకు."అంది అమ్మమ్మ.

నిజమే ననిపించింది వేణుకు. అమ్మమ్మ ఆ ఆవు పాలతో కమ్మని జున్నుచేస్తే హాయిగా లొట్టలేసు కుంటూ తిన్నాడు వేణు.

" నేనెప్పుడూ ఇంత టేస్ట్ గా ఉండే ఈ జున్ను తీననే లేదు అమ్మమ్మా!" అన్నవేణుతో ,"చూశావా! వేణూ!ఛీ ఛీఅన్న ఆవు పాలతో చేసిన జున్ను ఎంత కమ్మగా ఉందో!ఎవ్వరినీ, దేన్నీ ఛీ ఛీ అనుకో కూడదురా! బురదలో దిగి ఎద్దులతో పాటుగా రైతు' ఛీ పాడు బురద'అనుకోకుండా పొలం దున్ని పంటవేయక పోతేమనకు బియ్యం ఎలా వస్తుంది?' అంది అమ్మమ్మ .

'నిజమే సుమా!' అనిపించింది వేణుకు.

చెమటతో తడిసి వాసనేస్తున్న, చిరిగిన, మురికి బనియన్ తో వచ్చిన సేద్య గానిని చూసి,-ముక్కుమూసుకున్నాడు వేణు. వాడిని గమనిస్తూనే ఉన్నాడు తాత. ఆ సేద్యగాడు "బాబుగారూ! ఇయ్ గోండి మనచెట్ల మామిడి పల్లు, బంగిన పల్లీ, మల్గోవా, చెరుకు రసాలు , పట్నం నుండీ పిలగా ళ్ళొస్త రని చెప్పింద్రుగదా ! అందుకే తెచ్చినా నండీ! "అంటూ తలమీంచీ పళ్ళ బుట్ట దించాడు.

"మంచిదిరా రాములూ! పెరట్లోకెళ్ళి అమ్మఅన్నం పెడుతుంది తినిపె ళ్ళరా! ఎప్పుడనగా తోటకెళ్ళావో ఏమో . ఆ చిరిగిన బనీను తీసేసి అమ్మ ఇస్తుంది, నా చొక్కా ఒకటి పట్టుకెళ్ళి వేసుకోరా!"అంటూరాముల్ని పంపా రాయన.

" ఏరా! వేణూ !రాములు చెమట వాసన మాత్రమే నీముక్కుకు వచ్చింది, ఈ మామిడిపళ్ళ వాసన

మాత్రం రాలేదేం ట్రా!"అన్నాడు.

"అదేంటి తాతా! అంత కమ్మని వాసనేసి నోట్లో నీరూరు తుంటేనూ!" అంది వల్లి.

"మీ అన్నకు చెమట వాసనే వచ్చినట్లుంటేనూ.వేణూ! వారి చెమట వాసన వెనుక దాగున్నవారిశ్రమనూ, మనం పొందే సుఖాలనూ కూడా చూడాల్రా! మీ పట్నవాసుల్లా నలగని డ్రెస్సూ, కాళ్ళకుబూట్లతో ఉంటే తినేందుకు తిండీ,పండ్లూ, కూరలూ,త్రాగేందుకు పాలూ,నీళ్ళూ , కట్టేందుకు బట్టా, ఉండేందుకు ఇళ్ళూ, తిరిగేందుకు వాహనాలూ ఎలావస్తాయిరా! " అన్నా డుతాత.

వేణు సాలోచనగా తలూచాడు.' నిజం సుమా!' అనుకున్నాడు మరోమారు.

ఆరోజు సాయంకాలం తోటమాలి కొడుకు మల్లీసు తేగల కట్ట తీసుకొచ్చాడు. మల్లీసు కూడాచెమటతో తడిసిన బనీనులో , చిన్న చిరిగిన నిక్కరేసుకుని వచ్చాడు.

"తాతగారూ! మానాయిన ఈ తేగలుఇచ్చిరమ్మన్నడండీ!" అంటూ గోతంలో చుట్టు కొచ్చిన తేగల కట్ట అక్కడ పెట్టాడు.

"ఒరే మల్లీసూ! పెరట్లోకెళ్ళి అమ్మమ్మ అన్నం పెడుతుంది తినెళ్ళరా! ఆ చూడూ నేచెప్తాగానీ అమ్మమ్మ ఇస్తుందిలే శీను లాగూ చొక్కా కూడా తీస్కెళ్ళరా! "అని చెప్పాడు ఆప్యాయంగా.

"తాతగారూ! అయ్యి తంపటేసిన తాగలేనండా!అమ్మమ్మగారు సెయ్యేలేరని మాయమ్మ తంపటేసి ఇచ్చి పంపిందండా!" అన్నాడు.

"చూశావా వేణూ! మీమీద వాళ్ళకెంత ప్రేమో!మామిడితోట నుంచీ మూడు మైళ్ళు నడిచొచ్చాడు ."అన్నారు తాతగారు.

' తాను ఇంట్లో ఒక్కపనీ చేయడు. తనకే అందరూ అన్ని చేయాలి. మరి ఈ మల్లీసో !తనకూ వాడికీ ఎంత తేడా!' అనుకున్నాడు వేణు. మామకొడుకు శీను అమ్మమ్మకూ, తాతకూ చేసే సహాయం చూసి వేణు ఆశ్చర్యపోయాడు, వాడు తాతగారి పాదాలు పిసకడం, అమ్మమ్మ కాళ్ళకు మందు రాసి మసాజ్ చేయడం చూసి, తాను తన తాత కాసిని మచినీళ్ళ డిగినా తెచ్చిపెట్టక ,విసుక్కోడం గుర్తొచ్చి వాడిమీద వాడికే అసహ్యమేసింది.

అలా ఆపల్లెలో ఒక్కొక్కరూ, మరొకరి కోసం స్వార్ధ రహితంగా చేసే పనుల న్నీ చూసి అద్దంలోముఖంచూసు కున్నట్లు వేణుకు తన తప్పులన్నీ తెలి సొచ్చాయి. బాగా సబ్బేసి ,వేణ్ణీళ్ళలోనానబెట్టి,బండ కేసి బాది, నీళ్ళ ళ్ళో ఝాడించి,ఎండలో ఆరేసి,విస్త్రీ చేసిన చొక్కాలాగా వాడి మనస్సులోని మాలిన్యం ,అహంకారం, గర్వం, బింకం అన్నీపోయి,ప్రేమ ,అప్యాయత, అనురాగం,సేవా భావం ,త్యాగం,స్నేహం చోటు చేసుకు న్నాయి.

దానికి నిదర్శనంగా వేణూ అక్కడి పిల్లలందరితో కలిసి ఆడి,పాడి, చెఱువులో వారు నేర్పగా ఈత నేర్చుకుని అమ్మమ్మ దగ్గర ప్రార్ధనా శ్లోకాలూ, తాతగారి వద్ద భగవద్గీత,శతక పద్యాలూ కూడా కంఠతాపట్టాడు.

తిరిగి తన ఊరికి వచ్చేప్పుడు తన చొక్కాలాగూలన్నీ అక్కడ తనకు ఈత నేర్పిన మల్లీసుకూ, చెట్లెక్కడం నేర్పిన నాగ రాజుకూ, తన తో ఆడుకున్న తోటల్లోని కాపలా దార్ల పిల్లలందరికీ ఇచ్చేసి వచ్చాడు. బస్సు లో ఎక్కిన తనకు వాళ్ళం తా చేతులుపుతూ ఉంటే వేణూ కళ్ళలో నీరు తిరిగింది.

అమ్మమ్మా తాత గారూ కుట్టించు కోమనిబహూకరించినకొత్తబట్టలతో, స్వచ్ఛమైన మంచి ప్రవర్తనతో ఇల్లు చేరిన వాడి ముఖంలోనే మార్పు గమనించి అమ్మ ఎంతోసంతోషించింది ,ఫేస్ ఈజ్ ద ఇండెక్స్ ఆఫ్ ద మైండ్ కదామరి!.

**నీతి:** సత్సంగం చక్కని మార్పును తెస్తుంది.

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

– సంపాదకురాలు

# మా ఊరి నందుల ఆత్మీయ కథ

## నందుల ప్రభాకర శాస్త్రి



(గత సంచిక తరువాయి)

### సాహిత్యం

ఆ చుట్టుపక్క పది ఊర్లలో సాహిత్యానికి మా ఊరు పెట్టింది పేరు. సాహితీవేత్తలు, సాహిత్యాభిలాషులు మెండుగా వుండేవారు. తీరిక చిక్కినప్పుడల్లా సాహితీ గోష్ఠి నడుస్తూ వుండేది. ఈ గోష్ఠిలో ముఖ్యంగా చెప్పుకోతగ్గది మహాభారతం.

మహాభారతం విరాట్ పర్వానికి ఒక ప్రత్యేకత వుంది. ప్రతి సంవత్సరం ఈ విరాట్ పర్వం పురాణ పఠనం జరుగుతుంది. వర్షాలు సకాలంలో పడాలంటే విరాట్ పర్వం చదివేవారు. పద్దెనిమిది రోజులపాటు రాత్రి పూట ఓ రెండు గంటలు విరాట్ పర్వం చదవటం, దానిని వ్యాఖ్యానించటం జరుగుతుంది. అరణ్యావాసం, అజ్ఞాతవాసం అయిపోయిన తర్వాత ఉత్తర గోగ్రహణంతో ఉత్తరుడు రథ సారథిగా బృహన్నల యుద్ధం చేస్తూ, బృహన్నలే అర్జునుడని తెలుసుకున్న తరవాత కౌరవులు మళ్ళీ పాండవులను అరణ్యావాసం, అజ్ఞాతవాసం పూర్తి అవలేదని పేచీ పెడితే .... ధర్మరాజును చెప్పమన్నప్పుడు ...

'నిండె... నిండె... నిండె' ...

అంటూ పద్యం చదువుతాడు. ఆ పద్యం చదివేటప్పటికి చెరువు నిండి అలుగు పారుతూ వుంటుంది. ఆ రోజుల్లో అలా జరిగేది.

అయితే విరాట్ పర్వం చదవటం, అర్థం చెప్పటం చాలా రంజుగా వుండేది. చదవటం ప్రముఖ నాదస్వర విద్వాంసుడు, సంగీతనిధి పెద్దకేశన్న చేసేవాడు. రాగయుక్తంగా పద్యాన్ని అర్థవంతంగా చదివితే ... అర్థం చెప్పటానికి నందుల సుబ్బరామయ్య కూర్చునేవారు. అసలే కొంచెం కొంటెతనం ఎక్కువ. పండిత పామరులకు అర్థం అయ్యే విధంగా వ్యాఖ్యానించేవారు. అందుకు మహాభారతంలోని పాత్రలను నిజ జీవితంలోని మనుషులతో పోల్చి చెప్పేవారు.

తమను తాము మహాభారత పాత్రలలో చూసుకోవటానికి సాయంకాలం అయ్యేటప్పటికి అందరూ కోదండరామస్వామి గుడిలో గుమికూడేవారు. ఆముదపు దీపము వెలుగులో విరాట్ పర్వం చదువుతూ వుంటే సుబ్బరామయ్య అర్థం చెపుతూవుంటే ఆనంద డోలికల్లో తేలిపోయేవారు.

భీముని పాత్రకు నందిపల్లె బికారిని ఎన్నుకునేవారు. బికారి ముగ్గురాళ్ళ గనిలో పని చేసేవాడు. కోడూరి కొండలో ముగ్గురాళ్ళ గనులలో సగం గనులను త్రవ్వింది బికారే.

(ఇంకా ఉంది)



బహుముఖ ప్రజ్ఞాశీలి

# ప్రతివాది భయంకర శ్రీనివాస్



## పోడూరి శ్రీనివాసరావు

'ప్రతివాది భయంకర శ్రీనివాస్' అంటే ఎవరికీ తెలియకపో వచ్చు, కాని గానకళా ప్రపంచంలో సంగీత సామ్రాజ్యంలో 'పి.బి. శ్రీనివాస్' అన్న పేరు తెలియని సంగీత విద్వాంసుడు కానీ సంగీతాభిమాని కానీ ఉండడంటే అతిశయోక్తి కాదు.

శ్రీ పి.బి. శ్రీనివాస్ ఒక్క సినీ గాయకుడు మాత్రమే కాదు, సినీ సంగీతం, శాస్త్రీయ సంగీతం, గజల్ సంగీతం మాత్రమే కాదు, గాయకుడిగా, బహుభాషా చిత్రాల గాయకుడిగా,కవిగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచినవాడు.

సుమారు మూడు వేలకు పైగా పాటలు, తెలుగులో, కన్నడంలో, తమిళంలో, హిందీలో, మలయాళంలో, తుళు, కొంకణి భాషలలో ఎన్నో పాటలు పాడి, సంగీతాభిమానుల్ని సంపాయించుకున్న ప్రజ్ఞాశాలి. ప్రత్యేకంగా కొన్ని తరహా పాటలు పాడాలంటే శ్రీనివాస్ తప్ప మరే గాయకునికీ సాధ్యం కాదని ఇతర గాయకులూ, సంగీత దర్శకులూ ఒప్పుకోక తప్పని విషయం.

శ్రీ పిబి శ్రీనివాస్ 22 సెప్టెంబర్ 1930 న శ్రీ ప్రతివాద భయంకర ఫణీంద్రస్వామి, శ్రీమతి శేషగిరమ్మ దంపతులకు, తూర్పు గోదావరి జిల్లా లోని 'గొల్లప్రోలు' గ్రామంలో జన్మించారు. శ్రీ ఫణీంద్ర స్వామి ప్రభుత్వ ఉద్యోగి. శ్రీమతి శేషగిరమ్మ సంగీత విద్వాంసురాలు. శ్రీ ఫణీంద్ర స్వామి తనలాగే తన కొడుకుని కూడా ప్రభుత్వ ఉద్యోగిగా చూద్దామనుకొన్నారు. శ్రీనివాస్ తండ్రి అభీష్టం మేరకు B.Com చదివారు గాని, వారి దృష్టి అంతా సంగీతం మీదే ఉండేది. మద్రాసులో గల దక్షిణ భారత హిందీ ప్రచారసభ వారు నిర్వహించిన హిందీ విశారద పరీక్షలో కూడా శ్రీనివాస్ ఉత్తీర్ణులయ్యారు.

ఒకానొక ఇంటర్వ్యూ లో తన తల్లి గారైన శేషగిరమ్మ గారి ద్వారానే తనకు కర్ణాటక శాస్త్రీయ సంగీతం యొక్క పరిచయం లభించిందనీ, ఆమే తన సంగీత గురువని, ఆమె వద్దనే శాస్త్రీయ సంగీతం అభ్యసించానని చెప్పారు.

హైస్కూల్లో చదివే రోజులలో ఎక్కువగా రేడియో కార్యక్రమాలు వినేవాడిననీ, హిందీ చలన చిత్ర



గాయకుడు మహ్మద్ రఫీ తన అభిమాన గాయకుడని శ్రీనివాస్ చెప్పేవారు. శ్రీనివాస్ వయసు సుమారు 12 సంవత్సరాలు ఉన్నప్పుడు, శ్రీనివాస్ మేనమామ శ్రీ కిడాంబి కృష్ణస్వామి గారు, ఒక నాటకంలో పాట పాడడానికి శ్రీనివాస్ కి అవకాశం ఇచ్చారు. ఒక విధంగా శ్రీనివాస్ కి అదే తోలి అవకాశంగా చెప్పుకోవచ్చు.

అనంతరం పెద్దయ్యాక జెమినీ స్టుడియోలో వైణికుడిగా పనిచేస్తున్న ప్రసిద్ధ వీణా విద్వాంసుడు శ్రీ ఈమని శంకరశాస్త్రి గారిని, శ్రీనివాస్ కలవడం ఆయన శ్రీనివాస్ ని జెమినీ స్టూడియో అధినేత శ్రీ ఎస్ ఎస్ వాస న్ గారికి పరిచయం చెయ్యటం జరిగింది. వారి ఎదుట శ్రీనివాస్, తన అభిమాన గాయకుడైన మహమ్మద్ రఫీ, నౌషాద్ సంగీత దర్శకత్వంలో 1951 లో వచ్చిన 'దీదార్' చిత్రంలోని 'హుఏ హమ్ జిన్ కే లియే బర్ బాద్ ' అనే పాటను ఆలపించడం జరిగింది. శ్రీ శాస్త్రిగారు పి బి శ్రీనివాస్ కి బంధువు కూడా.

1952 లో జెమినీ వారు నిర్మించిన 'మిస్టర్ సంపత్' లో పాటతో పిబి శ్రీనివాస్ తొలుత జెమినీ వారి హిందీ సినిమాతో నేపథ్య గాయకునిగా తన ప్రస్థానం మొదలుపెట్టారు. ఆ చిత్రంలో శ్రీనివాస్, గీతా దత్ తో, శంషాద్ బేగంతో, జిక్కితో డ్యూయెట్లు, కోరస్ పాటలు, బృంద గానాలు పాడారు. గీతాదత్ తో పాడిన తొలి యుగళగీతం 'అజీ హమ్ భారత్ కే నారీ' బహుళ ప్రజాదరణ పొందింది. ప్రసిద్ధ రచయితా ఆర్ కె నారాయణ్ చే రచింపబడి, అదే పేరుతో చలనచిత్రంగా రూపొందించబడ్డ చిత్రం 'మిస్టర్ సంపత్'. ఆ తర్వాత 'మిస్టర్ సంపత్' చిత్రానికి శబ్ద గ్రాహకుడిగా పనిచేసిన మిత్రుడు శ్రీ జీవా సహాయంతో శ్రీనివాస్ దక్షిణ భారత చలనచిత్ర రంగం వైపు దృష్టి సారించారు. ఆ సమయంలో దక్షిణ భారత చలనచిత్ర రంగంలో పేరుగాంచిన నటుడు, దర్శకుడు శ్రీ ఆర్ నాగేంద్రరావు, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఏకకాలంగా చిత్రనిర్మాణానికి పూనుకున్నారు. అదే-తమిళంలో 'జాతకం', తెలుగులో 'జాతకఫలం', కన్నడంలో 'జాతకఫల' పేర్లతో రూపు దిద్దుకున్న చలనచిత్రం. ఆ చిత్రం మూడు-భాషల్లోనూ శ్రీనివాస్ తలో రెండు పాటలు పాడటం జరిగింది.

కన్నడ చిత్రసీమలో సూపర్ స్టార్ డా. రాజ్ కుమార్ నటించిన 'భక్త కనకదాస' చిత్రానికి గాను, పి బి శ్రీనివాస్ పాడిన 'బాగిలను తేరేడు' అన్న పాట అఖండ ప్రజాదరణ పొందింది. ఆ పాట గొప్ప హిట్ కావడంతో ప్రసిద్ధ కన్నడ నటులైన విష్ణువర్ధన్, శ్రీనాద్, కళ్యాణ్ కుమార్, ఉదయ్ కుమార్ తదితర గళాలకు పి బి శ్రీనివాస్ నేపథ్య సంగీతం అందించడం మొదలుపెట్టారు. 'ప్రేమపాశం' చిత్రంలో పి బి శ్రీనివాస్ తన సోలో సాంగ్ పాడారు. అదే చిత్రంలో పి బి శ్రీనివాస్ శ్రీమతి పి సుశీలతో కలిసి ఒక యుగళగీతం కూడా పాడారు.

1956 లో 'బహిలేశ్వర' అనే చిత్రంలో రాజ్ కుమార్ కు తొలిసారిగా తన గాత్రాన్నందించారు. ఆ తర్వాత పి బి శ్రీనివాస్ వెనక్కి తిరిగి చూసుకోలేదు. వారిద్దరి అనుబంధం అనేక సంవత్సరాలపాటు కొనసాగింది. ఎన్నో ఏళ్ళు పి బి శ్రీనివాస్ రాజ్ కుమార్ కు పాటలు పాడారు. అభిమానులు, క్రిటిక్స్, చిత్రపరిశ్రమలోని ప్రముఖులు వారి పాటలను అత్యంత ఆదరాభిమానాలతో స్వీకరించారు, ప్రోత్సహించారు.

తమిళ చిత్రసీమలో పి బి శ్రీనివాస్ ఎక్కువగా జెమినీ గణేశన్ కి పాడారు. వారి కలయికలో వచ్చిన 'నిలవే ఎన్నిదమ్ నేరుంగతే' అన్న పాట అత్యంత జనాదరణ పొందింది. మిగతా కధానాయకులకు కూడా శ్రీనివాస్ ప్లే బ్యాక్ పాడినా, ఎందుకో ఎం జి రామచంద్రన్, శివాజీ గనేశన్ లకు తక్కువ పాటలు పాడటం జరిగింది. కానీ తమిళ చిత్రసీమలో జెమినీ, ముత్తురామన్, రవిచంద్రన్, జయశంకర్ లకు పి బి శ్రీనివాస్ ఎక్కువ పాటలు పాడటం జరిగింది. 1964 లో విడుదల అయిన గొప్ప హిందీ చిత్రం 'మై భీ లడకీ హూన్'

చిత్రంలో లతా మంగేష్కర్ తో కలిసి పాడిన 'చందా సే హోగా వో ప్యారా' పాట అత్యంత ప్రజాదరణ పొందింది. ప్రసిద్ధ తమిళ సంగీత ద్వయం విశ్వనాథన్-రామ్మూర్తి స్వరపరచిన 'పావ మన్నిప్పు' చిత్రంలోని కన్నదాసన్ రచన 'కలంగిలిల్ అవల్ వసంతం' అన్న పాటకు శ్రీ పి బి శ్రీనివాస్ గొంతులో కొత్త పరవళ్ళు తొక్కింది. అంజలీ పిక్చర్స్ వారి 'అడుత్త వీట్ పెన్' అన్న చిత్రంలో పి బి శ్రీనివాస్ కొన్ని మధురమైన గీతాలను ఆలపించారు. ప్రసిద్ధ గాయనీమణులైన పి సుశీల, ఎస్ జానకి, పి భానుమతి, కె జమునారాణి, ఎల్ ఆర్ ఈశ్వరి మొదలైన వారితో ఎన్నో మధురమైన యుగళగీతాలను ఆలపించారు పి బి శ్రీనివాస్. లతా మంగేష్కర్ తో కలిసి మై భీ లడకీ హూన్ చిత్రంలోనే కాక ఇతర చిత్రాలలో కూడా కలిసి పాడారు. ఇవేకాక కొన్ని భక్తిరసాత్మక, ప్రైవేట్ ఆల్బమ్ లు కూడా పి బి శ్రీని వాస్ ఆలపించి విడుదల చేసారు. అందులో ప్రముఖమైనవి శారద భుజంగ స్తోత్రం, శ్రీవేంకటేశ్వర సుప్రభాతం, ముకుందమాల, శ్రీ మల్లికార్జునస్తోత్రం, పురందరదాసు కీర్తనలు మొదలైనవి. చెన్నై లో గల వుడ్ లాండ్స్ డ్రైవ్ ఇన్ రెస్టారెంట్- హోమ్ ఎవే ఫ్రమ్ హోమ్ లో ఏకాంతంగా ఒక పక్కన కూర్చొని, ఏవేవో వ్రాసుకుంటూ, అనేక మధుర గీతాలకు ప్రాణాలు పోయడం ఎంతోమంది గమనించేవారు. సంగీత సంబంధమైన అనేక సంస్థలలో వారు పాల్గొనేవారు.

దక్షిణ భారత చలనచిత్ర సీమలో అడుగు పెట్టిన రెండు సంవత్సరాలలోనే శ్రీ పి బి శ్రీనివాస్ మళయాళ చిత్ర ప్రేక్షకులకు తన గళాన్ని పరిచయం చేసారు. పి బి శ్రీనివాస్ మళయాళ చలనచిత్ర రంగ ప్రవేశంపై విభిన్న వాదనలున్నాయి. కొందరేమో 1952 సంవత్సరంలో 'అమ్మ' చిత్రం ద్వారా మళయాళ చిత్రరంగ ప్రవేశం చేసారంటే, మరి కొందరేమో 1954 లో 'పుత్రధర్మం' చిత్రం ద్వారా మళయాళ చిత్రరంగంలో తన గళం మొదటిసారిగా వినిపించారంటారు. కానీ, శ్రీనివాస్ '1955 లో 'హరిశ్చంద్ర' చిత్రంలో మలయాళం లో తను మొదటిసారిగా పాడానని' ఒక ఇంటర్వ్యూలో స్వయం గా చెప్పారు. ఆ పాట బ్రదర్ లక్ష్మణన్ సంగీత దర్శకత్వంలో తిరునయనార్ కురుచి మాధవన్ నాయర్ వ్రాసిన 'మహల్ త్యాగమె, మహితమె నింటె మార్గం' అనే పాట అని శ్రీనివాస్ చెప్పారు. ఆ తర్వాత మళయాళ చిత్రసీమలో శ్రీనివాస్ అనేక పాటలు పాడారు. కానీ తెలుగు, తమిళ పాటలతో పోల్చుకుంటే, మళయాళంలో పాడినవి తక్కువే అని చెప్పాలి. వారు పాడిన పాటలు ఎక్కువగా ఎం ఎస్ బాబురాజ్, జి దేవరాజన్ లు స్వరపరచినవే కావటం విశేషం. దక్షిణ భారత దేశ భాషల్లో అనేక శ్రావ్యమైన పాటలు పాడినప్పటికీ, కన్నడ భాషలో అనేకంగా ఎక్కువ పాటలు పాడిన ఘనత శ్రీనివాస్ కు దక్కుతుంది. సుమారు 3 దశాబ్దాలకు పైగా కన్నడ చలనచిత్ర నేపథ్య గాయకుడిగా అప్రతిహతంగా శ్రీనివాస్ కన్నడ చలనచిత్ర సీమను ఏలారు. ముఖ్యంగా ప్రఖ్యాత కన్నడ నటుడు రాజ్ కుమార్ కాంబినేషన్ లో శ్రీనివాస్ పాడిన పాటలు చరిత్ర సృష్టించాయి. రాజ్ కుమార్ కు మాత్రమే కాక శ్రీనాద్, విష్ణువర్ధన్, గంగాధర్, కళ్యాణ్ కుమార్, ఉదయ కుమార్ ప్రభృతులకు కూడా శ్రీనివాస్ నేపథ్యగానం పాడారు.

పైన తెలిపిన నటులకే కాక పిబి శ్రీనివాస్ ఇంకా రాజేష్, ఆర్ ఎస్ సుదర్శన్, రంగా, కె ఆర్ అశ్వథ్, నరసింహరాజు, బాలకృష్ణ, శివరామ్, అశోక్, జైజగదీష్, రాంగోపాల్, సంపత్, శంకర్ నాగ్, ఇలా అనేకమందికి ప్లేబ్యాక్ పాడారు. పైన చూపిన పట్టిక చూస్తేనే శ్రీనివాస్ తన గొంతు అరువివ్వని కన్నడ నటుడు లేడేమో అనిపిస్తుంది.

కేవలం నేపథ్యగాయకుడు మాత్రమే కాదు- పి బి శ్రీనివాస్ స్వతహాగా కవి. వారు 8 భాషలలో పాండిత్యం కలవారు. తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హిందీ, ఇంగ్లీషు, సంస్కృతం,

ఉర్దూ భాషలలో వారు ఎన్నో కవితలు వ్రాసారు. పై భాషలలో అనేక కవితలు వ్రాయడమే గాక, 1997లో ప్రఖ్యాత నేపథ్య గాయకుడు శ్రీ కె జె ఏసుదాస్, శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 'లక్ష్మణ శ్రుతి' అనే పేరు గల ప్రసిద్ధ సంగీత కార్యక్రమానికి హాజరయినపుడు, అప్పటికప్పుడు కొద్ది సెకన్ల వ్యవధిలో వారిరువురినీ పొగుడుతూ గీత రచన చేసి, ఆలపించి వారిద్దరి మరియు ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు. ఒక ఉర్దూ పండితుని వద్ద ఉర్దూ భాష నేర్చుకున్నారు. జె మహేంద్రన్ దర్శకత్వం వహించిన 'నందు' అనే తమిళ సినిమాకు రెండు ఉర్దూ ఘజల్స్ వ్రాసారు. అవి - 'కైసే కహూన్, కుచ్ కెహనా సకూన్' అనే ఘజల్, భూపేంద్ర, ఎస్ జానకి ఆలపించారు. రెండవది ఎస్ జానకి ఆలపించిన 'హమ్ హై అకేలే' అనే పాట. రెండూ కూడా బహుళ జనాదరణ పొందినవే.

ఇవేకాక, నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తొలిసారిగా చంద్రునిపై కాలుమోపినపుడు, ఆ ఘనకార్యాన్ని కీర్తిస్తూ ఇంగ్లీషులో రెండు పాటలు వ్రాసారు. ఆ రెండు పాటలను తను స్వయంగా వ్రాయడమే కాక తనే స్వయంగా స్వర రచన చేసి, ఒక పాట తను విడిగా, ఇంకొకటి ఎస్ జానకితో కలసి యుగళగీతంగా ఆలపించారు. అవి మేన్ టు మూన్' (Man to Moon) అవి తను విడిగా పాడినది. రెండవది జానకితో కలిసి ఆలపించినది. ఈ రెండు పాటల గ్రామఫోన్ రికార్డులను అప్పటి అమెరికా ప్రెసిడెంట్ రిచర్డ్ నిక్సన్ కు, చంద్రునిపై తొలిసారిగా కాలు మోపిన నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ కు పంపగా, వారు పి బి శ్రీనివాస్ పై ప్రశంసల వర్షం కురిపించారు.

శ్రీ పి బి శ్రీనివాస్ కు అభిమాని, సంగీత ప్రేమికుడు శ్రీ కె నటరాజన్ , బెంగళూరు లోని మల్లేశ్వరం ఎమ్ ఎల్ ఎ సహాయ సహకారాలతో, బెంగళూరులో గల సదాశివ నగర్ పార్కును పి బి శ్రీనివాస్ పార్కుగా పేరు మార్చి ఆ సంగీత సార్వభౌమునిపై తనకు గల అభిమానాన్ని చాటుకున్నారు.

శ్రీ ఆర్ శ్రీనాద్ రచించిన, పి బి శ్రీనివాస్ జీవిత చరిత్ర 'మాధుర్య సార్వభౌమ డా. పి బి శ్రీనివాస్ - నాదయోగియ సునాదయాన' అను పుస్తకం 7 మే 2013 న బెంగళూరు పేలస్ గ్రౌండ్స్ లో ప్రఖ్యాత నేపథ్య గాయకులు శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, శ్రీమతి వాణి జయరాం, శ్రీ కె జె ఏసుదాస్ గార్ల చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఆ పుస్తకం 2013 వ సంవత్సరంకు గాను కర్నాటక రాష్ట్ర ప్రభుత్వంచే 'చలన చిత్ర చరిత్రలో ఉత్తమ పుస్తకం (Best Book on Cinema Literature) గా గుర్తింపు పొందింది.

కర్నాటక రాష్ట్రమునకు చెందిన రెండవ అత్యుత్తమ పురస్కారం 'కన్నడ రాజ్యోత్సవ ' అవార్డును కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పి బి శ్రీనివాస్ కు ప్రదానం చేసారు.

తమిళనాడు రాష్ట్రం ప్రదానం చేసిన గౌరవ పురస్కారం 'కలైమామణి' శ్రీ పి బి శ్రీనివాస్ కు దక్కింది. సూపర్ స్టార్ రాజ్ కుమార్ కుటుంబ సభ్యులచే ప్రదానం చేయబడిన 'డా. రాజకుమార్ సౌహార్ద పురస్కారం శ్రీ పి బి శ్రీనివాస్ స్వీకరించారు.

కర్నాటక రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా కర్ణాటక విశ్వవిద్యాలయం, హంపి వారు ప్రదానం చేసిన ప్రతిష్టాత్మక 'కర్నాటక నాదోజ అవార్డు' స్వీకరించడం జరిగింది.

తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర గౌరవ పురస్కారం 'కలైవనార్' 2002 సంవత్సరానికి గాను శ్రీ పి బి శ్రీనివాస్ కు ప్రదానం చేయడం జరిగింది.

14 ఏప్రిల్ 2013 వ తేదీ నాడు, చెన్నైలో గల తన స్వగృహంలో గుండెపోటుతో శ్రీ పి బి శ్రీనివాస్ కన్నుమూసారు. ఆరోజు తమిళులు ఉగాది ఉత్సవ కార్యక్రమాలు జరుగుతుండటంతో, ఆ మరుసటి రోజు వారి పార్థివ శరీరానికి దహన సంస్కారాలు జరిగాయి.

సంగీత సరస్వతి కంటినుండి రెండు అశ్రు బిందువులు రాలాయి, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ పి బి శ్రీనివాస్ మరణంతో.

# అస్తమానూ లడ్డూలేనా



## ఎలెక్ట్రాన్

గురజాడ విజయనగరం జిల్లా-నుంచి కందుకూరి రాజమహేంద్ర-వరం జిల్లాకి బదిలీ మీద వచ్చిన భావనారాయణ చాలా గడుసు మనిషి. భావనారాయణ సంగతి ఒక్క నిముషం పక్కన పెట్టి, జిల్లాల పేర్లని ఇలా రాస్తున్నందుకు నా తర్కాన్ని కాస్త మీ ముందు పె-ట్టాల్సిన అవసరం ఉంది. సాధార-ణంగా జిల్లాలు జిల్లా కేంద్రపట్టణం పేరిట ఉంటాయి. అయితే, నా సా-ధారణమైన లోకజ్ఞానం పరిమితుల మేరకు- ఇదివరకు మదరాసు ప్రా-విన్స్ తో కలిసి ఉన్నప్పుడు, విడిపో-యినప్పుడు, తెలంగాణ ప్రాంతంతో విలీనమైనప్పుడు, తిరిగి విడిపోయి రాయలసీమకోస్తాంధ్రగా లేదా సీ-మాంధ్రగా లేదా శేషాంధ్రగా మిగి-లినప్పుడు తూర్పు గోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణాజిల్లా తప్ప మిగిలినవన్నీ ఊర్ల పేర్లకే అం-కితమైపోయి ఉన్నాయి. మధ్యలో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ప్రకాశం ఒంగోలు జిల్లా అని రెండు పూర్వపద జోడింపులు జరిగాయి. అలాగే తెలంగాణ విశాలాంధ్రనుం-చి విడిన తర్వాత ముప్పైఒకటి జి-ల్లాలుగా పునర్వ్యవస్థీకరించబడి, బహు జిల్లాలకు ఒకప్పటి ప్రము-ఖుల పేర్లని జంట పేర్లుగా అతి-కించేశారు. ఇప్పుడు రాష్ట్ర సర్వీసు పరీక్షల్లో జిల్లాలపేర్లు రాయమంటే అభ్యర్థులు కుదేలైపోవాల్సిందే!

తూ.గో.జిల్లా కేంద్రం కాకినాడైతే, ప.గో.జిల్లా కేంద్రం ఏలూరైతే, కృ-ష్ణాజిల్లా కేంద్రం మచిలీ పట్నం. వీటికి ప్రముఖుల పేర్లు తగిలించ-డం కొంచెం కష్టమే! అయితే చిన్న-రాష్ట్రాలూ, చిన్న జిల్లాలు రాజకీయ పదవులతో సహా ఎన్నోఉద్యోగావ-కాశాలు కల్పిస్తాయి కాబట్టి, రేపు తూ.గో.జిల్లా ముక్కలైతే రాజమం-డ్రి, కాకినాడ జిల్లాలు, అదనంగా కోనసీమ లేదా బాలయోగి అమ-లాపురం జిల్లా, అలాగే ప.గో. ము-క్కలైతే, ఏలూరు, భీమవరం, నర్సాపురం, తాడేపల్లి గూడెం అంటూ మరో నాలుగు అవతరిం-చవచ్చు. ఆయాప్రాంతాల ప్రము-ఖుల పేర్లని చరిత్రల్ని తిరగవేసో, లేక ఆందోళనలు లేవదీసో జిల్లాల పేర్లతో జోడించ వచ్చు.

అందుచేత నేను గురజాడ విజ-యనగరం జిల్లా, లేదా కందుకూరి రాజమహేంద్రవరం జిల్లా అంటు-న్నానంటే, ఆ రోజులూ దగ్గరపడ్తు-న్నాయన్న ఉద్దేశ్యంతోనే అన్నాను కానీ అంతకు మించిన దురుద్దేశ్యం ఏమాత్రం లేదు. అదీకాక కథలకి యితివృత్తాలు గతంలొంచో, వర్త-మానంలొంచో తవ్వుకోవాలన్న నియమం లేదుకాబట్టి, రేపటి-లోంచి కూడా సృష్టించుకోవచ్చు.

సరే, తిరిగి భావనారాయణతో నాకున్న బాదరాయణసంబంధం గురించి చెప్పుకోవాలి కదా? మేమి-ద్దరం ఒకేసారి రాష్ట్రప్రభుత్వ సేవా-రంగపు పరీక్షలు రాశాం. రాత పరీ-క్షల్లో ఉత్తీర్ణులైన జాబితాలో నేను ఆరోవాణ్ణి. భావనారాయణ వంద దాటే. అయితే ముఖాముఖీలు జరిగిన తర్వాత అతగాడు ఆరో-స్థానంలో, నేను అష్టోత్తరశతస్థా-నంలో! రాత పరీక్షల్లోని కఠినత్వం కాని, సులభత్వం కాని అందరికీ ఒకటే అయినా, ముఖాముఖీలు బహుముఖాలుగా ఉంటాయి. రా-మాయణంలోని రాముడి భార్య పేరు చెప్పమన్నదానికీ, భాగవ-తంలోని కృష్ణుడి అష్ట భార్యలపే-ర్లు చెప్పమన్నదానికీ ఎంతటితేడా, అదెంతటి తేడా?! కోటీశ్వరులెవ-రు ప్రోగ్రాముల్లో ఇలాంటి ప్రశ్నలు ఒకర్ని కుబేరుల్ని చేస్తే, మరొకరిని కుదేలు చేసి పారేస్తాయి. స్థాయి, ర్యాంకుల మాట దేముడెరుగు-కాని, వధువు అత్తింట్లో అడుగు పెట్టేనే బియ్యం చెంబుని కుడి-పాదంతో తన్నేసినట్లుగా, అసలు ముందస్తుగా ప్రభుత్వపు ప్రాంగ-

ణాల్లో అడుగుపెట్టి, మొదటినెల జీతంకోసం ఎదురు చూడ్డమే ప్రధానం కాబట్టి, ఉద్యోగం వచ్చిన కొత్తలో ఈ విషయం కొంతగా తప్ప అంతగా బాధించదు.

ఒకసారి ఉద్యోగంలో అడుగు పెట్టిన తర్వాత అందరి ఎదుగుదలా ఒకేలా ఉండదు. తలలో నాలికలు, తలతిక్క వ్యవహారులు, సిఫారసుల రాకుమారులూ, పైరవీల వీరులూ, రాజకీయ సంబంధీకులు, చివరగా ఏ ఎండకాగొడుగులూ-ఇలా రకరకాల అస్తిత్వాలు దర్శనమిస్తాయి. ప్రతివారి ఎదుగుదలకీ ప్రమాణాలే వేరు. సరే, ఇంతవరకూ ఒకే వ్యవస్థ బాదరాయణ సంబంధమే తప్పించి, భావనారాయణతో నాకు ఎలాంటి వ్యక్తిగతమైన పరిచయం లేదు. నెల్లూరునుంచి నేనూ, విజయనగరంనుంచి అతనూ రాజమహేంద్రవరానికి బదిలీ కావడంతో వ్యక్తిగతమైన పరిచయం కలిగింది. మా ఆఫీసులో అతనిది హోదాలో రెండోస్థాయి, నాది నాలుగో స్థాయి. అంటే మధ్యలో రెండు మెట్లు దాటేసి ప్రథమస్థాయికి ఒకమెట్టు దూరంలో ఉన్నాడు. మూడోస్థాయి పెద్దమనిషి కుంభకర్ణుడే! ఆయన ఎవరికీ పనిచెప్పడు, ఎవరూ అతనిచేత పని చేయించలేరు.

మొదటి రోజు పరిచయంలోనే ‘మీరూ, నేనూ ఒకే బ్యాచ్ ఉద్యోగులమన్నమాట! గుడ్!’ అన్నాడు భావనారాయణ. అది సంతోషమో, అవహేళనో నాకు అర్థం కాలేదు. మొదటి వారంలోనే అతని పద్ధతులు, ప్రవర్తనా కొంతగా అవగాహనలోకి వచ్చాయనిపించినా, మనిషిని అర్థంచేసుకోవడం కష్టమేననిపించింది. చాపకింది నీరులా కొన్ని లోపాయికారి కథనాలు తెలియవచ్చాయి.

తరాల మార్పులతో ఇంటా బయటాకూడా జీవనశైలి మారుతుంది. అలాగే ప్రభుత్వాలు మారినప్పుడల్లా సైద్ధాంతికంగా, పాలనాపరంగా కొన్ని మార్పులు తథ్యం. పాతుకుపోయిన పార్టీ ఓడిపోయినప్పుడు కొత్తపార్టీ మద్యానిషేధాన్ని అమలుపర్చింది. ఖజానాకి చిల్లులు పడ్డంతో మళ్ళీ మద్యపానం రెట్టింపుబలంతో పుంజుకొంది. మద్యపానుల వళ్ళూ, యిళ్ళూ గుల్లలౌతూన్నసంగతి వేరు! తాగుబోతు వాహన చోదకులవల్ల రహదారి ప్రమాదాలు ఎక్కువౌతున్న సంగతి వేరు!

సురమీది శుల్కం రాష్ట్రాదాయాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచేసింది. కేవలం తయారీ, అమ్మకాలకి అనుమతుల జారీల మీదనే కాకుండా, ఊర్లమధ్యా, రహదారుల పక్కనా మద్యశాలలు ప్రత్యక్షమవడంతో అధికారకంగా ప్రభుత్వ ఖజానేలే కాదు, పక్కదారులమ్మట కొందరి జేబులు కూడా నిండే అవకాశాలు మెండయ్యాయి. ఒక్క గుజరాత్ లో మొదట్నుంచీ, ఇటీవలికాలంలో బీహార్లో తప్ప దేశమంతటా ప్రభుత్వ ఖజానాలకి ఇదే ఓ పెద్ద ఆదాయమార్గం అయిపోయింది. విజయనగరంలో ఉన్నప్పుడు మద్యపాన విస్తరణలో, అమ్మకాల లక్ష్యసాధనలో భావనారాయణ అనేకమైన సూచనలూ, సలహాలూ ఇచ్చాడట. తర్వాత పాలకుల కండువాల రంగులు అటూ యిటూ మారినా, మద్యం పట్ల పాలసీ మారలేదు.

ఓ రోజున తాగుడికి బానిసైన మా ఆఫీసు బిళ్ళబంట్రోతు బీహారు ప్రభుత్వాన్నిఆశ్చర్యకరంగా బహిరంగంగా మెచ్చుకొన్నాడు! అదే కాక తనలాంటివారు తాగుడు బానిసలవడానికి కారణం ప్రభుత్వ పథకాలేనని, విశాఖజిల్లా నాయకుల ప్రోద్బలంవల్లనేనని అరిచాడు. అది భావనారాయణకి సూటిగా తగిలింది. అలా నోరు జారినందుకు భావనారాయణ కోపగించక నవ్వుతోనే అతన్ని మందలించాడు. ‘ఓరి, అమాయకుడా! నీకు నెలనెలా నాగా లేకుండా జీతం ఎలా వస్తోందో తెలుసా? మద్య రాబడిమీదే! నువ్వన్నది నన్ను కాదు, మన ప్రభుత్వాన్ని! ఆఫీసైన తర్వాత నువ్వు ఎలా అఘోరించినా నీ ఇష్టం కానీ, తాగొచ్చి ఇలా ఆఫీసులో కారుకూతలు కూస్తే, నీ గోతిని నువ్వే తవ్వుకున్నట్లవుతుంది. ఈ సారికి క్షమించి వదిలేస్తున్నాను. పెద్దాయనకి తెలిస్తే నిన్ను రక్షించడం నా తరం కాదు!”

భావనారాయణ లౌక్యుడు. రాగానే అన్నీ తనేనన్నట్టుగా ప్రవర్తించసాగాడు. మామూలు పలకరింపుల్లో, అతిసాధారణమైన ఆఫీసు పనుల్లో తన చెయ్యే పైఎత్తున ఉండాలన్న ఆకాంక్ష ద్యోతకమైయ్యేది. భావనారాయణ ఓ రామారావుతో మరో సుబ్బారావుని గురించి మాట్లాడితే,

ఎదుట లేని సుబ్బారావుని ఆకాశానికి ఎత్తేస్తాడు. దాంతో రామారావు మనోస్థైర్యంతో మొహాన అవునవుననే భావముద్ర వేసుకుని వినాల్సిందేతప్ప, ఒక్క మాటని కాదన్నా భావనారాయణ ఎలాంటి మెలికలు పెడ్తాడో ఊహించడం కష్టం. బిళ్ళబంట్రోతు సరిగా పనిచేయకపోతే, అతగాడితో పనిచేయించుకొనే లౌక్యం మాకు లేదనడు కాని, నేర్చుకోవాలంటాడు! కుంభకర్ణులవారి ఊసేత్తితే 'కొండలతో ఢీ కొడ్తే పొట్టేళ్ళ బుర్రలు బద్దలౌతాయి తప్ప ప్రయోజనముండదు. ఆయన రావణాసురుడి సోదరుడన్న సంగతి మరవకండి!' అని సలహా యిచ్చేవాడు.

కొత్తగా వచ్చిన జిల్లాకాబట్టి అద్దెకొంపలో ఆఫీసు. భావనారాయణ ఆఫీసులో బదిలీమీద వచ్చి చేరగానే అద్దెకొంప ఆధునీకరణకి, సుందరీకరణకి పెద్దాయనచేత ప్రోపోజల్స్ పెట్టించేశాడు. భవననిర్మాణంకోసం జైలు రోడ్డులో స్థలం కేటాయించబడింది. అయితే రహదారి, భవననిర్మాణ శాఖామాత్యులవారికి శంకుస్థాపనకి ముహూర్తం కుదరలేదు. ఆయన కొత్తరాజధాని చుట్టుపక్కల అనేకానేకమైన నిర్మాణాల శంకుస్థాపనలతో, పిల్ల రహదారుల ప్రారంభోత్సవాలతో క్షణం తీరికలేకుండా ఉన్నాడు. ఆ హక్కు కేవలం తనదే అంటాడు. అదీకాక, శంకుస్థాపన ముహూర్త నిర్ణయంలో కృష్ణాతీర పండితులకీ, గోదావరీతీర పండితులకీ బేధాభిప్రాయాలు వచ్చాయి. ఒక రాజమహేంద్రవరం ఘనాపాఠి తన లెక్కలప్రకారం ఆ మంత్రిగారి జన్మదినం తప్పనీ, అందుకని ఆయన జన్మనక్షత్రం, జాతకచక్రం ఈ భవననిర్మాణ శంకుస్థాపనకే కాకుండా ఆయనకి ఆయుఃపరంగా కూడా అనువుగాలేవని చెప్పడంతో, ఆ విషయం ఓ తిరుపతి పండితుల బృందం విచారిస్తోంది. మరే శాఖామంత్రిని అభ్యర్థించినా, ఆదేశించినా, రహదారి భవనాల మంత్రిగారికి శాస్తి జరగాలని ఎవరూ కావాలనే ముందుకు రాలేదు. ఇంకా శంకుస్థాపనైనా జరగని ఆ కొత్తభవనం వచ్చేలోగా ఈ అద్దెకొంపకి ఆఫీసుకళ తీసుకురావడానికి ప్రణాళిక తయారైంది.

"కొత్తగా ఆఫీసు భవననిర్మాణం అనుమతింపబడడం, స్థలనిర్దేశం జరిగిపోయింది కాబట్టి ఈ అద్దెకొంపమీద ఇంతఖర్చు అనవసరం!" అన్నాడు విత్తశాఖని చూసే అధికారి రామలింగం. ఆయనకి తల నెరిసిపోయింది కానీ రంగేసుకొంటాడు. మాటలకి మట్టుకు రంగేయడం ఆయనకి చేతకాదు. ప్రతీ ప్రతిపాదనకీ అడ్డుపుల్ల వెయ్యడం ఆయన వృత్తి ధర్మం!

"ఇంతకాలం మీలాంటి వారి చాదస్తపు ప్రవర్తనావళితోనే కాలగతితో రావాల్సిన పురోగతి రాలేదు. ఆలోచనలు మహావృక్షాల్లా విస్తరించాలేకాని కుండీ మొక్కల్లా ఉండిపోకూడదు. నిర్ణయం లేకుండా మూలపడిన దస్త్రాలకి దస్త్రాలు కోటయ్యకాజా కాకినాడ జిల్లానుంచి ఇక్కడకు తరలించేశారు. ఆఫీసు వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటే పనులు పరుగులు తీస్తాయి. ఆఖరికి తపాలబిళ్ళలు అమ్మే పోస్టాఫీసుల్నికూడా ఆధునీకరణం చేసేశారు!" అన్నాడు భావనారాయణ.

"ఆధునీకరణం చేసిన తర్వాత తపాలాబిళ్లలు కావాలన్నా దొరకట్లేదు1" అన్నాడు రామలింగం.

"కావొచ్చు. సెల్ ఫోన్లొచ్చిన తర్వాత ఉత్తరాలు రాయడం తగ్గిపోయింది. స్టాంపులు అవసరమున్నవారు కేవలం తలమాసిన రచయితలు. పత్రికలిప్పుడు యి-మెయిల్ ద్వారా రచనలు స్వీకరించడం ప్రారంభించిన తర్వాత రచయితలకీ స్టాంపుల అవసరం మరింతగా తగ్గిపోయింది. మామూలు ఉత్తరం సరిగా బట్వాడా చేయబడదన్న భయం ముంచుకు రావడంతో, స్పీడ్ పోస్ట్ లు వచ్చాయి. అయిదు రూపాయల కవరులో పోయే ఒక పేజీ ఉత్తరానికి నలభై రూపాయలిస్తున్నాం. మనియార్డర్లు అదే రోజున పోస్టల్ నెట్లో వెళ్లిపోతున్నాయి. ఆ శాఖకి ఆదాయం పెరిగి పోస్టల్ ఉద్యోగులకు జీతాలు పెరిగాయాలేదా? అందుకని రామలింగంగారూ, మీరు మీ పాతకాలపు పద్ధతులలో ఖర్చుని గురించి చిన్న కామెంట్ చేసినందుకు మిమ్మల్ని తప్పు పట్టటల్లేదు కానీ, ఏ వ్యవస్థైనా ఎదగాలంటే ఎప్పటికప్పుడు మార్పు అవసరం. అందుకే మా తరం నిరంతరం ప్రయాసపడ్తోంది! కొత్త ఆఫీసు భవనం వచ్చినా, ఇప్పుడు అరచేతిలో

చూపించిన ఉద్యోగాల్లో అప్పటికి కొంత శాతం ముదురు బ్రహ్మచారులు భర్తీ అయి కొత్త కుర్చీల్లో కుదురుకొనే అవకాశం ఉంటుంది కాబట్టి, ఆ కొత్త శాల్తీలకి లేని పని సృష్టించడంతో బాటు కూర్చేడానికి చోటు కూడా చూపించాలి. హంగులన్నీ సమకూరేవరకూ ఆ కొత్త భవనం కూడా మనకి సరిపోదు. అద్దె ఆఫీసుని కొనసాగించాల్సిందే. ఆ యువ ఉద్యోగులు మీలాంటి అనుభవజ్ఞులతోబాటు కూర్చుని బూజులు పట్టిన పాతదస్త్రాలని తిరగేస్తూ ముందుగా పని నేర్చుకొంటారు. అవసరమొస్తే మన కొత్తజిల్లా అతిథిగృహం కట్టేవరకూ ఈ అద్దెకొంపని అతిథిగృహంగాకూడా వాడుకోవచ్చు. పదవీ విరమణ తర్వాత మన పూర్వఉద్యోగులు ఈ ఊరు స్వంతపనులమీద వస్తే అతిథి గృహంలో నిక్షేపంగా రోజుకి కేవలం పాతిక రూపాయల్లో ఉండొచ్చు. అందుకనే మనం విస్తృతంగా ఆలోచించాలికాని మితంగా కాదు!"

అధికృతకోసం నిష్కర్షగా మాట్లాడ్డం, వీలైనంతగా ఎగతాళి చేయడం, బుజ్జగిస్తోనే బుర్రమీద వాయించడం భావనారాయణ పద్ధతని స్పష్టాస్పష్టమైన మా మొదటి అవగాహన క్రమేపీ స్థిరపడసాగింది. భావనారాయణ అనతికాలంలోనే ఆఫీసు పెద్దగా ఎదిగిపోతాడని, అతనికి రాజకీయ ప్రాబల్యం చాలా ఎక్కువని భజనపరుల బృందం రూపొందసాగింది. దానితో భావనారాయణ గురించి ఏ ఒక్కమాటా చాటుగా చెప్పుకొనే అవకాశం లేకపోయింది. చెంచాగిరీ కూడా ఆఫీసు అస్తిత్వానికి రూపు దిద్దుతుంది.

ఓ రోజున భావనారాయణ కాజాతాపేశ్వరం మండలం లోని ఓ ప్రాథమిక పాఠశాల పనితీరు గమనించడానికి వెళ్ళాడు. ఆరోజున పెద్దాయన పరమేశ్వరంగారు నన్ను ప్రత్యేకించి పిలిచారు. "చూడండి నెల్లూరు ప్రకాశంగారూ! అరవైని అరవై అయిదుకి పెంచితేనే కానీ, నేను మరో ఆర్నెల్లలో మా సొంతూరు చెరుకురసం నూజవీడుకి పోవాల్సిందే. 'వృద్ధజంబుకాలకి సర్వీసు పెంచుకుంటూ పోతే, ఎప్పుడనగానో తండ్రులవయసులో అడుగు పెట్టేసిన, ప్రస్తుతం పెట్టేస్తోన్న మాకు ఉద్యోగాలెక్కణ్ణుంచి ఊడిపడ్తాయ'ని ఆందోళనలు లేచిపడ్తున్నాయి. డెబ్భై కాకపోతే కనీసం అరవై అయిదువరకూ సర్వీసు ఎందుకు పెంచాలో జస్టిఫై చేస్తూ ఓ డ్రాఫ్ట్ రాసి యివ్వండి. ఇలా మిమ్మల్ని అడిగిన సంగతి మీరు ఎవరికీ చెప్పొద్దు. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఏ దస్త్రంలోనైనా ఆఖరి సంతకం నాదే. భావనారాయణ గారు తమ అంతిమ పరిశీలనలో అవుననో, కాదనో- ఇవ్వొచ్చుననో,ఇవ్వకూడదనో- చెయ్యొచ్చుననో, చెయ్యకూడదనో రిమార్కులు రాసి పంపేస్తారు. నా కలం- ఆయన అవునంటే అవుననీ, కాదంటే కాదనీ నా బుర్రకు శ్రమలేకుండా సంతకం పెట్టేస్తుంది. ఇక్కడ భావనారాయణా, నేనా అన్నది ముఖ్యం కాదు. ఆ కుర్చీ, ఈ కుర్చీ- అంతే. అన్ని ఆఫీసుల తంతూ ఇదే. పదవీ విరమణ ముందు తప్పుడు నిర్ణయాలు తీసుకొంటే భుజాలమీద తలకాయ గర్వంగా నిలబెట్టి బయటి ప్రపంచంలో అడుగు పెట్టలేను. అందుకని భావనారాయణ నాకు పంపే దస్త్రాలనన్నింటినీ మీకు రహస్యంగా అందజేస్తూ ఉంటాను. మీరు వాటిని క్షుణ్ణంగా చదివి, దస్త్రంలో కాకుండా వేరు కాయితం మీద మీ అభిప్రాయం రాసి యివ్వండి. అప్పుడు నేను ధైర్యంగా ఏ నిర్ణయమూ తీసుకోగలుగుతాను. వైద్యరంగంలో సెకండ్ ఒపీనియన్ తీసుకోవడం సర్వసాధారణమేకదా?"

నాకు ఇదేదో మడతపేచీ లాగే కనబడింది. భావనారాయణ ప్రవర్తనావళి ఆయనకీ తెలియంది కాదు కాబట్టి, ఉద్యోగపు ఆఖరి రోజుల్లో, కొన్ని కొంపలుదీసే సంతకాలు పెట్టడం ఎంతో జాగ్రత్త పడవలసిన విషయమే కదా? అయితే నా అభిప్రాయాల్ని కాయితం మీద పెట్టడం నాకు ఇష్టం లేదు. అందుకని సాయంత్రాలు ఆయనింటికి పోయి అవుననో, కాదనో చెప్పడం మొదలు పెట్టాను. భావనారాయణ సరైనదే అన్నది నేనూ సరైనదే అనడం, అతను సరైనదే అన్నది నేను కాదనడం, అతను సరికాదన్నదాంతో నేనూ అంగీకరించడం, ఆఖరిగా అతను సరికాదన్నదాంతో నేను అంగీకరించకపోవడం- రమారమి పాతిక

శాతాలు. అందుకని మా ఏకాభిప్రాయపు దస్త్రాలమీద ఆయన ధైర్యంగా చేయగల సంతకాలు ఏభై శాతం మాత్రమే అని అనుకోవచ్చు. అయితే, అసలు దస్త్రాలమీద పెద్దాయన నిర్ణయాలు ఏమిటో తెలుసుకోవాలని కుతూహలం నాలో రేకెత్తింది. ఓ రోజున పెద్దాయనా, భావనారాయణా మామిడితాండ్ర ఆత్రేయపురానికి ఏదో గ్రామవికాస కార్యక్రమానికి వెళ్లినప్పుడు, పెద్దాయన గదిలోకి వెళ్ళి దస్త్రాలని చూశాను. నేను చెప్పిన అభ్యంతరాల్ని పెద్దాయన తన అభిప్రాయలుగా రాసి భావనారాయణని జస్టీపై చేయమన్నారు. భావనారాయణ కొన్నింటికి సమాధానాలిచ్చాడు. కొన్నింటికి మళ్ళీ రివ్యూ పెత్తానన్నాడు. పెద్దాయన నా అభిప్రాయాలకి విలువనిచ్చాడని ఎంతగానో పొంగిపోయాను.

పెద్దాయన పరమేశ్వరం గారికి అరవై పూర్తికాగానే పదవీ విరమణ డిసెంబరు 31 న జరిగిపోయింది. ఆయనకి ఘనంగా ఆఫీసులో చందాలతో- టీ పార్టీ జరిగింది. ఉప్పాడ దుశ్శాలువా కప్పడం జరిగింది. పెద్దాపురం పట్టువస్త్రాలు సమర్పించబడ్డాయి. వివాదం లేకుండా వీరేశలింగంగారి కంచు విగ్రహం కానుకగా యివ్వబడింది. ముద్దా సిద్ధుడుగారనే ఓ స్థానిక ఆధునిక కవి ఆయన్ని కీర్తిస్తూ అయిదు పేజీల వచన కవిత చదివాడు. ప్రత్యేక చందాలతో, పరిమితమైన సభ్యులతో గోదావరీ తీరానగల ఓ హోటల్లో మందు పార్టీ జరిగింది. ఎవరి గొడవల్లో వారుండగా, పెద్దాయన నన్ను ఓ పక్కగా తీసుకు పోయి ఓ సంగతి చెప్పాడు. "ఆ దస్త్రాలనన్నింటినీ మీకు చూపించి, మీ అభిప్రాయాల్ని తెలుసుకోవాల్సిందిగా చెప్పింది భావనారాయణే! నా తర్వాత కుర్చీనాక్రమించేది తానే కాబట్టి, మీ విశ్లేషణాశక్తిని అంచనావేసే అవసరం తనకుందని చెప్పాడు. అయితే ఒక సంగతి. మీరు నాకు చెప్పిన అభ్యంతరాల్ని నేను దస్త్రంలో రాస్తే, ఆయన సీరియస్ గానే తీసుకొని కావల్సిన మార్పులు చేశాడు! బతకనేర్చిన లౌక్యుడు. ఏది ఏమైనా మీరు మీ జాగ్రత్తల్లో ఉండాలి. మీతో కలిసి ఎక్కువకాలం పనిచేసే అవకాశం ప్రభుత్వం నాకివ్వలేదు. మీకు శుభం కలుగు గాక!" అని దీవించాడు.

మద్యం నిజాల్ని పలికిస్తుందనడానికి ఇంతకంటే ఉదాహరణ ఏం కావాలి? భావనారాయణ నిజంగానే నన్ను ఓ పావుగా వాడుకొన్నాడు. జనవరి ఆరో తారీఖున ప్రభుత్వోద్యోగులకి పదవీ విరమణ వయసుని అరవై రెండుకి పెంచుతూ ఉత్తర్వులొచ్చాయి! పరమేశ్వరంగారి పట్ల కొందరు జాలి చూపారు.

ఇక మాకు అవకాశాలు లేనట్లే అని నిరుద్యోగులు గొడవలు చేశారు. అదేసమయంలో అంబికా ఏలూరు జిల్లానుంచి అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో కంచు పతకం సాధించిన జట్టు నాయకురాలు నరసాదేవిని క్రీడాతేజమంటూ కందుకూరి రాజమహేంద్రవరం జిల్లాలోని మా ఆఫీసుకి అధికారిణిగా వడేశారు. భావనారాయణ కుదేలైపోయి బదిలీ చేయించుకొని గిడుగు శ్రీకాకుళం జిల్లాకి ఇక్కడున్న స్థాయిలోనే వెళ్ళి పోయాడు. అతని స్థానంలో మరెవరూ రాలేదు. మూడోస్థానం నిత్యనిద్రాదేవి ఒడిలో సేదదీరుతోనే ఉంది. నరసాదేవిది అలంకార పదవి. తత్కారణంగా రాజమహేంద్రవరం మా ఆఫీసు భారమంతా నా భుజస్కంధాలమీద పడిపోయింది. ఇది పెద్దాయన పరమేశ్వరంగారి దీవెన ఫలమో, వరమో, శాపమో నాకు తెలియదు.

భావనారాయణద్వారా ఆఫీసు వ్యవహారాల్లో నేను కొన్ని పాఠాలు నేర్చుకొన్నానన్న సంగతి అందరికీ చెప్పుకోవడం నా ధర్మం. చేసే ఉద్యోగంలో మెట్లెక్కాలంటే లౌక్యం ఒక సాధనం. లౌక్యమనేది బహురూపి. అసలు ఈ మానిప్యులేషన్ లేక లౌక్యం అనే పదం సమర్థత అనే ప్రక్రియకి ఆత్మ. సమర్థవంతుడి బలం అందులోనే.

అయితే లౌక్యుడైన భావనారాయణకి అనుకోకుండా గుణపాఠం జరిగిందనే అనుకోవాలి. అస్తమనూ లడ్డూలే తినేవారు ఎపుడో ఒకప్పుడు కాజా తినక తప్పదు!

***

పి.వి.రమణ రావు, 2-7-607,
ఎక్సైజ్ కాలనీ, సుబేదారీ,
పోస్ట్:హనమకొండ- 506001,
తెలంగాణ

సాహితీ సుధానిధి,తెలుగు రుబాయీ కవి సమ్రాట్టు,

# డా.తిరుమల శ్రీనివాసాచార్య



తుమ్మూరి రాంమోహన్ రావు

ఇప్పుడున్న తెలంగాణా పండితకవులలో అగ్రగణ్యులు డా.తిరుమలశ్రీనివాసాచార్యులు.పద్యం ,గేయం,విమర్శ,పరిశోధన,వ్యాఖ్యానం,జీవితచరిత్ర,సూక్తులు,అనుసృజన వంటి ప్రక్రియలు చేపట్టి అరవైకి పైగా గ్రంథాలు రచించిన వీరు తెలంగాణా ప్రభుత్వం ఏర్పడిన తరువాతఏర్పరచిన తొలి దాశరథి పురస్కార గ్రహీత కావడం విశేషం.ఆ పురస్కారాన్ని అందజేస్తూముఖ్యమంత్రి తిరుమలశ్రీనివాసాచార్యులు తనకు చిన్ననాట బడిలో చదువు చెప్పినగురువు అని ప్రకటించి పాదాభివందనం చేయటం ఆతార్యులతో పాటుసభాసదులందరికీ ఆశ్చర్యం గొలిపించిన విషయం.

అన్నిటి కంటే ముఖ్యం ఒకే ఒక రుబాయీ ప్రక్రియలో పాతికకు పైగా పుస్తకాలు ఆరువేలకుపైగా రుబాయీలు రాసిన అరుదైన ఘనత వీరిది.

అందుకే వీరిని తెలుగు రుబాయీ కవి సమ్రాట్టు బిరుదు వరించింది.

జనవరి ఒకటవ తేదీ పందొమ్మిది వందల ముప్పై ఎనిమిదిలో కరీంనగర్జిల్లా,నారాయణ పురం గ్రామంలో జన్మించిన శ్రీనివాసాచార్యులు తల్లి వేంకటమ్మ నుండిమంచి గుణాలను నడవడిని,తండ్రి పండిత వంశజులు సదాచార సంపన్నులుమనోహరాచార్యులనుండి పాండిత్యాన్ని అలవరచుకున్నారు.చిన్న నాటనే శ్రీవైష్ణవసంప్రదాయ సంబంధ తమిళ పాశురాలు,ముకుందమాల,శ్రీగుణరత్నకోశం వంటిగ్రంథాలనుండి శ్లోకాలు వాటితో పాటు వసుచరిత్రను పఠించారు. ఈనాటి తెలంగాణాప్రభుత్వ సలహాదారు కే.వి. రమణాచార్యులు గారి తండ్రి కే.వి.రాఘవాచార్యులుతిరుమలవారికి అగ్రజులే కాక గురువు కూడా.తిరుమల శ్రీనివాసాచార్య పాఠశాలచదువంతా ఆయన పర్యవేక్షణలోనే జరిగింది.ఆయన దేశికులే గాక బహు గ్రంథరచయిత.ఆయన సాన్నిధ్యంలో అనేక విషయాలను ఆకళింపు చేసుకున్నఅదృష్టవంతులు.




వీరి విద్యాభ్యాసం నారాయణ పురం,ఎల్లారెడ్డి పేట,సిరిసిల్ల,మెదక్ లలో జరిగింది.మెదక్బహుళార్థసాధక ఉన్నత పాఠశాలలో పన్నెండవ తరగతి గణిత,రసాయన,భౌతికశాస్త్రాలలో ప్రథమ శ్రేణిలో అందరి కంటే ఎక్కువ గుణములు పొంది పాఠశాల బోర్డు పై తనపేరుచూసుకున్న వీరు,వీరి అన్న కుమారుడైన కే.వి.రమణ గారికి స్ఫూర్తి దాయకంగా నిలిచారు.ఇంజనీరింగ్ చదవడానికి వయసు దాటిపోవడంతో ఉపాధ్యాయ వృత్తి చేపట్టిప్రైవేటుగా బి.ఎ.,ఎం.ఏ చదివి ఖమ్మం, కరీంనగర్ రాత్రి కళాశాల,సిద్ధిపేటలలో కొంతకాలం అధ్యాపకులుగా పనిచేసి ఆ పై హైదరాబాద్ లోని సర్దార్ పటేల్ కళాశాలలో స్థిరపడిఅక్కడి నుండే ఉద్యోగ విరమణ గావించారు.ఆ సమయం లోనే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డా.సి.నారాయణ రెడ్డి గారి పర్యవేక్షణలో 'తెలుగులో-

గేయనాటికలు అనే అంశం పై పరిశోధన చేసి డాక్టరేటు పట్టా గైకొన్నారు.

అటు ఉద్యోగం చేస్తూనే ఇటు రచనా వ్యాసంగాన్ని కూడా వదలకుండా ఈనాటివరకూ వి-శ్రమించకుండా కొనసాగిస్తున్నా-రు ఆచార్య తిరుమల శ్రీనివా-సాచార్యులు.

కరీం నగర్లో ఉన్నప్పుడు తన తొలి పొత్తం ఉదయరాగాన్ని డా-.దివాకర్ల వేంకటావధానిగారికి అంకితమిస్తూ ఆవిష్కరింప జే-సుకున్నారు.అలా వారి ప్రతి పు-స్తకాన్ని ఎవరో ఒక లబ్ధప్రతిష్ఠు-లకు అంకితమిస్తూ వస్తున్నారు. ఇటీవల వారు వారి ధర్మపత్ని రాజ్యలక్ష్మి (1949 -2016 )స్మృతిలో రాసిన సతీస్మృతి,బాల్యమిత్రునికి అంకిత మిస్తున్న స్నేహసుధ,-వివిధవిషయాలపై రాసిన వ్యా-సభారతి ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నాయంటే ఎనభై రెండేళ్లుదా-టినా ఆయనలోని కవితా తపన ఎంత ఉందో అర్థమౌతుంది. నిరంతరరచనా,ప్రసంగానుర-క్తులైన తిరుమలవారు ఒకప్పు-డు మంచిక్రీడాకారులు,గాయ-కులు,నటులు కూడా.

తెలుగు రుబాయీ కవిసమ్రా-ట్టు బిరుదాంచితులయిన ఆచా-ర్యులు తాను దర్శించినఅనేక ప్రాపంచిక విషయాలను,విషా-దానందానుభూతులను,అలతి పదాలతో అందమైనరుబాయీ-లుగా మలిచారు.స్నేహం గురించి



చెబుతూ

'మొక్క వృక్ష మవుతుంది
సుమఫలమవుతుంది
స్నేహం కూడా అంతే
విరాడ్రూప మవుతుంది'

అంటారు

అలాగే సతీ స్మృతిలో తనను వీ-డిదివికేగిన అర్ధాంగిని

'విరిసిన పూదోట ఒకటి
నవ ప్రభల బాట ఒకటి
నను ముందుకు నడిపించెను
నవాభ్యుదయ శక్తి ఒకటి'

అంటారు

వీరి సిద్ధాంత పత్ర పర్యవేక్షకులు సుప్రసిద్ధ సినీకవి,జ్ఞానపీఠపుర-స్కార గ్రహీతడా.సి.నారాయణరెడ్డి వీరితొలి గేయ సంకలనం 'గం-గాతరంగాల'కుముందుమాట రాస్తూఒకచోట"నేనెరిగిన డా.శ్రీ-నివాసాచార్య పాడుతూ పాట రాస్తాడు.అందుకే అది పాఠకు-డినిపాడేలా చేస్తుంది"అంటాడు. ఆయనే ఇంకా"నిత్యవికాసినిగా నిలిచే ప్రతిభ,వస్తుతత్వాన్నివి-శ్లేషించే పరిశోధన పాటవం,చె-ప్పదలచుకున్న అంశాన్ని నియ-తపదబంధురంగా చెప్పేనేర్పు -ఈ మూడు శక్తులూ అలవ-డిన సాహితీమూర్తి డా.తిరు-మలశ్రీనివాసాచార్య"అంటారు. అంతకంటే పెద్ద కితాబు ఏము-న్నది.

వీరి ప్రసంగం వినసొం-పుగ ఉండి,విషయబోధకంగా ఉంటుంది.డా.దివాకర్లవేంకటా-వధాని గారి సహవాసంలో ఉన్న వీరు వారి తరువాత వారంతటి వారనిచెప్పవచ్చు.అలాగే అనేక అవధానం,భువన విజయం వంటి సాహిత్యకార్యక్రమాలలో,-దేవాలయ బ్రహ్మోత్సవాలలో వ్యా-ఖ్యాతగా,పలు టీవీ కార్యక్రమాల-లో వీరిప్రతిభ పరిమళించింది.

వీరు పొందిన సన్మాన సత్కా-రాలు అన్నీ అన్నీ కావు.వీరి ఇంటి నిండాపుస్తకాలు,సన్మాన సత్కా-రాల గుర్తులైన జ్ఞాపికలే కనిపి-స్తాయి.

వీరి ఔదార్యం కూడా చెప్పుకోద-గినదే.పలుసంస్థలనుండి తన పేరిట,భార్య పేరిట, ప్రసిద్ధకవుల పేరిట ఏటా కొన్ని పురస్కారాలు వీరి ఆర్థిక సహకారంతో అందిం-చబడుతున్నాయి.

ఆజానుబాహు విగ్రహం,సుం-దర రూపం,పెదవుల పై చెరగని-చిరునవ్వు,మృదుభాషిత్వం,నిరా-డంబరత,స్నేహశీలత అన్నిటిని మించి ఔదార్యం తోపాటు పాం-డిత్యం,రచనాపాటవం కలగలి-సిన సౌజన్యమూర్తి డా.తిరుమ-లశ్రీనివాసాచార్యులు.

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**ఆధారాలు : 1) ల = అసలు అక్షరం 'ర'; 2) హ = అసలు అక్షరం 'చ'**


**ఖలశిది బిలి ఘాలయా**
**బిలిది వలుతు ఘాలయా**
**వలుతుది దామ ఘాలయా**
**దపినెంహే వర్రిది నిర్ర ఘాలయా**

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)


**గతనెల జవాబు :**

పాట పాడుమా కృష్ణా
పలుకు తేనె లొలుకు నటుల
మాటలాడుమా ముకుంద మనసు తీరగా
శృతి లయాదులన్ని చేర్చి
యతులు నిన్ను మదిని తలచె
సదమల హృదయా నిన్ను
సన్నుతించు వరనామము

నవంబర్ నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు:
శ్రీ ఎం.ఎస్.పంతులు, గుంటూరు


శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

RNI No. TELTEL/2011/39497 DECEMBER2019 Postal No. HSE/1043/2017-19
Date of Publishing 1st December Date of Posting 8th December



పార్లమెంట్ లో
దిశ
ప్రకంపనలు








Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001